ఆంధ్ర సచిత్ర వార పత్రిక

1-4-83
150 పైసలు



జయసుధ సహజమైన అందాన్ని మరింత చేసేది లక్స్





సహజమైన తన చర్మ సౌందర్యానికి మెరుగులు దిద్దుకునేందుకు జయసుధ వాడేది లక్స్ మాత్రమే.

“నా చర్మ సౌందర్యాన్ని మరింత మృదువుగా,
అందంగా రూపొందిస్తున్నది లక్స్'' అంటుంది జయసుధ.

Jaya Sudha

శుద్ధమైన, సౌమ్యమైన లక్స్—
సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే సబ్బు

హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి విశిష్ట ఉత్పా

సంపూర్ణ పోషకాహారంలో అన్ని పోషక పదార్థాలు సరియైన పాళ్ళలో వుండాలి...



సిరిలాక్
సంపూర్ణ పోషకాహారాన్ని సిద్ధం చేస్తుంది— రుచికరమైన విధంగా.

మీ పాపకి నాలుగు నెలలు నిండి ఘన పదార్థాలు తీసుకోడానికి సిద్ధంగా వున్నప్పుడు, సిరిలాక్ గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి. మీ పాపకి సిరిలాక్ ఆహారంగా యిచ్చిన ప్రతి పర్యాయము సంపూర్ణ పోషకాహారం యిచ్చామనే నమ్మకం మీకు మరొకసారి కలుగుతుంది.


అనగా సిరిలాక్ యిచ్చిన ప్రతి పర్యాయము ఒక ఘన ఆహార పదార్థం నుంచి అవసరమైన అన్ని పోషకాలు. మాంసకృత్తులు, కాలరీలు, పాపకి లభిస్తున్నట్లే. ఆ యిస్తూ పోషక పదార్థాల లోపం తొలగించడానికి మరొకటి ఇవ్వవలసిన అవసరం లేదు.

గోధుమ పిండి, పూర్తి మీగడ పాలు, పంచదార రుచికరంగా కలిపి వుండడం చేత సిరిలాక్‌కి ఈ సంపూర్ణ పోషకత్వం, రుచి లభించాయి. శరీర నిర్మాణానికి మాంసకృత్తులు, శక్తికి పిండి పదార్థాలు. క్రొవ్వు పదార్థాలు, అన్ని విధాల పెరుగుదలకి అత్యంత అవసరమైన విటమిన్లు, ఖనిజాలు సిరిలాక్ అందచేస్తుంది.

మీ పాపకి సిరిలాక్ యివ్వండి—పాప బాగుగా, ఆరోగ్యంగా పెరగడానికి.



సిరిలాక్®
పాలు వుండనే వున్నాయి



సిరిలాక్ తయారు చెయడం ఎంతో సులభం. దీనిని ముందుగా మరగబెట్టిన, గోరువెచ్చటి నీటికి చేర్చండి. కలపండి వడ్డించండి.

SAA/FSL/C728/D TEL.

NESTLÉ



ముఖచిత్రం

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చూడముచ్చటగాయున్నది.

పి. పాండురంగారెడ్డి (చిత్తూరు)

* * *

జయప్రద ముఖచిత్రం చాలా బాగావుంది తెలుగు వారి సంస్కృతిని పోతపోసినట్లు, తెలుగు ప్రజల ఆడపడుచువలె చాలా ముగ్ధమనోహరంగా ఉండి ఆంధ్ర పాఠక లోకానికి ఆనందం కలిగించింది' అశేష అనంతమైన తెలుగు సంస్కృతి మూర్తీభవించినట్లుంది జయప్రద ముఖచిత్రం.

జైన శ్రీనివాస్ (మాదిమాణిక్యం)

జయప్రద

జయప్రద ఫోటోచూచి చాలా ఆనందమయినది.

ఎం. సుజాత (చీర్లవంచ)

ఆకర్షణీయం

జయప్రద చిరుదరహాస వదనారవిందంతో వెలువడిన 4.3.83 పత్రిక అత్యంతఆకర్షణీయంగా ఉంది. 'స్క్రీన్‌ప్లే' గురించి జి. వి. జి. గారి వ్యాసంద్వారా చాలా మంచి విషయాలు తెలిశాయి.

వోలేటి వెంకటరమణారావు (బండారులంక)

ఇ 'వేమన' పద్యాలు

"ఇ వేమన పద్యాలు" ఆపవద్దని మా కోరి:

షేక్‌మస్తాన్, ఇతరులు (ముమ్మలనేనివారిపాలెం రేపల్లె)

కొత్త శీర్షికలు

ఇటీవల 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' కొత్త శీర్షికలతో కొంగ్రొత్త అందాలను సంతరించుకొని కడు రమనీయంగా శోభిల్లుతోంది, అనటంఅతిశయోక్తి మాత్రంకాదు. న్యూఢిల్లీలేఖ ఆసక్తిదాయకంగా ఉంటోంది. కొత్తగొంతులు శీర్షిక టి. ఎల్. కాంతారావుగారు పరిచయం చేస్తున్న కవులు, కవయిత్రులు, వారు వ్రాసిన అమూల్య కవితలు చదివే ఆవకాశం కల్గిస్తున్నారు. వారికి నా అభినందనలు, కృతజ్ఞతలు. ఇవేమన పద్యాలు మన్నిత హాస్యాన్ని అందిస్తోంది. 'ధర్మపథం' చాలా ప్రయోజనకరమైన శీర్షిక. శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు అభినందనీయులు.

వై. చంద్రశేఖరరెడ్డి (నగరి)

న్యూఢిల్లీ లేఖ

25 2 83 సంచిక, న్యూఢిల్లీ లేఖ (జె. ఆర్.డి.తాతాగురించి ప్రచురించిన)చాలా హుందాగా వుంది. ఎప్పుడూ నెహ్రూవంశాన్ని, శ్రీమతిగాంధిని దుయ్యబట్టడంకంటే లోపాలు ఏ పక్షంలోనున్నా ఎత్తిచూపుటయే జర్నలిస్టుల కర్తవ్యం అని నా ఉద్దేశ్యం. జర్నలిస్టులు ప్రభుత్వ లోపాలను పెద్దదిగా చూపటంలోను, అదేపనిగా ప్రతిదానిని విమర్శించటంతో దేశానికి మేలు జరగదు

సి గంగాధరరావు (తిరుచ్చి)

* * *

"న్యూఢిల్లీ లేఖ"చాలా ఆసక్తికరముగా, విజ్ఞాన) దాయకముగా యున్నది. ఆసియాడ్ గురించి, నెహ్రూకుటుంబమును గురించి చాల విషయము లను తెలియ జేశారు

డాక్టర్ అబ్దుల్ అలి అహ్మద్ (కువైట్)

పరిహాస పరీక్ష

పరయూ తీరాన ,త్రిజటు
పరిహాస పరీక్షకు నిలబడగా, ఆ దా
శరధి, ప్రజలు, యయోధ్య న
గరమందు పాఠకులకును గణపతి నిః


పి. చాడీశ్వరి (ఒంగోలు)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 1–4–'83
దుందుభినామ సం. ని॥ ఫాల్గుణ శు. చవితి
సంపుటము 75 : సంచిక 31
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
విడి ప్రతి వెల రు. 1–50
ఆరుమాసాల చందా రు. 42–90
పోస్టులో ఏడాది చందా రు. 85–80
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

— లోకంపోకడ —



మన మహా - వాశ్రా ...



ఈ మధ్య చిన్న చిన్న బడ్జెట్‌లు విన్నో రావటంతో ప్రణబ్ ముఖర్జీ సమర్పించిన తాజా బడ్జెట్‌ని చాలా మందే పట్టించుకోకపోవచ్చు. నాకు తెలిసిన వాళ్ళలో సగం మందికి ఒక వార్షిక బడ్జెట్ ఏదో బయటపడపోతోందని సగం — సగం తెలుసు. మిగిలిన సగం మందికి దాన్ని గురించి లెక్క లేదు. "గవర్న్‌మెంటు వారి అంకెలు "ఎవరు నమ్ముతారు ?" అన్నాడు ఒక యువకుడు. "ఇదంతా మన కళ్ళు కప్పటానికే వాళ్ళు చేస్తున్నారు !"

"వాళ్ళు" ఎవరు ? "మనం" ఎవరు ? "వాళ్ళు" ఎవరంటే పెద్ద — ప్రభుత్వం వాళ్ళు, తెల్ల బట్టలు వేసుకుని వైభవంగా కారులలో తిరిగే రాజకీయ వాదులు (వాళ్ళంటే ఆఫీసులు మారే అనామకులయిన అధికారులు.) 'మనం" అంటే మీరూ — నేనూ — ఇక్కడా — అక్కడా — పని చేసే వాళ్ళం — బస్ స్టాండుల దగ్గిరా, రేషను షాపుల దగ్గిరా క్యూలో నుంచునే వాళ్ళము — బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి లెక్కలు వేసుకునేందుకు వీలుగా పన్నులు చచ్చిచెడి కట్టే వాళ్ళం.

"వాళ్ళ" కీ, "మన" కీ పడకపోవడం మన సమాజంలో వచ్చిన ఒక కొత్త పరిణామం. ఇది సుమారు 15 సంవత్సరాల కింద మొదలయింది. అంటే, శ్రీమతి గాంధీ ప్రధాన మంత్రి అయినప్పటి నుంచీ అన్న మాట శ్రీమతి గాంధీ దేశానికి చేసిన ప్రత్యేక సేవ ఏమిటంటే, ఇదే — పాలించే వారికీ, పాలింపబడే వారికీ, మధ్య విభేదాలు వచ్చేట్లు చేశారు ఆమె. గవర్న్‌మెంట్ ఏదో పరాయిది అనిపించేట్లు చేశారు ఆమె.

ముందు గమనించ వలసింది, కొన్ని ఏళ్ళగా పెరుగుతూ వచ్చిన "నమ్మకంలో లోపం". అధికార యుతంగా ఏ ప్రకటన వచ్చినా విశ్వసింప బడదు. ఎందుకంటే, గతంలో వాటిలో ఎక్కువ భాగం ఫలించక పోవటం వల్లనే. పార్లమెంటులో శ్రీమతి గాంధీ కాని, ప్రణబ్ ముఖర్జీ గాని లేచి నుంచుని దేశం యొక్క ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే ఎవరు నమ్ముతారు ? ఆర్థిక వ్యవస్థ ఎలాగ ఉందో ఎవరికి వారు తీర్మానించుకోగలరు. మీ అబ్బాయి కాలేజి వదిలి రెండు, మూడేళ్ళయింది కాని ఉద్యోగం దొరకటంలేదు, ఎందుకు ? అంతా బాగా ఉంటే ఇలాగ జరుగుతుందా ? నెల నెలా ఇంటి కర్చుల కోసం ఆదాయం కన్నా ఎక్కువ కావల్సి వచ్చి వెనక వేసే డబ్బుని కర్చు చెయ్యవలసి వస్తే, ఎవరు ఎంత చెప్పినా సందేహాలు రానే వస్తాయి. మీ ఒక చిన్న ఫ్యాక్టరీ నడుపుతున్నారు, మీ తయారీలు అమ్ముడు పోవటం లేదు — ఉత్పత్తి సూచిక మాత్రం పెరుగుతూనే ఉంటుంది. టిక్కెట్ కొనటానికి రైల్వేస్టేషన్ కెడతారు, జేబులో పెద్ద కాళీ ఏర్పడుతుంది — టోకు ధరల సూచిక మీద నమ్మకం కూడా తగ్గుతుంది. ఎవరో మంత్రి, ఎవరో నిపుణుడు చెప్పే మాటలు నమ్మకం కుదర్చగలవా ?

అంతా బాగా ఉంటే ఇన్ని ఉన్నత స్థాయి పరిశీలన సంఘాలు ఎందుకు, ఇన్ని పరిశీలన బృందాలు ఎందుకు ? అసలు ఈ సంఘాలలో నిపుణులుగా చెలామణి అయ్యే వారికి ఎంత మాత్రం మంచి పేరు ఉంది ? మన ఆర్థిక వ్యవస్థ అంత బాగా ఉండి, ఆందోళనకి కారణమేదీ లేకపోతే మనం అంతర్జాతీయ ద్రవ్యనిధి వద్ద అంత పెద్ద అప్పు ఎందుకు తీసుకున్నాము ? 1947 తరువాత ఇంత పెద్ద అప్పు తీసుకోలేదే మనం ? పరిశ్రమలు బాగానే పని చేస్తున్నాయంటారు. అయితే, పరిశ్రమలకి అదనపు రాయితీలు ఎందుకు? మనదేశంలో వ్యాపారులకి ఏమి లోటు వచ్చిందని? సాధారణ జనానికి ఈ సందేహాలు వస్తూ ఉంటాయి కాని ఎవరినని అడుగుతారు? పత్రికలకి రాసే వీలు లేదా తీరిక వారికి ఉండ వద్దూ? వారి సందేహాలని ప్రభుత్వం వారు తీర్చలేరు. గవర్న్‌మెంట్ వారు మన కళ్ళు కపడానికి ప్రయత్నిస్తున్నారని మాత్రం అనుకోక తప్పదు.

ప్రధానమంత్రి ఇటీవలే టి. వి. మీద విదేశ పత్రికావిలేఖరుల సమావేశాన్ని జరిపారు. దానిని చూసిన ఒకాయన "ఆమె అబద్ధం అని తెలిసిపోయేది ఏది చెప్పినా ఇబ్బందిగా నవ్వేవారు. అందరికీ నిజం తెలిసిపోయేది. ఆమె చెప్పేదానిమీద ఆమెకే నమ్మకం లేదని తెలుస్తూనే ఉంది" అన్నారు. ఆ సమావేశానికి వెళ్ళినవాళ్ళకి సయితం ఇదే అభిప్రాయం కలిగింది. వాళ్ళు పంపిన వార్తలలో వాళ్ల అనుమానాలు ప్రతిధ్వనించాయి. అస్సాం విషయంలో ఆమె పూర్తి నిజం చెప్పలేదని తెలిసి పోతూనే ఉండగా ఆమె "రాజ్యాంగానికి బద్ధులమయి ఉండటం వలననే మాకు ఇన్ని అవరోధాలు ఏర్పడ్డాయి" అనటం నమ్మేట్టుగా లేదు. "రాజ్యాంగమా, గీజ్యాంగమా" అన్నారు ఒక విలేకరి (ఈ యన అస్సాం వ్యవహారాలని జాగ్రత్తగా పరిశీలిస్తూ,

ఉంటారు) "బైబిల్‌ని ఉదహరించటానికి సైతాను కూడా భయపడతాడు కాని ఇది మరీ విడ్డూరంగా ఉంది!"

ప్రభుత్వం మీద నమ్మకం తగ్గితే దానిని మారమనక ఏమి చేస్తారు మీరు? ప్రభుత్వానికి దూరంగా ఉండాలి, అన్న వారి సంఖ్య పెరిగి పోతూ ఉంటే చివరికి పరిపాలన కుంటుపడి పోదూ? అస్సాంలో జరిగే దాని తీవ్రత ఎక్కువే అనుకోండి కాని ఇది ప్రమాదమే కదా? భారతదేశంలో సహాయ నిరాకరణం సాంప్రదాయికంగా వస్తున్న ఒక అస్త్రం. పన్నులు కట్టనివాళ్ళు, బస్సులని తగల పెట్టే వాళ్ళు అతివాదులే కావచ్చుకాని అలాంటి వారి సంఖ్య పెరిగిపోతోంది. గవర్న్‌మెంటు మీద కోపాన్ని చూపించడానికి మోసం చెయ్యటం ప్రతి పౌరుడి ధర్మమూ అనే స్థితే రావచ్చు!

ఈ దేశం ముక్కలు కానివ్వను అని శ్రీమతి గాంధి అంటే నాకు ఆదుర్దాగా ఉంటుంది. ఎందుకంటే చెయ్యనన్నది చెయ్యటం ఆమెకి బాగా అలవాటు దేశం ముక్కలు కాగలదనే ఆమె అనుకుంటున్నారా? కొన్ని సంవత్సరాల కింద జిన్నా తన ప్రముఖం ఇచ్చినప్పుడు ఈమె తండ్రి భారతదేశ విభజన తప్పదని సర్దుకుపోలేదూ? అస్సాంలో మహమ్మదీయులు చంపబడుతున్నప్పుడు మాత్రమే ఆమె అక్కడికి వెళ్ళారు. శ్రీమతి గాంధి మన దేశపు విలేఖరులని ఎందుకు కలవరో నాకు అర్థంకాదు. వాళ్ళు వేసే ప్రశ్నలు మరీ ఇబ్బందికలిగించేట్లుగా ఉంటాయనేనా?

మనదేశం భవిష్యత్తుకే ముప్పు ఏర్పడు తోంది. కాని, శ్రీమతి గాంధి ఆమె అనుచరులు ఇదేమీ పట్టించుకోవటంలేదు దేశాన్ని విభజించి అయినా సరే అధికారంలో ఉండా లన్న సంకల్పం శ్రీమతి గాంధికి కలిగిందా? ఆమెకి అధికారం మీద చాలా మమకారం కనుక ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏమీలేదు. తమ పదవిని కాపాడుకోవటానికి ఆమె ఇంతకి ముందు రాజ్యాంగాన్ని మార్పించారు. ఈసారి అంతకన్నా పెద్దపనే చెయ్యవచ్చు, ఆమె. మమ్మల్ని ఎవరూ హెచ్చరించలేదని అనటా నికి వీలు లేదు కదా!



మాన సంరక్షణలో..

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

వీధి చివర మఱ్ఱిచెట్టు. దాని క్రిందొక ముష్టివాడు.

పీక్కుపోయిన కళ్ళు, దేక్కుపోయిన ఒళ్ళు, ముడతలు పడి బాగా లోతుకెళ్ళిన జానెడు కడుపు, వళ్ళగాకంది వంగిపోయిన మూరెడు వెన్నెముక, కీళ్ళు బైటపడ్డ చేతులు, మోడువారిన కాళ్ళు, నూనెజిడ్డు లేక రాగిరంగు తెచ్చుకొన్న కొబ్బరిపీచులాంటి జుట్టు, ఎండిపోయి పగుళ్లతో నిండి గొడ్డుపోయిన బంజరు పాదాలు, దవడలు కనిపిస్తున్న మొహం, గారపట్టిన పళ్ళు – యిదీ వాఁ అవతారం!

ఎందుకో బాధపడుతున్నాడు. ఏదో గొణుక్కుంటున్నాడు.

"ప్చ్. ఎవర్నుద్ధరించటానిక్కీ బతుకు.

ఏయాళ్ళికి ఉసురుపోతాదో, నాకే భూమ్మీద ఏయేలకి నూకలు కరువౌతదో'' — గట్టిగానే అనుకొంటున్నాడు.

ఎంగిలి బీడిముక్క పొగ వదులుతోంది. వేడిగా ఊపిరి వదుల తున్నాడు.

ఏమనుకొంటున్నాడో !

"థూత్ ! తందీ ఓ బతుకేనా. ఛ ఛ కాల్చి మసి సెయ్యాలనిపిస్తది'' — అనేమో !

మాసి మగ్గి మురిగి చిరిగి చివికి చిత్తయి పోవడానికి సిద్ధంగా ఉన్న ఆ గోచీపాతను మాటి మాటికీ చూసుకొంటున్నాడు. చిలు పడి చిట్లిపోయి ఛీ దమ్మైపోయిన టెంకాయ చిప్పను అదేపనిగా చేతిలో త్రిప్పుతున్నాడు.

ఇంతలో బక్కచిక్కి బ్రతుకాశ వదలి బలహీనంగా మూల్గుతున్న గజ్జికుక్క, తోకాడిస్తూ దగ్గరగా వచ్చింది. సరిగ్గా అప్పుడే మురికిలో దొర్లి దొర్లి పాయిఖానాల్లో తిరిగి తిరిగి మైలపడ్డ ఊరపంది గుర్రుమని చప్పుడు చేస్తూ దగ్గరికొచ్చింది.

ఏడుపొచ్చినట్టుంది వానికి

ఏంచేయాలో తోచనట్టుంది.

ఎందుకో విచారిస్తున్నాడు ఏదో బాధ. ఏమని వెళ్లబుచ్చుకోవాలో! ఎవల్తో చెప్పుకోవాలో !

మూడు పదులైనా దాటలేదు అప్పుడే ముసలివాడయ్యాడనేమో ! ముద్దుముచ్చట్లు మురిపాలు వగైరాలకు నోచుకోలేదనేమో !

గట్టిగనే అంటున్నాడు ...

"ఏంటో ! నిక్కృష్టపు బతుకు సచ్చినా బాగున్ను. ఐనా నాలాంటోడి పీనుగని అసలెవరన్నా ఎత్తేత్తారాలని. మున్సిపాల్టోళ్ళు కూడ యాడో దిక్కూ దివానా లేనిసోట పారేత్తారు సెత్తను పారేత్తున్నట్టు ! కుక్కలపాలే యీ బతుకు. ముదనష్టపు బతుకు. నాదేటిబతుకు. సీ. అసలు బతుకేనా ఇది''—

మథన పడుతున్నాడు అడుక్కుతినే ఆ దౌర్భాగ్యుడు కాని వినేవాడెవడున్నాడు ?

ఎవరి దారి వారిదీలోకంలో ! అదంతే అర్థంకాని ఒక "కంటిన్యువస్ చెయిన్ !"

"నో ఎండ్ ఫరిట్ !"

సూర్యుడు అస్తమిస్తూ ఉన్నాడు ఆకాశమంతా బాగా ఎర్రబడింది భిక్షగాడి ఆకలి మంటలా ! ఆత్మక్షోభలా !!

ఆకలి ! ఒకటే ఆరాటం !! అయినా ఎందుకో నిర్లిప్తం !!!

"అమ్మా ! తల్లీ !!" అనాలని లేదు. అసలు ఆ యోచనే రావడంలేదు ఎందుకో బాధపడుతున్నట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

బహుశా కంపుకొట్టున్న తనొంటిని చూసేమో !

జుగుప్స కలుగుతోంది వాడికి కడుపు తిప్పేలా వస్తున్న ఆ వాసనకి వాడే తట్టుకో లేకున్నాడు.

"పావంసేయాలి. సుబ్బరంగా ఉండాలి" అనుకొన్నాడు.

ఎక్కడ ? ఎలా ?

వాడు లేచాడు. ఒళ్ళు విరుచుకొన్నాడు, ఆవలిస్తూ — కళ్ళు మూసుకొని పదడుగులు ముందుకు నడిచాడు కాలిబాట కనిపించింది; ఓ ఫర్లాంగు దూరం వెళ్ళాడు. ఒక మడుగు నిర్మలంగా నవ్వుతూ పిలిచింది

చుట్టూ చూసాడు. ఎవరూ లేరు ! ఆనందంపట్టలేక ఒక ఉదుటున పరుగెత్తు కెళ్ళి ఎగిరిదూకాడందులో. హాయిగా యీద సాగాడు. ఇంతలో ఏదో గుర్తుకొచ్చింది. ఏదో నిర్ణయించుకొన్నాడు.

తన గోచిని తీసి నీటిలో రెండు మూడు సార్లు తడిపి బాగా పిండి గట్టు మీదున్న నల్లరాయి మీద ఆరేసాడు ఆ రాతి పక్కనున్న గడ్డిపరకల్ని తీసుకొని తనొంటిని బాగా రుద్దుకొన్నాడు — పుత్తడికి మెరుగు యిస్తున్నంత అనుభూతితో !

మూడునాలుగుసార్లు మునకలేసి ఒడ్డు కొచ్చాడు.

ఆశ్చర్యం !

గోచి లేదు. భయమూ, బాధామింగేసాయి వాణ్ణి. నాల్గువైపులా దృష్టి సారించాడు.

తూర్పుదిక్కున ఆ గోచిని తీసుకొని ఆదరాబాదరా పరిగెత్తుతున్నాడెవడో !

"ఒరేయ్ ! నాగ్గావ్ !" అంటూ అరిచాడు. "పాడుసచ్చినోడు ! పాడు సచ్చినోడు !" అంటూ తిట్టుకొంటున్నాడు.

తనకిప్పుడెలా ?


"దిసమొలతో యీదిలో కెల్తే జనం ఊర్కుంటారా ? రాల్లతో కొట్టరూ ! దయతల్లి ఏ అయ్యైనా బారుడుగుడి సాతదా! ఊహూం ! బొక్కలో ఏయిస్తారు !"యాతన పడుతున్నాడు.

"తన గోసే కావల్సొచ్చిందా నాగ్గాడికి ! నస ! పందికొక్కునాకొడుకు ! యాటైనా తీసుకోచ్చుగా. నా కాటికొచ్చి నన్నిట్టా యిరకాటంలో పెట్టే, నాకేటి దారి ! నేనేం సేయాల !" గింగిరు తిరుగుతున్నాడు.

ఎందరో దేవుళ్లకు మొక్కుకొంటున్నాడు. తలజుట్టు మాటి మాటికీ పీక్కొంటున్నాడు. చేసేదేమీలేక చీకటి పడేవరకు అక్కడే ఉన్నాడు.

చలిగాలి, సన్నని తుంపర, ప్రాణంపోయేలా జివ్వుమనిపిస్తున్నాయి ఎగురుకొంటూ వచ్చిన పాత 'న్యూస్ పేపర్''ని మొలకు చుట్టు కున్నాడు. కాస్తలో కాస్త తృప్తిగా నడుస్తు న్నాడు.

"ఆద్యాడో అడావగా తేడా లేకుండా — ఒంటిమీద నూలుపోగైనా లేకుండా గంతు లేతారట. ఏదేదో యీనాది పాటలు పాడుకొంటూ ఒళ్ళు మరిసి పోతారంట. ఇంక్యాదో సముద్ర సానమని గుడ్డలిపేసి తిరుగుతారంట కదా. ఎక్కడో తెలిదుకాని



మౌన సంరక్షణలో...

బట్టల్లేకుండా పరిగెత్తారట. దాన్ని స్ట్రీకింగా ... అదేదో అంటార్ట. ఆడబిడ్డలు కూడ మొగోళ్ళకి దేంట్లోనూ తీసిపోరట ఏంటో! కాలమిట్టా ఏడ్సింది ఈ పోలీసోళ్ళ వాళ్ళనేం సెయ్యా? ఊర్క్యారికే మా కాడి కొచ్చి అడక్కతింటారు కాని...భఛ! వాళ్ళదీ ఓ బతుకేనా''—

తనకు తెలిసిందను కొన్నాడు.

''ఈడ కానీ యూరు! అడుక్కు తింటాంరో అంటే అదేదో సట్టమట! కాకీసొక్కరోళ్ళ జబర్దస్తీతో సస్తున్నాం. ఎదవది మాలాంటోళ్ళని పట్టించుకొనే మానుబావులొత్తారా అని? హుం! అంత వరకు నేనుంటానా అని?''

కానుగచెట్టు క్రింద కూర్చొని ఆలోచిస్తున్నాడు.

రాత్రి పదకొండు వరకు అక్కడే కూర్చొన్నాడు. బాగా ప్రొద్దు పోయాక జానెడు కడుపుకోసం కాదు, జానెడు గుడ్డ కోసం వెదకడం ప్రారంభించాడు.

ఎదురుగా కనిపించింది.

ఆరుగజాల తెల్లగుడ్డ ఎర్ర అక్షరాలతో!

చిన్ననాటి చదువు వానాకాలంది. ఎలాగైతే నేం చదువుకొన్నాడు.

''ప...వి...త్ర...మై...న...మీ ఓటును ... కు...ప్పి...గం...తు...ల...మా...రు...తి...రావ్... గారికి .. వేసి...గె...లి...పి...చండి. మీ...గుర్తు...పాద...మాటు...న...క్క.''

''నక్క'' నెమరేసుకొన్నాడు.

ఒక్క క్షణమాలోచించాడు. ఆ గుడ్డను తీసుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

చుట్టూ చూసాడు అలికిడెక్కడా లేదు. ప్రక్కనున్న గోడెక్కాడు. కాలుజారింది. క్రిందపడ్డాడు. మొలకున్న 'పేపర్' కాస్త చినిగిపోయింది. అయినా మళ్ళీ గోడెక్కాడు. గుడ్డనందుకొన్నాడు.

సరిగ్గా అప్పుడే ''బీట్ పోలీస్'' బూతుకూత ''విజిల్'' మోత వినిపించాయి. ఎర్రటోపీవాలా ''టార్చిలైటు ఫోకసూ'' క్రూరి ''బూటు'' అక్కసూ రెండూ కిర్రుమన్నాయి.

ఆ భిక్షగాడికి ... ఒళ్ళు జలదరించింది.

తల తిరిగింది. మెదడు మొద్దు బారిండి. కళ్ళు బైర్లు క్రమ్మాయి. అంతే!

ఆరడుగుల ఎత్తు నుండి అటువైపుకి పడ్డాడు.

కరకుబండ రాళ్ళమీద! కత్తిమొనల ముళ్ళచెట్లమీద! కసాయినవ్వుల గాజుపెంకుల మధ్య! గుండెపగిలిన పింగాణీ ముక్కలమధ్య!

ఆ తరువాత ఆ ముష్టివాని కేమీ గుర్తు లేదు. ఇకపై గుర్తురాదు!

కాని ఆ ''కానిస్టేబుల్'' మాత్రం మరుసట్నాటి పేపర్లో చూసాడు—

''రాజ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న ''మున్సిపల్ బరియల్ గ్రౌండ్'' ఆవరణలో ముష్టివాని శవం'' అనే వార్తను.

ఆత్మహత్య చేసుకొన్నాడని పత్రికలన్నీ కూడబల్కుతున్నా కాదనిచెప్పే గుండెధైర్యం లాటీక్కరకి లేకపోయింది.

''ఆల్సేషియన్''కి ''బిస్కట్''లు తినిపించడంతోనే దానికి సరిపోయింది!

ఈ కథ కొంతవరకు నిజంగా జరిగిందే!

కేన్సరు చికిత్సకు కొత్తపద్ధతి!

కేన్సరు చికిత్సకు జపాను శాస్త్రవేత్తలు కొత్త పద్ధతిని రూపొందించారు. దీనిని 'ఫొటో కెమొ థెరపీ' అంటారు. ఈ చికిత్సలో హెచ్ పి డి అనే రసాయన పదార్థాన్ని, ఆర్గాన్ లేసర్ కిరణాలను ఉపయోగిస్తారు మొదట హెచ్ పి. డి. ని ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి పంపుతారు. ఇది ఇది కేన్సరు భాగాన్ని చేరుకున్న తరువాత ఆ ప్రదేశంపై ఆర్గాన్ లేసర్ కిరణాలను ప్రసారం చేస్తారు. ఈ రెండింటి మధ్య రసాయన చర్య జరిగి కేన్సరు కణాలు నాశనమవుతాయి. ఈ పద్ధతి వలన ఇతర దుష్ఫలితాలు ఏర్పడవని చెబుతున్నారు. గత ఆగస్టు నుంచి జపాను లోని వివిధ ఆసుపత్రులలో పరీక్షలను జరిపారు. పొత్తికడుపు కేన్సరు, కంటి కేన్సరు, శ్వాసకోశాల కేన్సరుకు ఇది ఉత్తమ చికిత్స కాగలదని అంటున్నారు.

వారఫలం

1–4–1983 శుక్రవారం మొదలు
7–4–1983 గురువారం వరకు

♈ మేషం: మీతో వ్యాపారంలో పోటీ పడే వారుంటారు. వ్యాపారం అభివృద్ధి చేయాలనే మీ కోరిక కొంత వరకు నెరవేరుతుంది. అందులో అవకతవకలు జరుగకుండా చూచుకోలి. స్త్రీలకు: అలంకరణ, నూతన వస్త్ర సేకరణ, నగల సేకరణతో వారం గడుస్తుంది, ఆదాయం గల వారం.

♉ వృషభం: ధనాదాయ మున్నది. అప్రయత్న ధన లాభం ఉన్నది. అధికారులను కలిసి కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సంభవం. కొందరకు చాల కాలంగా రాని బాకీలు వసూలు కానున్నవి. స్త్రీలకు: ధనలబ్ధి, ఉద్యోగ మందు పై అంతస్థుకు పోయే మార్గ మున్నది.

♊ మిదునం: విశ్రాంతికాలం. బంధువిరోధమో, మిత్రుల మూలంగా ఘర్షణో రాకుండా చూచుకోండి. పదిమందిలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొంటారు. మీరు చేసే కృషిలో లాభదాయకమే. స్త్రీలకు: వస్త్ర వాహనములు సంపాదించుకొనుటకు అవకాశ మున్నది.

♋ కర్కాటకం: పెద్దల అనుభూతిని పంచుకొంటారు. నూతన వ్యవహారాలలో జోక్యం ఉంటుంది. నూతన మిత్రుల కలయిక చెప్పదగిన వారం. చాల కాలంగా విడివడిన పాతమిత్రులు దగ్గరకు రాగలరు. స్త్రీలకు: అధికారం అభివృద్ధి కానున్నది. రాజకీయంగా మేలైన వారమే.

♌ సింహం: బంధు విరోధం రాకుండా, రాజకీయ వర్గాలలో విభేదం రాకుండా, స్థితిలో, ఉద్యోగంలో పట్టుదలతో సాధనకు దిగండి. ఆదాయం అభివృద్ధి నందటం కూడా చాలమంది గమనించ గలుగుతారు. స్త్రీలకు: విదేశ యానానికి అవకాశం, ఆదాయానికి అవకాశం గలవారం.

♍ కన్య: చాలమందికి వృత్తిలో ప్రగతి కనిపిస్తుంది. ధనాదాయం అధికం. అంత మాత్రాన పొంగిపోరాదు, ఎలాగంటే ఏదో రకంగా వ్యయం కూడా చెప్ప దగిన దినమే. వ్యాపారం నూత్న విధాన సమకూర్చుకొనే అవకాశం లేక పోలేదు. స్త్రీలకు: నూతన వస్త్రాలు కొనుగోలు చేయటం, నూత్నమార్గాన ధనాదాయానికి అవకాశం గలవారం.

♎ తుల: సాటివారి పోటిని ఎదుర్కొనే అవకాశం కలుగుతుంది. ఏదో పోగొట్టు కొన్నట్లుగా కొన్ని విషయాలలో బాధ పడుతారు. మేలు కోరిన వారెవరో, పరాయి వారెవరో గుర్తించ లేకపోతారు. స్త్రీలకు: విద్యాభివృద్ధి యశోవృద్ధి, ఉద్యోగాభివృద్ధి గల వారం.

♏ వృశ్చికం: చాల వారాలుగా 'ఇదేలాగున్నది' అనుకోకండి. పనిపాటుల వారిపై, క్రింది ఉద్యోగస్థులపై పెత్తనం చెలాయించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆరోగ్య లోపం ఏర్పడుతుందేమో గమనించండి. స్త్రీలకు: చాలమంది ఏదో పోగొట్టు కొన్నట్లు బాధ పడుతారు. కించిత్తు నష్టం కూడా చవి చూస్తారు.

♐ ధనుస్సు: 'విధి విరామం లేకుండా కృషి చేసినా, ఏమీ సాధించినవారం కామే' అని అనిపించేలాగు వారం జరుగుతుంది. వస్తు సేకరణకు, రాజకీయ రంగానుభవానికి, హోదా పెరుగుటకు పదిమందిలో ప్రతిష్ఠ సంపాదించుకొనుటకు అనువైన వారం. స్త్రీలకు: అన్ని విధాలా మేలు చేకూరుతుందని చెప్ప వచ్చు. కొందరకు విదేశయానం చెప్ప దగిన ముఖ్యాంశం.

♑ మకరం: మీ తెలివితేటలు ప్రకాశించు సన్నివేశాలు, మీ యుక్తికి మేలైన వ్యవహారాలు, మీతో పోటీ పడిన వారిపై విజయ సాధనకు, అప్రయత్న ధన లబ్ధికి అనుకూల వారం. స్త్రీలకు: ఉద్యోగంలో 'ప్రమోషన్' గాని నూతనోద్యోగాలు ప్రాప్తించుటకు గాని అవకాశ మున్నది.

♒ కుంభం: గిల్లి కజ్జాలకు దిగే అవసరం ఏర్పడుతుంది. ఎంత శాంతంగా ఉంటే అంత మంచిది. వృత్తి యందు శ్రమకర మయినా మీకు అనుకూలమే. ఒకానొక వ్యవహారం అప్రయత్నంగా మీకే అనుకూల దాయకమవుతుంది. స్త్రీలకు: అన్ని రంగాలలో విశేషఫలం చెప్ప దగిన వారం, ఆరోగ్య లోపం లేదు.

♓ మీనం: దేవాదాయ ధర్మాదాయ శాఖలందు పని చేసేవారికి లాభించే దినం. మీకు న్యాయంగా చెంద వలసిన పైకానికి కొంత నిలుపుదల జరుగుతుంది. గ్రామ పెద్దరికంలో యశోభివృద్ధికి అనుకూలం. మిత్ర సహాయ మున్నది. స్త్రీలకు: పూర్వం చేసిన వ్యవహారాల మూలాన ఇంతకు ముందు చేసిన ప్రయత్నాల మూలాన ఆదాయం, అభివృద్ధి, సర్వానుకూలత చెప్ప దగిన వారం.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★

వ్యక్తిగతం




"తామరపువ్వూ, మరమనిషీ" పుస్తకం రాసిన తరువాత ఆర్థర్ కోస్ట్లర్ పేరు భారతదేశంలో కొంత ప్రాముఖ్యం లోకి వచ్చింది. అంతకి ముందు ఆయన "వరమియ్యని దేవుడు" అని తెలుగులో అనువాదం చెయ్యబడిన శీర్షిక కల వ్యాసాల్ని రాసి ప్రసిద్ధులయ్యారు. "మిట్ట మధ్యాహ్నం చీకటి" అనే శీర్షిక కల ఆయన నవల అన్నిటికన్నా పేరు పొందింది. ఇటీవలే ఆయనా, ఆయన భార్య శవాలు వారి ఇంట్లో దొరికాయి. పశ్చిమ యూరోపు మేధావుల సంప్రదాయాలని వృద్ధి పొందించిన కోస్ట్లర్ తరువాత ఇంగిలీషులో రాసినా ముందు జర్మనీ భాషలో రాసేవారు. ఆయన తల్లి చెక్ వనిత, తండ్రి హంగెరీకి చెందినవారు. ఆర్థర్ కోస్ట్లర్ ఈ రెండు భాషలలో కూడా రాసేవారు. ఆయన జయప్రకాశ్ నారాయణకి మంచి స్నేహితుడు ...



పశ్చిమ జర్మనీలో "ఆకుపచ్చ" ఉద్యమం ఒకటి మొదలయింది. వీరు ముఖ్యంగా పరిశ్రమల పెంపుదల మితిమీర రాదంటారు. వాతావరణ కాలుష్యం వీరిని బాగా కలవర పెడుతూ ఉంటుంది. మొన్న ఎన్నికలలో వీరు 5 శాతం వోటులు గెలుచుకోగలిగారు. మొహానికి రంగులు పూసుకుని ప్రదర్శనలలో పాలుగొన్న ఒక వనిత బొమ్మ ఇక్కడ చూడవచ్చు ...



ఉప ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాకరమైనదిగా భావించిన హిమాయత్‌నగర్ శాసన సభ స్థానాన్ని భారతీయ జనతాపార్టీ అభ్యర్థి శ్రీ ఎ. నరేంద్ర 28 వేల వోట్ల మెజారిటీతో గెలుచుకున్నారు. అయితే పోలింగ్‌నాడు భా.జ.పా. కార్యకర్తలు చేసిన ఆగడాలకి అంతులేదని, దాదాపు 30 వేల దొంగ వోట్లు పోలయినాయని తె. దే. పా. అభ్యర్థి ఆరోపించారు....



(గత సంచిక తరువాయి)

వసుమతి స్వరం చాలా హీనంగా వస్తూంది.

టేపురికార్డరు సరిగా ఆ మాటలను రికార్డు చేయగల్గుతున్నదో ! లేదో ! తెలియటం లేదు. ఇంత రాత్రప్పుడు కబురంపితే ఆ పోలీసు ఇన్‌స్పెక్టరు వస్తాడో రాడో అన్న సందేహం నీరజను బాధిస్తూంది. చుట్టూ చూసింది. ఎవరైనా పేషంట్లు మేల్కొని ఉన్నారేమోనని. లేరు. అందరూ నిద్ర పోతున్నారు. ఒకవేళ ఎవర్నైనా లేపినా వాళ్ళిచ్చే సాక్ష్యానికి విలువుంటుందా? వాళ్ళు కొసవరకు నిలబడతారా లేకపోతే ఓ అయిదు వందలు ఆ బాబ్జీ లంచమివ్వగానే సాక్ష్యాన్ని తిప్పేయరు? ఎవర్నీ నమ్మలేదు. డాక్టరుగారున్న ఫరవాలేకపోను. అతని వాఙ్మూలానికి విలువ వుంటుంది. కాదు ఇట్లాంటప్పుడు పోలీసులే ఉండాలి. వాళ్ళేకదా ఆ దుర్మార్గుడిమీద కేసు పెట్టాలి. టేపు రికార్డయితే సరేసరి లేకుంటే... నీరజ ఆలోచనలు ఇంకా రూపు దిద్దుకోలేక పోతున్నాయి.

''నీ భర్తకేం పరవాలేదమ్మా. అతడు పెద్దగా కాలలేదు'' వసుమతి కళ్ళవెంట మళ్ళీ నీరు చిమ్మింది.

''అయ్యో ! నేను చేసినదంతా వృధా అయిందే. పాపి చిరాయువు !''

''చెప్పమ్మా— ఏం జరిగింది ?'' మళ్ళీ నీరజ హెచ్చరించింది.

''మా నాన్నగారు పన్నెండువేలు కట్నమిచ్చేరు, బ్యాంకులో పెద్ద ఉద్యోగం అంటే. నా ఒంటిమీద పదితులాల వరకు బంగారు నగలుండేవి. అంతా తగలెట్టేడు వాడు. వాడు వర్తి త్రాగుబోతు-ముండలముఠాకోరు.''

''ఎవరు ?'' తెల్సినా రికార్డు కోసం నీరజ అడిగింది.

''వాడే నా మొగుడు వెధవ.''

''అతడికి ఇంతకుముందు పెండ్లి అయిందని మీకు తెలియదా ?''

వసుమతి పెదవులు కదిల్చింది గాని మాటలు రాలేదు. నీరజ వెంటనే లేచివెళ్ళి గ్లూకోజు నీళ్ళు తెచ్చి నాలుగు చెంచాలు వసుమతి నోట్లో పోసింది

''చెప్పమ్మా— మెల్లగ ప్రయత్నించు.''

''వాడి మొదటి పెళ్ళాం పడవలో గోదావరి దాటుతుంటే పడవ మునిగి చనిపోయిందట. ఒక సంవత్సరమే కాపురం చేసిందట. ఈ వెధవే దాన్ని కూడా చంపుంటాడు. ఆ తల్లీ, కొడుకూ ఖూనీకోర్లు.''

''నీ పెండ్లపుడు అతడు ఏ ఊరులో ఉద్యోగం చేస్తున్నాడు ?

''నర్సన్నపేటలో – మధ్యవర్తి వాళ్ళు చాల మంచివాళ్ళన్నాడు, ఆ దగాకోరు వీళ్ళిచ్చే కమీషను కోసం అన్నీ అబద్ధాలు చెప్పి పెండ్లి కుదిర్చేడు.''

నీరజకు తెల్సిపోయింది చరిత్ర పునరావృతమైందని.

''ఏమమ్మా నీకు నిప్పు ఎలా అంటుకుంది ?''

''నాకు అంటుకోలేదు వాళ్ళు అంటించేరు. నేను దాచుకున్న డబ్బంత, నా ఒంటిమీదున్న నగలన్నీ నన్ను తన్ని తీసుకున్నాడు. పేకాట ఆడేవాడు, త్రాగేవాడు. ముండలతో తిరిగేవాడు. నా కాపురం రెండేళ్ళలో బుగ్గయిపోయింది.''

ఆయాసంతో, ఆవేశంతో మరి మాట్లాడలేక పోయింది. కండ్లలో నీరు ఆవిరైపోయింది.

''మరి చెల్లీ ఎలా నిప్పంటించేరు? నువ్వు అరవలేదా— ఇరుగు పొరుగు నీకేకల్ని విని రాలేదా?''

వీధి కొసా ఇల్లు మాది. మా పక్కింటి వాళ్ళు సినీమాకని ఆరుగంటలకు వెళ్ళిపోగానే నన్ను నాఅత్త నా మొగుడు వంటగదిలోకి పిలిచేరు. నే వెళ్ళగానే నా అత్త నా చేతుల్ని వెనక్కివిరిచి గట్టిగా పట్టుకుంది. నా మొగుడు కిరసనాయిలున్న చిన్న డబ్బా తెచ్చేడు. అగ్గిపెట్టె తెచ్చేడు. నేను వాళ్లను కన్నీళ్ళతో ప్రార్థించేను నన్ను చంపొద్దని ఆ దుర్మార్గుడు డబ్బాలోని కిరసనాయిలు నామీద కుమ్మరించేడు. అగ్గిపుల్ల గీస్తుంటే శక్తినంత కూడదీసుకుని ఒక్కసారగా లేచి నించున్నాను. అతడు నన్ను గట్టిగ పట్టుకున్నాడు. ఆ తల్లి పడిపోయిన అగ్గిపెట్టెతీసి పుల్లను గీసి నామీద పడేసి గది నుండి పారిపోయింది. అతడు నా చేతుల్ని వదలి పారిపోబోయేడు. నేను హఠాత్తుగ అతని చేతుల్ని వదలకుండ పట్టుకున్నాను— నాతోబాటు ఆ దుర్మార్గుడు కాలిపోవాలని. ఆ రాక్షసి వచ్చి వాడిని గట్టిగ లాగేసింది వాడు నన్ను కాలుతోతంతే నేను ఆ గదిలోనే పడిపోయేను. ఇంతలో మంటలు నన్ను కమ్మేసేయి. నేను చచ్చిపోతున్నాను — వాడు బ్రతికిపోతున్నాడు.''

ఆ దృశ్యాన్ని తలచుకోగానే వసుమతి పైన అమితమైన జాలి, కరుణ ఆ బాబ్జీ పైన మిక్కుటమైన క్రోధం, కావేషం పెరగజొచ్చేయి నీరజకు.

వసుమతి అంత యెక్కువగ మాట్లాడడంవల్ల ఆయాసం వచ్చింది. హఠాత్తుగ చేతిని కదిపి నీరజ చేతిపైన వేసింది. నీరజ ఆతృతగ వసుమతి ముఖంలోకి చూచింది.

''పోలీసులకు చెప్ప అక్కా — వాడిని ఉరి తీయించు. చేస్తావా ఈ పని ?''

''నీకింత దారుణం చేసినవాడు బ్రతకడు -- మాట ఇస్తున్నాను.''

వసుమతి నీరజ వైపు చూస్తునే ఉంది కాని మరి కదలలేదు. ఒక్కక్షణం నీరజ అలా చూసి వసుమతి చనిపోయిందని గ్రహించి వంగి ఆమె కనురెప్పలు మూసి, దుప్పటిని నిండుగా కప్పినించుంది.

కోపంతో, ఆవేశంతో ఊగిపోతూంది. డాక్టరు కృష్ణ గాని, పోలీసు ఇన్‌స్పెక్టరు గాని ఇంకా రాలేదు. నీరజ ఓ నిర్ణయానికొచ్చింది.

ఆ టేపురికార్డరుని తీసుకొని రెస్టురూములోకి వెళ్ళింది. టేపురికార్డరును టేబిలుమీద ఉంచింది. ఆలోచించింది — ఒకవేళ టేపులో రికార్డయిన అది వసుమతి స్వరమని నమ్మేదెవరు ? ఇంతకీ అది టేపు చేసింది తను. తను ఎవరో తెలిసేక ఆ రికార్డుకు విలువ ఏముంటుంది ? పోలీసులవల్ల, కోర్టులవల్ల ప్రయోజనముంటుందని తను నమ్మలేదు ప్రయత్నించడమేగాని ఫలితం మృగ్యమవుతుంది. అది

జరిగిన కథ — 7 : నీరజ తండ్రి పురుషోత్తం. తల్లి పాము కాటుకు గురై మరణిస్తుంది. నీరజ ఇంటర్ వరకు చదివి ఆపైన స్తోమత లేక ఆపేసింది. వున్న ఒక్క అన్నా మిలటరీలో చేరిపోతాడు. తండ్రి చేస్తున్న స్కూలు టీచరు ఉద్యోగంలోంచి రిటైరవుతాడు. నీరజకు వచ్చిన సంబంధాల్లో తండ్రికి నచ్చక కొన్ని జాతకాలుకలవక ఒకటి తప్పిపోతాయి. చివరకి దూరపుబంధువొకాయన సహాయంతో ఓ రెండో పెళ్లివాడితో నీరజ పెళ్లి చేయటానికి నిశ్చయించుకొంటాడు ఆమె తండ్రి. నీరజ పెళ్లి మోహన్‌రావ్‌తో జరిగిపోతుంది. ఆ తర్వాత ఆమె తండ్రి మరణిస్తాడు. ఎంతో ఉత్తముడు అనుకొన్న తన భర్తకు లేని వ్యసనమంటూ లేదని, తన అత్త ఆడేదంతా నాటకమని తెలుసుకొంటుంది నీరజ. గతంలోంచి భవిష్యత్తులోకి వస్తే నీరజ ఓ హాస్పటల్‌లో నర్సు అదే హాస్పటల్‌లో పనిచేస్తున్న డాక్టర్ కృష్ణ నీరజ గతం ఏమైనప్పటికీ ఆమెను పెండ్లి చేసుకొంటానని చెప్తాడు. ఫైర్ ఆక్సిడెంట్‌లో వళ్లు కాలి ఆ హాస్పటల్‌లో జేరిన వసుమతినుంచి సమాచారం సేకరించటానికి నిర్ణయించుకొంటుంది నీరజ. మళ్లీ నీరజ గతంలోకి వెళ్తుంది. తన దగ్గర డబ్బు ఏమీ లేదని, తన అన్న తనకు ఇవ్వడని నిర్మొహమాటంగా చెప్పిన నీరజను కొడతాడు ఆమె భర్త. సుబ్బాయమ్మ దూరపు బంధువు ద్వారా ఆ ఇంటి పరిస్థితులు, మోహనరావ్ మొదటి భార్య ఎలా చనిపోయిందీ అన్నీ తెలుసుకొంటుంది నీరజ. చివరకు నీరజను కూడా చంపటానికి ప్రయత్నిస్తారు వాళ్ళు. వసుమతికి స్పృహ వస్తుంది.

తెలిసే వాడిలా పెచ్చురేగిపోయి ధైర్యంగ హంతకుడయిపోయేడు. వాడికి తగిన శిక్ష వేయాలి.

మందుల బీరువా తెరిచింది. సిరంజిలోకి పది పెంటగ్రాముల మార్ఫిను సొల్యూషను ఎక్కించింది. ఆ సిరంజి తీసుకుని మొగవాళ్ళ వార్డులోకి వెళ్ళింది. బాబ్జీ బెడ్ దగ్గరకు వెళ్లింది. అతడు నిద్రపోతున్నాడు, చేతిని చాపి ఉంచి. అతడి మోచేతిని అందుకుని నరంలోకి ఆ సిరంజిలోని విషాన్ని ఎక్కించడం మొదలెట్టింది. అప్పుడు అతడు కండ్లు తెరచి చూచేడు.

''ఏమిటిది ?''

''డాక్టరుగారు ఈ ఇంజక్షను ఇయ్యమన్నారు.''

నీరజ వంగి ఇంజక్షను ఇస్తుంటే నిశితంగా ఆమె ముఖంలోకి చూడడం మొదలెట్టేడు బాబ్జీ. ఆమె ముఖం ఏదో తీక్షణత, ఆ కండ్లలో ఏదో కాఠిన్యత అతడికి గోచరించేయి. హఠాత్తుగ బాబ్జీకి భయం కల్గింది. చేతిని వెనక్కి లాగుకొన్నాడు. ఆసరికి నీరజ ఇంజక్షను ఇవ్వడం పూర్తి చేసింది. తల ఎత్తి కోపంగా బాబ్జీ ముఖంలోకి చూచింది. అతడికి ఆ నర్సు కాళికా అవతారంలా అప్పుడు గోచరించింది.

''ఓరే మోహనరావు బాబ్జీ! నేనెవరో తెల్సా?''

''నేను మొదటే అనుమానించినట్లు నువ్వు నీరజవుకదూ ?''

''అవునురా నేను నీరజనే.''

''అయితే ఆ 'రా' సంభోధన ఏమిటి – ఎంత పెద్దా నేను నీ మొగుణ్ణే కదా ?''

''నువ్వు ఎంతమందికి మొగుడివయ్యావురా ?''

''ఇంతవరకు ముగ్గురికి – నువ్వు తిరిగి నా దగ్గరకు రాకపోతే మరొకర్తెకు కూడ అవుదామనుకుంటున్నాను,'' అని చిన్న చిరునవ్వుతో పడుక్కున్నవాడల్లా కూర్చుని మంచం వెనుకకు చేరగిల్లబడ్డాడు.

అతడి ధీమాను చూడగానే నీరజ కోపం తారస్థాయి నందుకుంది.

''ఓరి దుర్మార్గుడా ! నీకా అవకాశం ఇవ్వనురా.''

''నువ్వు నన్నేమి చేయలేవుగాని ఈ సంగతి చెప్పు – నువ్వు పడవ ప్రమాదంలో చనిపోలేదూ ? ఎలా ఆ గండం నుండి తప్పించుకున్నావు ? నీకు చక్కదనంతోపాటు తెలివితేటలున్నాయి. నాకు సమ ఉజ్జీవి నీవే. నా మాటవిని నాతో మళ్ళీ మనింటికి వచ్చేయి. హాయిగా ఉందాం – ఏం ?''

''ఓరి రాక్షసుడా – ఎంత ధైర్యం నీకు ! మొదటి భార్యను పీక నులిపి నూతిలోకి తోసేసేవు. అది చచ్చేక నన్ను చేసుకున్నావు. నన్ను కిరసనాయిల్ పోసి కాల్చి చంపబోయేవు. నీకు తోడు హంతకురాలు నీ తల్లి. మీ ఇద్దరి మాటలు నా చెవిని పడి తప్పించుకుని పారిపోయేను. నేను గోదావరిలో పడి చచ్చిపోయేననుకుని ఆ అమాయకురాలు వసుమతిని కట్టుకున్నావు. తరువాత ఆమెను బహు క్రూరంగా కాల్చి చంపేవు. దుర్మార్గుడా ! నీ ఆగడాలకు అంతు లేకుండా పోతూంది. నీకు కావల్సింది కట్నరూపేణా గుంజుకున్న డబ్బు, భార్య ఒంటిమీది నగలు. భార్య పుట్టింటినుండి తెచ్చే ధనం. నువ్వు జూదగాడివి, త్రాగుబోతువి, పతి వ్యభిచారివి. నిన్ను బ్రతకనిస్తే ఇంకా ఎందరి అమాయకుల గొంతు కోస్తావో ! అందుకే నిన్ను నేను చంపదల్చేను.''


ఆమె గొంతులోని కాఠిన్యాన్ని, ఆమె చూపులోని రౌద్రాన్ని చూసి ఆమె ఆఖరి మాటల్ని విని భయకంపితుడై సరిగ తనను తాను రక్షించుకుందికి కాళ్ళు ముడుచుకుని ముందుకు చేతులు చాచి



కూర్చున్నాడు. అప్పుడు చూచేడు ఆమె వెనుక ద్వారం వద్ద నిల్చుని ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టర్ని, డాక్టరు కృష్ణను. వారు నీరజ మాటల్ని అన్నీ విన్నారులా ఉంది. వారుకూడ ఆమె తుది పలుకులకు బెదరి ముందుకు రెండడుగులు వేసేరు.

''ఒరే హంతకుడా ! నిన్ను చంపడానికే ఇందాక నీకు విషాన్ని ఇంజక్షనుగా ఇచ్చేను. ఈపాటికి నీ రక్తంలో ఆ విషం కల్సిపోయుంటుంది. నీ గుండెలు కొట్టుకోడం క్రమేపి తగ్గిపోయి, ఆఖరికి ఆగిపోతాయి. నువ్వు అంతగ బ్రతుకుతే మరో అయిదు నిముషాలు మాత్రమే. వసుమతి ఇందాకే చాల బాధతో చనిపోయింది. ఆ అమాయకురాలకు మాటచ్చేను నిన్ను ఎలాగైనా చంపుతానని. చావరా వెధవా !''

ఆవేశంతో గట్టిగా పలికి వెనుతిరిగింది. డాక్టరు కృష్ణ వెంటనే ఆమెను పట్టుకున్నాడు క్రిందకు పడిపోకుండా. వాళ్ళు గట్టిగ కోపంగ



మాట్లాడుకుంటుంటే చాలమంది పేషంట్లకు తెలివి వచ్చింది. గుడ్లప్పగించి వారి సంభాషణను విన్నారు.

ఆ సరికే భయంతో వణికిపోతున్నాడు మోహనరావు.

"డాక్టరు! నన్నెలాగైన బ్రతికించండి," అని డాక్టర్ని ప్రాధేయ పడజొచ్చేడు.

ఆ సరికి నీరజ నడిచే స్థితిలో లేదు. ఎంతో నీరసం ఆమెను కమ్మేసింది. గోడవారనున్న కుర్చీ వద్దకు డాక్టరు కృష్ణ ఆమెను నడిపించుకుని వెళ్ళి కూర్చోబెట్టేడు. పోలీసు ఇన్‌స్పెక్టరు ద్వారం వద్ద నిల్చుని ఉన్న పోలీసు కానిస్టేబిల్‌కి సైగచేసేడు. కానిస్టేబిల్ వెంటనే మంచం వద్దకు వెళ్ళి మోహనరావు వద్ద నించున్నాడు. ఇన్‌స్పెక్టరు నీరజ వద్దకు వచ్చేడు. ఆమె చేతుల్ని అందుకుని, ఆమె చేతిలోని సిరంజి తీసుకున్నాడు. ఆమె రెండో చేతిని పరీక్షించేడు. ఆ చేతిలో ఏమీలేదు.

డాక్టరు కృష్ణ వంగి నీరజ ముఖాన్ని చేతితో ఎత్తి,

"నీరజ! ఆతడికి ఏమి ఇంజక్షనిచ్చేవు — వెంటనే విరుగుడిచ్చి బ్రతికించాలి — చెప్పు," అని మెల్లగా అడిగేడు.

నీరజ డాక్టరు కృష్ణ ముఖంలోకి చూచి —

"డాక్టరుగారు! ఆ దుర్మార్గుడు చావాలి. మీరు వాడ్ని బ్రతికించకూడదు. వాడు హంతకుడు," అని ఆవేశంతో అంది.

"నీరజ! ఉద్రేకపడకు. నేను పోలీసు ఇన్‌స్పెక్టరుగారు నీ మాటల్ని అన్నీ విన్నాం. వాడు బ్రతకనీయి. న్యాయపీఠమే వాడికి తగిన శిక్ష వేస్తుంది. పోలీసులే తగిన సాక్ష్యంతో వాడిమీద కేసు పెడ్తారు. ఆ పాపం మనకెందుకు. చెప్పు త్వరగ — వాడికి ఏ విషం యిచ్చేవు?"

"నేను చెప్పను — వాడు చావాలి నా కండ్ల ముందర. అప్పుడే వసుమతి ఆత్మకు, నా హృదయానికి శాంతి లభిస్తుంది."

"వెర్రిదానా! వాడి చావుతో నీ మరణము ముడిపడి ఉంది. ఎలా మరచిపోతున్నావు? వాడు చనిపోతే నువ్వు హంతకురాలవుతావు."

జీవిత సమరం

"నేనేమయిపోయినా నాకు ఫరవాలేదు. వాడు చావాల్సిందే."

"డాక్టరుగారు! నా గుండెలు ఆగిపోతున్నాయి. నా ఊపిరి ఆగిపోతూంది. నా కండ్లకు చీకట్లు క్రమ్ముతున్నాయి. నన్ను బ్రతికించండి," అని యేడవడం మొదలెట్టేడు మోహనరావు.

డాక్టరు కృష్ణ తొందరగ వెళ్లి మోహనరావు నాడిని, కనుపాపల్ని చూసేడు. వెంటనే గ్రహించేడు మార్ఫీను మిక్కుటంగ ఇవ్వబడిందని. భయంవల్ల మరణం త్వరితంగ సంభవిస్తుందని డాక్టరు కృష్ణ గ్రహించి రెస్టురూముకి పరుగుతీసేడు. అతడు సిరంజిలోకి మార్ఫీనుకు విరుగుడు నలార్ఫీన్ ఎక్కించి వచ్చేసరికి, మోహనరావు ఆ మంచం మీద వాలిపోయి మరణబాధతో కొట్టుకొంటున్నాడు. డాక్టరు కృష్ణ అతడి చేతిని అందుకుని ఇంజక్షను ఇవ్వబోతుండగానే మోహనరావు చనిపోయేడు.

అతడి చావుని చూడగానే నీరజ వెర్రిగా నవ్వ నారంభించింది. ఆమె నవ్వుతుండగానే కానిస్టేబిల్ అందించిన బేడీలు తీసుకుని పోలీసు ఇన్‌స్పెక్టరు నీరజ చేతులకు వేసేడు. అది గమనించే స్థితిలో లేదు నీరజ.

"నర్స్! మోహనరావుకి విషమిచ్చి చంపిన నేరానికి నిన్ను అరస్టు చేస్తున్నాను. నువ్వేమైన చెప్పుకోవాలంటే కోర్టులో చెప్పుకో. ముందు పోలీసు స్టేషనుకు నడు," అని ఆమె భుజాన్ని పట్టుకుని లేవనెత్తి కానిస్టేబుల్‌వెనుక రాగా ఆమెను ఆ హాస్పిటల్ నుండి నడిపించుకుని పోయేడు.

డాక్టరు కృష్ణ మోహనరావు శవం మీద దుప్పటి నిండుగ కప్పి, హాస్పిటల్ ఆఫీసు నుండి పెద్దడాక్టరుగార్కి వసుమతి, బాబ్జీ చనిపోవడం, నీరజను పోలీసులు తీసుకుని వెళ్లడం తెలియజేసి తను కూడా పోలీసుస్టేషనుకు వెళ్లేడు

12

ఆ మరునాటికి వసుమతి తల్లిదండ్రులు విశాఖ పట్నం నుండి వచ్చేరు. భోరున యేడ్చేరు. శవాన్ని పోస్టుమార్టమయింతరువాత తీసుకుని చూచేరు ఒళ్ళంతా కాలి నల్ల కాలిన కట్టెలా ఉంది. ఇరవై రెండేళ్ల వయస్సుకే బ్రతుకు బుగ్గయిపోయినందుకు గుండెలు పగిలేలా దుఃఖించేరు

వసుమతి తండ్రి బంగారయ్య తన యావదాస్తిని ఖర్చు చేసైన ఆ హంతకులు తల్లి, కొడుకులను ఉరికంబానికి ఎక్కిస్తానని శపథం చేసేడు, ఆ ఊరు చేరగానే. అప్పుడు అతడికి తెల్సింది తన అల్లుణ్ని ఎవరో చంపేరని. అప్పటికి అతడికి ఊరట కల్గింది. హాస్పిటల్‌కి వెళ్లి తన కూతురు, అల్లుళ్ళ చావు వివరాలు కనుక్కోబోయేడు పెద్ద డాక్టరుగార్ని కల్సి.

డాక్టరు మధుసూదనరావు ఆదరంగ బంగారయ్యను పలకరించి కూర్చోమన్నాడు.

"బంగారయ్యగారు! ఇది చాల దుర్ఘటన. నేను ఈ నర్సింగ్ హోమ్ పెట్టి పదిహేనేళ్లయింది గాని ఇటువంటి అఘాయిత్యమేమి జరుగలేదు. ఇదే మొదటిసారి. అన్నిటికన్న ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే నీరజ ఈ దారుణం చేయడమే. మా బాధ్యత ఏమిటంటే మనుష్యులను ఎలాగైన బ్రతికించడమే — అట్లాంటిది మా హాస్పిటల్‌లోని ఓ నర్సు విషమిచ్చి ఓ రోగిని చంపిందంటే ఎంత

దేవుడు - మనిషి

ఆభరణాలకీ
బంగారు కాసులకీ
అహం భావానికీ
తూగక
భక్తికీ, తులసి దళానికీ
తూగాడు కాబట్టే
దేవుడు
దేవుడనిపించుకున్నాడు
నోట్ల కట్టలకికాక
నీతికీ నిజాయితీకీ
తూగితే
మనిషి
మనిషనిపించుకుంటాడు

— కాశీనాథ & కాశీనాథ

అప్రతిష్ఠ మీరే ఆలోచించండి. ఈ మచ్చ ఎలా పోతుందో నాకు ఆలోచన తోచకుండ ఉంది. బహుశా ఈ మచ్చ మాకు శాశ్వతంగ ఉండి పోతుందేమో.''

''వాడు చాల దుర్మార్గుడు కాబట్టే వాడికి అట్లాంటి చావు ప్రాప్తించింది. ఆ నర్సు వాడిని చంపకపోతే నేనే వాడ్ని చంపి ఉందును.''

''అదే మన పొరబాటు తలంపు. ఒకర్ని ఒకరు ఉద్రేకంతో చంపుకోదలుస్తే మరి ఈ పోలీసు లెందుకు, ఈ న్యాయస్థానాలెందుకు ?''

''కాని ఈ హంతకుడు అదే మా అల్లుడు మా అమ్మాయితోబాటు ఎందర్నో పెండ్లి చేసుకుని చంపేడుకదండి. ఇంతకుముందు ఈ పోలీసులు, ఈ న్యాయస్థానాలు ఏమి చేయగల్గేయి.''

''సరైన సాక్ష్యం లేకపోవచ్చు.''

''అదే నేనన్నది. పోలీసులకేనా, కోర్టులకేనా సాక్ష్యం కావాలి. ఇట్లాంటి సంసారిక హత్యలకు తగిన సాక్ష్యం యెలా లభిస్తుంది చెప్పండి ? అంతెందుకు మా అమ్మాయి విషయమే తీసుకోండి. ఎవడో మధ్యవర్తి వచ్చి కుర్రాడు బహు యోగ్యుడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఏ బాదరబందీ లేదు. దక్షతకు తల్లి కూడ ఉంది. ఇంతకుముందు గోదావరిజిల్లాలో ఉన్నపుడు ఒక వివాహమయింది. పాపం ఆ భార్య ఒక సంవత్సరం కాపురం చేసి పడవలో గోదావరి దాటుతుంటే పడవ మునిగి చనిపోయిందని చెప్తే నమ్మకుండ ఉండలేకపోయేను. కుర్రాడు పెద్ద వయస్సువాడు కాదు, ముప్ఫై యేళ్ళవాడే — అందులో రూపసికూడ. పిల్లకూడ అభ్యంతరం చెప్పలేదు. సరే అని పన్నెండు వేలు కట్నం పోసి కానుకలు సమర్పించి ఘనంగ పెండ్లి చేసేను. వాళ్ళు మాత్రం పెండ్లికి పెద్దగ ఏమి ఖర్చు చేయకపోయిన నేనుగాని, మా ఆవిడగాని పట్టించుకోలేదు. పిల్ల సుఖపడితే అదే చాలను కున్నాము.

తరువాత సంవత్సరం బాగానే గడిచింది. పిల్ల పండక్కి వచ్చింది. ఓ నెల్లాళ్ళు ఉండి వెళ్తానంది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తు కూర్చునేది. ఎంతడిగిన చెప్పలేదు. ఆఖరికి ఆ తల్లి అనునయించి అడుగుతే చెప్పింది. తన మొగుడు మంచివాడు కాడని, త్రాగుతాడని, రోజూ పేకాట ఆడి డబ్బు తగలేస్తా డని, ముండలవెంట తిరుగుతాడని. అందరం తల బాదుకున్నాం గోతులో పిల్లను త్రోసినందుకు. నెల్లాళ్ళయేసరికి అల్లుడే వచ్చి పిల్లను ఆదరంగ తీసుకుని వెళ్తానన్నాడు. నేను మా ఆవిడ వాడ్ని చెడామడా తిట్టిపోసేము. వాడు ఏ ఆవేశం చెందలేదు. మెత్తనివాడిలా తల వంచుకుని అన్ని చీవాట్లు తిన్నాడు. ఆఖరికి ఏమన్నాడో తెలుసా డాక్టరుగారు?''

''చెప్పండి.''

''మామగారు ! మీరు, మీ అమ్మాయి అను కున్నంత చెడ వాడ్ని కానండి, నేను కొన్ని పొరపాట్లు చేసేనని ఒప్పుకుంటాను. ఇకముందు ఆ పొరపాట్లు చేయనని మాటిస్తాను. ఒకటి మాత్రం నిజం మీరు నమ్మాలి. వసుమతంటే నాకెంతో ప్రేమ. ఆమెను వదలి ఉండలేను. నా వెంట పంపించండి— అని ప్రాధేయపూర్వకంగా అడిగేడు. ఎలా కాదనగలము? చేతులారా దాని కాపురం చెడగొట్టలేక మా పిల్లకు కొంత ఓర్పు, సహనం అలవర్చుకోమని హితబోధ చేసి వాడివెంట పంపించేము. అంతే దానితోవాడు విజృంభించేడు. మాతో చెప్పిందని అప్పు డప్పుడు దాన్ని తన్నేవాడట. దాని నగలన్నీ తన జల్సాలకు ఖర్చు చేసేడు. అభిమానం అడ్డొచ్చి నా పిచ్చితల్లి మాతో చెప్పుకోలేకపోయింది. అన్ని విషయాలు దాని స్నేహితురాల ద్వారా మాకు తెల్సేసరికి సమయం మించిపోయింది. ఆ హంతకులు దాన్ని కిరసనాయిలుపోసి తగలబెట్టేసేరు,'' అని ఆ తండ్రి దుఃఖించసాగేడు.

డాక్టరు మధుసూదనరావుగార్కి కండ్లు చెమర్చేయి.

''మన పవిత్ర భారతదేశంలో ఇట్లాంటి చావులు ఈ మధ్యన ఎక్కువయి పోతున్నాయి. కట్నాలకోసం, డబ్బు, ఆస్తికోసం, కట్టుకున్నదాన్ని నరకయాతన పెట్టి, ఆఖరికి కాల్చి చంపేస్తున్నారు. ఇది దారుణమే.''


''మీరే చెప్పండి. మా అమ్మాయి విషయంలో సాక్ష్య మేముందండి వాడికి శిక్ష పడడానికి? ఇరుగు, పొరుగు ఏదో సర్కస్ చూడడానికి పోయేరు. సాయంత్రం వేళ అందరు మొగవాళ్ళు సాధారణంగా బయటకు పోయేవేళ. వంట మొదలెట్టేవేళ. ఈ నైలాన్, పోలిస్టరు చీరలొచ్చాయి చూడండి. ఇట్టే మంటలు ఎగ్రబాకుతాయి. ఏ నెపం పైనో అమ్మాయిని ముస్తాబవమనొచ్చు— లేక సాయంత్రం వేళ గనుక భర్తకోసం ముస్తాబై ఉండొచ్చు. సమయం చూసుకుని కిరసనాయిలుజల్లి నిప్పంటిస్తే ఇట్టే క్షణాల్లో కాలి బుగ్గయిపోతుంది. సాధారణంగ జరిగిన హింసాకాండను చెప్పడానికి తెలివిరాకపోవచ్చు. పిల్ల చచ్చిపోయేక అడుగుతే ఏమంటారు ? వంట చేస్తుంటే పాడు నైలాన్ చీరకు నిప్పంటుకుంది అంటారు. లేకపోతే ఆ అమ్మాయే ఆత్మహత్య చేసు కుంది ఆ కాపురం ఇష్టంలేక అంటారు. పోలీసులు చాల హడావిడి చేస్తారు. ఓ రెండువేలు చేతిలోపడే సరికి అన్ని సర్దుమణిగి పోతాయి. ఆఖరికి మాకు కంటినిండా నీళ్ళు, ఆ హంతకులకు స్వేచ్ఛ లభిస్తుంది. ఇదేకదండి మా లాంటి తల్లిదండ్రుల కథ— పెండ్లికూతుర్ల వ్యథ.''


''మీరు చెప్పింది నిజమేకాని హంతకులను చంపి మనం హంతకులు కాకూడదు. ఆ పని చేయడానికి న్యాయస్థానాలున్నాయి. పోలీసులున్నారు. ఒకవేళ ఈ రెండింట్నీ తప్పించుకున్నా హంతకుడు దైవం కండ్లు కప్పలేడు. ఈ లోకంలో కాకపోయిన పరలోకంలోనైన, ఒచ్చే జన్మలోనైన తన దుశ్చర్య లకు ఫలితం అనుభవిస్తాడు.''

''డాక్టరుగారు ! అవన్నీ మనకు తెలియవుగా. మన మనస్సుకు వేదాంతం వల్ల ఉపశమనం లభించదు కదా.''

కేన్సర్‌కి సి విటమిన్ !

జపానులో సి–విటమిన్ గల పదార్థాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. నోబుల్ బహుమతి గ్రహీత డా. లినస్‌కార్ల్ కేన్సరు, జలుబువంటి వ్యాధుల నివారణకు సి–విటమిన్ తోడ్పడగలదని తెలియచేయడమే దీనికి కారణమని భావిస్తున్నారు. నడివయసు వారికి కేన్సరు రావటానికి ఎక్కువ అవకాశాలున్నట్లు పరిశోధనల్లో తేలింది. సి–విటమిన్ అధికంగా కొనేవారిలో నడివయసువారే ఎక్కువగా ఉంటున్నారట !





"అది మనయొక్క మనః ప్రవృత్తినిబట్టి ఉంటుంది."

"ఏమైన మీ నర్సు చేసిన ఆ ఘనకార్యంవల్లే నా మనస్సుకు కొంత ఊరట కల్గింది. ఆమెకు మేమంత ఎంతో ఋణపడి ఉన్నాం. అందుకే ఆమెకు నేను సహాయపడదల్చేను. ఆమె కోర్టు కేసుకు అయ్యే వ్యయాన్ని నేను భరించదల్చేను. డాక్టరుగారు నేను విన్నాను నిజమేనా — ఆమెకు ఎవ్వరు లేరటగా !"

"ఎవ్వరు లేనట్టే. ఎందుకంటే తల్లిదండ్రులు చనిపోయేరు. ఉన్న ఒక్కగానొక్క అన్న ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ చెల్లి ఏమయిందో ఏనాడు ఉత్తరం వ్రాసైన కనుక్కోడు. పాపం ! ఆమె ఏకాకే. ఆమె గత చరిత్ర మాకు ఈనాటి వరకు తెలియదు. మెడలో మంగళసూత్రం లేకపోతే ఆమెకు పెండ్లికాలేదేమో లేక భర్త చనిపోయుండొచ్చుని ఇన్నాళ్ళు అనుకున్నాము. ఆమె ఆ విషయం మాకు ఏనాడు చెప్పలేదు. మేము ఏనాడు వత్తిడి చేసి అడగనూలేదు. ఆమె హృదయంలో ఇంతటి భడబాగ్ని దాగుందని మాకు ఇప్పటివరకు తెలియలేదు. కాని ఒక్క మాట చెప్పకోవాలి—నీరజ చాల మంచిపిల్ల. పేషంట్లను తల్లిలా చూసుకొనేది. ఎన్నిగంటలు డ్యూటీచేసిన, శ్రమ అనుకునేది కాదు. ఓవర్‌టైమ్‌కి డబ్బిస్తానన్న పుచ్చుకునేది కాదు. ఈ హాస్పిటల్‌లో ఉన్న డాక్టర్లందరికి, నర్సులందరికి, మిగతా పనివారలందరికి ఆమె యెంతో ప్రీతిపాత్రమైనది. ఇట్లాంటి ఆఘాయిత్యం చేసిందంటే మాకు మతిపోతూంది. ఆమెలేని వెల్తి మాకు తెలియ వస్తూంది. మీరు ఆమెను ఆదుకుంటానంటే మాకు ఓ విధంగా ఆనందంగానే ఉంది. ఆఫ్‌కోర్సు మీరు నన్ను కలియక మునుపే మేము ఆమె తరఫున వాదించడానికి దిట్టమైన అడ్వకేటుని పెట్టేం. ముఖ్యంగ ఆ భారాన్ని మా హాస్పిటల్‌లో పనిచేస్తున్న డాక్టరు కృష్ణ చాలమట్టుగ తీసుకున్నారు."

"మంచిది — మీ అందరికి ఆమెపైన సదభిప్రాయం, ఆదరణ ఉండడం ఆమె అదృష్టమే. ఆమె కోర్టు కేసు అయేవరకు నేనీ ఊర్లోనే ఉండదల్చేను. మీరు డాక్టరు కృష్ణగార్కి నన్ను పరిచయం చేస్తే మేమిద్దరం శాయశక్తులా ప్రయత్నిస్తాం ఆమెను విడుదల చేయించడానికి."

డాక్టరు మధుసూదనరావుగారు వార్డులోనున్న డాక్టరు కృష్ణను పిలిచి వసుమతి తండ్రి బంగారయ్యను పరిచయం చేసేరు. విషయాన్ని తెల్పుకున్నాక డాక్టరు కృష్ణ —

"బంగారయ్యగారు ! మీ సహృదయతకు నా కృతజ్ఞతలు. నా డ్యూటీ మరో అరగంటలో అయిపోతుంది. మీరు కాస్సేపుంటే నేను వస్తాను మీ బసకు. ఇద్దరం చాల మాట్లాడుకోవల్సి ఉంది" అన్నాడు.

పెద్దడాక్టరుగారు కలుగజేసుకున్నారు.

"డాక్టరు కృష్ణ ! మీరు మరి డ్యూటీ గురించి ఆలోచించకండి. నేనున్నాగా చూసుకుంటాను. బంగారయ్యగారు చాల సేపయింది వచ్చి. ఇంకా అరగంట కూర్చోమనడం భావ్యంకాదు. మీరు అతనితో వెళ్ళవచ్చు."

జీవిత సమరం

"థాంక్యూసార్ ! పదండి బంగారయ్యగారు," అని ఇద్దరు హాస్పిటల్ బయటకు వచ్చేరు.

తిన్నగ బంగారయ్య ఉంటున్న హోటలుకి వెళ్ళేరు. ఆనాటికి వసుమతి చనిపోయి రెండు రోజులైంది. ఆ క్రితం రోజే బంగారయ్య తన భార్యను బస్సెక్కించి విశాఖపట్నం పంపించేడు. తను ఉండిపోయేడు. రూములో కూర్చున్నారు.

"బంగారయ్యగారు ! మీ మంచి మనస్సుకు నా ధన్యవాదాలు."

"అదేం కాదు డాక్టరుగారు — ఇందులో నా స్వార్ధం ఎంతైన ఉంది. ఆ రాక్షసుడ్ని నా కూతురు చనిపోయిందని తెలియగానే నేనే చంపుదామనుకున్నాను. నేను చేయవల్సిన పని నీరజమ్మ చేసింది. నేనుపడవల్సిన జాగాలో ఇప్పుడామె ఉంది. అందుకే ఆమెను కాపాడే బాధ్యత నా మీదుంది. మరి మీరు ఈ కేసులో చాల శ్రద్ధ తీసుకుంటున్నారని తెల్సింది."

"అవునండి — తండ్రిలాంటివారు మీ దగ్గర నిజం చెప్పడంలో తప్పేమి ఉండదనుకుంటాను. నీరజ ఈ హాస్పిటల్‌కి నాలుగేళ్ళ క్రితం నర్సుగా వచ్చి చేరింది. ఆమె రూపు, ఆమె పలుకు, ఆమె సంస్కారం గమనించి ఆకర్షితుడయ్యేను. ఆమెను వివాహం చేసుకుందామనుకున్నాను. నీరజను అడిగినప్పుడు థాంక్సు చెప్పి తప్పుకునేది కాని తన అనుమతినిచ్చేది కాదు. తన కింతకు ముందే వివాహమయిందని, తన భర్త బ్రతికే ఉన్నాడని కాని చెప్ప లేదు. బహుశా తన ఉనికి ఆ మోహనరావుకి తెలుస్తే అతడువచ్చి బలవంతం చేసి తనను తీసుకునిపోయి తనని అంతం చేస్తాడని భయపడి ఉండొచ్చు. అందుకే నేను ఆమెను కాపాడడానికి నా శాయశక్తుల ప్రయత్నించదల్చేను. మా ఇద్దరి అనుబంధం అట్లాంటిది. నీరజలాంటి మంచి స్త్రీని అంత దారుణానికి పురికొల్పిన పరిస్థితులెట్లాంటివో మనం ఊహించుకోవచ్చు. కేసు విచారణ జరిగినప్పుడు అన్ని వివరాలు బయల్పడతాయి."

"డాక్టరుగారు ! ఆ మోహనరావు తల్లి సుబ్బాయమ్మ ఇప్పుడెక్కడ ఉంది — ఆమె విషయం మీకేమైన తెల్సునా ?"

"ఆ సుబ్బాయమ్మని చూస్తే ఆమె మాటల్ని వింటే ఆవిడ ఇంత రాక్షసని ఎవరూ ఊహించలేరు. ఆ రాత్రే హాస్పిటల్ బాయ్‌ని పంపి ఆమెను పిలిపించేము. అసరికి పెద్ద డాక్టర్లు మధుసూదనరావుగారు, మాణిక్యాంబగారు హాస్పిటల్‌కి వచ్చేరు. పోలీసులు నీరజను పోలీసు స్టేషనుకు తీసుకుని వెళ్ళేరు పెద్ద డాక్టర్లు వచ్చేలోపునే. సుబ్బాయమ్మ హఠాత్తుగ రాత్రి కబురంపేసరికి కోడలు చనిపోయిందన్న దుర్వార్త చెప్పడానికే అనుకొని తీరుబాటుగ ఓ గంట తరువాత వచ్చింది. పెద్ద డాక్టరుగారే వారు లోకి తీసుకునివెళ్ళి చావుల కబురు మెల్లగ చెప్పేసేరు. మొదట ఆమె కోడలు చనిపోయిందని చెప్పేరు. అది విని ఆమె శవం వద్దకుకూడ వెళ్ళకుండానే — 'పాపం — ఆయుష్షు చెల్లిపోయింది. అగ్ని గండం ఉన్న మనిషి. మావాడు దాన్ని రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించి చేతుల్ని కాల్చుకున్నాడు కాని అల్పాయుష్షు పిల్ల — దేముడు ఎంత రాస్తే అంత, మన చేతుల్లో ఏముందిగనుక' — అని వేదాంతధోరణిలో మాట్లాడిందే కాని ఒక కన్నీటి చుక్క కూడ, ఆ అభాగ్యురాలు వసుమతి కోసం ఆ సుబ్బాయమ్మ రాల్చలేదు.

తరువాత పెద్ద డాక్టరుగారు గొంతు సవరించుకుని — 'అమ్మా ! మీకు మరో దుర్వార్త చెప్పాలి. మీరు ధైర్యంగా ఉండాలి. మీ అబ్బాయి మోహనరావు బాబ్జీ చనిపోయేడు,'' అని చెప్పేరు. దాంతో ఆమె అడుగుముందుకు వేస్తున్నదల్లా ఆగిపోయి బిగుసుకుపోయింది. ఆమె అక్కడే కూలిపోతుందేమోనని మేమంతా భయపడ్డాం. అర నిముషం తరువాత 'నాయనా — నాబాబూ' అని బిగ్గరగ అరుస్తూ బాబ్జీ మంచం వద్దకు పరుగెత్తింది. శవంమీద కప్పిఉన్న దుప్పటిని తొలగించి భోరుమని యేడవడం మొదలెట్టింది — 'ఇట్లాంటి పరిస్థితి కల్గుతుందంటే అలా ప్రవర్తించకపోము కదరా, నాయనా ! ఇంతలోనే నీకు నూరేళ్ళు నిండాయా ? ఆ దౌర్భాగ్యురాలను చంపబోయి నీ చావు కూడా తెచ్చుకున్నావురా నాయనా! ఆదిక్కుమాలిన డబ్బుకోసం నీ ప్రాణాన్నే తీసుకున్నావురా — బాబూ ! నేనిప్పుడు ఎవరికోసం బ్రతకాలిరా,' అని గుండెలు పగిలేటట్లు యేడ్చింది.

ఆమె మాటలవల్ల ఆమె, ఆ ముద్దుల కొడుకు కలసి ఆ వసుమతిని కాల్చిచంపేరని మా అందరికి ఖచ్చితంగా తెల్సిపోయింది. ఓ అయిదు నిముషాలు యేడవనిచ్చి పెద్ద డాక్టరుగారు ఆదుప్పటిని ఆ శవం మీద కప్పేయించి నర్సులను ఆ సుబ్బాయమ్మ చేతుల్ని పట్టుకోమని చెప్పి బలవంతంగా ఆ సుబ్బాయమ్మను క్రిందనున్న ఆఫీసు గదిలోకి తీసుకుని వచ్చేరు. అప్పుడు అడిగింది సుబ్బాయమ్మ తన కొడుకు ప్రొద్దున్న చాల బాగా ఉన్నాడే, హఠాత్తుగ రాత్రి ఎలా చనిపోయేడు, ఏ రోగం ముందుకొచ్చిందని. పెద్ద డాక్టరుగారు నా వైపు చూచేరు. నేను నింపాదిగ అసలు సంగతి చెప్పేసేను— 'సుబ్బాయమ్మగారు ! ఓ దారుణం జరిగిపోయింది. మీ అబ్బాయికి నీరజనే భార్య ఉండేదా ?'

"ఉండేది బాబు. గోదావరిని పడవమీద దాటుతుంటే పడవ మునిగిపోయి ఆమె చనిపోయింది. అది చనిపోయింతరువాతే మావాడికి మరో వివాహం చేసేను,"

"ఆ నీరజ చనిపోలేదు. మా హాస్పిటల్‌లో పనిచేసే నర్సు ఆ నీరజే."

"అది నేనడుగుతే తనపేరు లక్ష్మి అని చెప్పింది మరి?"

"ఆమె పేరు లక్ష్మి నీరజ— మీదగ్గర తను బయట పడడానికిష్టంలేక లక్ష్మి అని చెప్పి ఊరుకుంది అనుకుంటా."

సుబ్బాయమ్మ నిర్ఘాంతపోయింది.

"నాకు దాన్ని చూసిందగ్గర్నుంచి సందేహంగానే ఉంది, ఎవరో తెల్సిన మనిషిలాగుందే అని. అయితే అది బ్రతికే ఉందన్నమాట. డాక్టరుగారు ఆ నీరజ మమ్మల్ని గుర్తించగల్గిందా ?"

"ఆ బాగానే గుర్తించింది."

"అయితే మొగుడు చచ్చినట్టు దానికి తెల్సిందా?"

''ఆదే నేను చెప్పబోతుంది. ఆ నీరజే మీ అబ్బాయికి విషమిచ్చి చంపింది.''

''ఆ ! నా కొడుకు సహజంగా చనిపోలేదా ? మీ హాస్పిటల్‌లో హత్య చేయబడ్డాడా ? ఎంత ఘోరం జరిగింది. ఆ హంతకురాలు ఇప్పుడెక్కడుంది— చెప్పండి. దాన్ని చంపి నా కొడుకు చావుకు ప్రతీకారం తీర్చుకుంటా.''

''సుబ్బాయమ్మగారు ! శాంతించండి— మీకా అవసరం కలగకుండా నీరజను పోలీసులు అరస్టుచేసి తీసుకుపోయేరు.''

''దానికి ఉరిశిక్ష పడేటట్లు చేస్తేకాని నే నూరుకోను.''

''సర్లే మీ ఇష్టం,'' అని నేను మరి మాట్లాడలేదు.

పెద్ద డాక్టరుగారు కలుగజేసుకుని— ''మీ కేమైనా సహాయం చేయాలంటే చెప్పండి చేస్తాను. మీకెవరైనా తోడున్నారా? మీ బంధువులెవరికైనా టెలిగ్రాంగాని, ఫోనుకాల్‌గాని చేయాలా?' అని అడిగేరు. దానికి ఆమె కోపగించుకొని— ''మీ ఆసుపత్రిలో జరిగిన నిర్వాకం చాలు. ఇక్కడ మీరు హత్యలు కూడా చేస్తున్నారు. తెలియక మా వాడు ఈ నరకంలోకి చేరి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. నా కొడుకు శవాన్ని నా కిప్పించండి. నా దారిన నేను పోతాను.'' అని బిగ్గరగ అంది.

ఆ దుఃఖ సమయంలో ఆమెతో వాదోపవాదాలెందుకని ఎవ్వరము ఏమి అనలేదు.


'అలా ఇవ్వడానికి వీల్లేదమ్మా. పోలీసులు ప్రొద్దునవచ్చి ఈ రెండు శవాలను గవర్నమెంటు హాస్పిటల్‌కి పోస్టుమార్టమ్‌కి అదే శవపరీక్షకు పంపుతారు. అది అయిన తరువాతే పోలీసులు ఆ శవాలను వారి వారి బంధువులకు ఇస్తారు. అంత వరకు మీరు ఆగాలి,' అని పెద్ద డాక్టరుగారు చెప్పేరు.

ఆ సుబ్బాయమ్మ దుఃఖిస్తూనే అలా వరండాలో కూలబడింది. నిన్నను మధ్యాహ్నంకు ఆవిడ దూరపు బంధువొకాయన వచ్చేడు. ఆసరికి కొడుకు శవాన్ని శవపరీక్షానంతరం ఆవిడకు అప్పజెప్పేరు. ఆ దూరపుబంధువు సహాయంతో ఆశవాన్ని తీసుకుని పోయింది,'' అని డాక్టరు కృష్ణ ముగించేడు.

బంగారయ్య ఆలోచనలో పడ్డాడు.

''మరి డాక్టరుగారు ! ఆ సుబ్బాయమ్మ తన కొడుకుతో కలసి నా కూతుర్ని కాల్చిచంపింది కదా పోలీసులు ఆమెను అరెస్టు చేయలేదా ?''

''అక్కడ ఓ చిన్నమెలిక ఉంది. నీరజ మీ అమ్మాయి చనిపోతున్నపుడు ఇచ్చిన స్టేటుమెంటును టేపుచేసింది. ఆ టేపురికార్డును తీసుకొని నేను పోలీసు స్టేషనుకు వెళ్ళి ఆ టేపును ప్లేచేసి ఇన్‌స్పెక్టరుకు వినిపించేను. మీ అమ్మాయి చాల బలహీనంగా చాల మెల్లిగా మాట్లాడింది. అందువల్ల ఆమె మాటలు చాలమట్టుగ సరిగ రికార్డుకాలేదు. నీరజ మాటలమీద ఆ సుబ్బాయమ్మను అరెస్టు చేయలేకపోయేరు కారణం నీరజ కూడా హంతకురాలవడమే. నీరజ కేసులో సరైన సాక్ష్యాధారాలు లభిస్తే తరువాత ఆ సుబ్బాయమ్మపైన కేసుపెట్టి ఆమెకు సరైన శిక్ష వేయొచ్చని పోలీసులు భావించి ఊరుకున్నారు. ఎందుకేనా మంచిదని



ఆ పోలీసు ఇన్‌స్పెక్టరు ఆ సుబ్బాయమ్మను కలసి— 'మీ అబ్బాయి హత్యకేసు తేలేవరకూ మీరు ఈఊరు వదలిపోరాదు. మీరుంటేనే ఆ నీరజకు తగిన శిక్ష వేయించగలం' అని ఆమెను హెచ్చరించి వచ్చేడు.''

''సర్ — దాన్ని నేను వదలిపెట్టను. ఒకవేళ పోలీసులు వదిలేస్తే ఎంత డబ్బు ఖర్చు అయినాసరే దానిమీద కేసుపెడ్తాను ఈ కేసు తేలగానే. అన్నట్లు డాక్టరుగారు నాదో మనవి. మీరు నన్ను మన్నించి ఒప్పుకోవాలి,'' అని బంగారయ్య డాక్టరు కృష్ణ ముఖంలోకి ప్రాధేయంగా చూసేడు.

''చెప్పండి — మీమాట కాదనను,'' అన్నాడు డాక్టరు కృష్ణ.


''నాకుతెల్సు మీకు నీరజపైన అత్యంత అభిమానమని, అందుకే మీరు నాకు తోడుగా ఉండండి— కాని నా ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ కేసులో అయిన ఖర్చంత నన్నే భరించనీయండి. నీరజను ఎలాగైన నేను విడుదల చేయించాలి. ఈ ఊరులోని ఎడ్వకేటుగాని, పై ఊరులోని ఎడ్వకేటుగాని నీరజ తరపున వకాల్తా పుచ్చుకునేందుకు దిట్టమైనవాడ్ని చూసిపెట్టండి — ఏం ?

''సరే — అలాగే చేద్దాం.''

(ఇంకా వుంది)

మానవత్వం నీడల్లో

నందం రామారావు



"సుజాతా! ఈ రోజు నీ వంట్లో ఎలా వుంది?" కృష్ణమూర్తి లోపలికి వచ్చి అడిగాడు.

అప్పటివరకూ కళ్ళుమూసుకుని బెడ్ మీద పడుకుని వున్న సుజాత భర్త మాటవిని నెమ్మెదిగా లేవడానికి ప్రయత్నించబోయింది. భార్యను వారిస్తూ—"లేవకు" అంటూ వచ్చి ఆమె ప్రక్కన కూర్చుని చెంపమీద చెయ్యివేసి చూసి—"ఫర్వాలేదు, ఈ పూట అంత జ్వరం వున్నట్టు లేదు. అవునూ, ఈ టైమ్‌లో కాప్స్యూల్ వేసుకోవాలి, వేసుకొన్నావా?" అన్నాడు.

సుజాత వేసుకోలేదన్నట్టుగా తల తిప్పింది.

"వేసుకోలేదా? మంచిపని చేశావ్! మల్లి ఏమైంది?"

"కిచెన్‌లో వుంది" అంది సుజాత.

కృష్ణమూర్తి లేచి-ప్రక్కనే టీపాయ్ మీదున్న కాప్స్యూల్ తీసి, భార్య నోట్లో వేసి మంచినీళ్ళు త్రాగించి, మళ్ళీ ప్రక్కన కూర్చుని కబుర్లు చెప్పసాగాడు.

ఇంతలో మల్లి రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చి, చెరొకటీ ఇచ్చింది. కాఫీ కప్పు అందుకుంటూ కృష్ణమూర్తి తలెత్తి మల్లిని చూసి, ఆశ్చర్యపోయాడు.

మల్లి ఇప్పుడే విచ్చిన మల్లెపూవులా ఉంది! పువ్వుల చీరలో చూడ చక్కగా వుంది.

"ఈ పిల్ల చాలా అందంగా వుంటుంది,' అని చాలాసార్లు అనుకున్నాడు క్రిష్ణమూర్తి. ఇప్పుడు అనుకున్నాడు.

రెప్ప వాల్చకుండా మల్లికేసి చూసి, నవ్వుకున్నాడు. మల్లి కప్పులు తీసుకెళ్ళిపోయింది.

"ఆ చీర బావుంటుందని నేనే ఇచ్చాను. ఈ చీర కట్టుకుంటే మల్లి చాలా బావుంది కదండీ!" అంది సుజాత.

"అవును సుజాతా! ఆ అందం మల్లిలోలేదు, చీరలో వుంది. ఈ చీర కట్టుకున్నప్పుడల్లా నేనేమనేవాడ్నో గుర్తుందా?"

సుజాత భర్త ముఖంలోకి చూడాలని ప్రయత్నించి గతించినరోజులూ ... ఆ చీర కట్టుకున్నప్పుడల్లా గడిపిన రాత్రులూ గుర్తురాగా సిగ్గుతో మాట్లాడలేకపోయింది!

....

అప్పటికి సాయంత్రం ఆరుగంటలు దాటింది. సూర్యుని కడపటి కిరణాలు కిటికీలోంచి, గదిలోకి ప్రవసరించి, సుజాత బెడ్ మీద పడుతున్నాయి.

చల్లనిగాలి శరీరానికి హాయి కలిగిస్తోంది.

"ఏవండీ! ఇక్కడ నా పక్కన కూర్చోపోతే, ఏ సినిమాకో, క్లబ్‌కో, వెళ్ళరాదూ?" అంది సుజాత.

పాపం సుజాతకు, ఈ సమయంలో భర్త తన దగ్గర వుండడం సుతరామూ ఇష్టం లేదు.

సాధారణంగా ఈ టైంలో మగవారు ఎవరూ ఇంటి దగ్గిర వుండరు! కానీ, తన భర్త కొన్ని నెలల నుంచి తననే అంటిపెట్టుకుని వుంటున్నాడు.

తన జబ్బు ఏవిటో?— కాళ్ళు వాయడం, ఆయాసం, దగ్గు, పట్టుమని ఇల్లంతా తిరగలేదు! పిల్లలు లేరు గనుగ సరిపోయింది.

అక్కడికీ మల్లి అన్నీ చేసుకుపోతుంది. నమ్మకంగా వుంటూ, తనకు కావాలసిన పనులన్నీ శుభ్రంగా చేస్తుంది.

"ఏవండీ! నావల్ల మీకు సుఖం లేకుండా పోతుంది. నా అనారోగ్య కారణంవల్ల మీ సరదాలను దూరం చేసుకోకండి!" అంది సుజాత.

"ఇదుగో శ్రీమతీ! నీ సలహాలు బావున్నాయి గానీ, ఇంకేం మాట్లాడకు. ఎంచక్కా హాయిగా విశ్రాంతి తీసుకో! అంతేగానీ ఏవేవో ఊహించి మనసు పాడుచేసుకోకు. ఓకే!"

ఇంతలో మల్లి వచ్చి —

"బాబుగారూ! మీకు ఫోన్!" అంది.

క్రిష్ణమూర్తి లేచి గదిలోకెళ్ళాడు.

మల్లి యజమానురాలి దగ్గర కూర్చుని కాళ్ళకు నూనె రాయసాగింది. చాలాసేపు గడిచింది.

అప్పటికి పూర్తిగా చీకటి పడిపోయింది.

కృష్ణమూర్తి గదిలో కిటికీ ప్రక్కన కూర్చుని బయటకు చూడసాగాడు.

ఆకాశంలో చంద్రుడు స్టీల్ పళ్ళెంలా మెరిసిపోతున్నాడు. కొబ్బరి చెట్లగాలి చల్లగా ఉంది.

కానీ, తన మనసే చల్లగా లేదు.

కొన్ని రోజులనుంచి తన మనసు అలజడిగా ఉంటోంది. మనసంతా మల్లి ఆక్రమించి గంద్రగోళ పరుస్తోంది!

మల్లి అందం!

మల్లి యవ్వనం!

మల్లి నడక!

మల్లి నవ్వు!

ఇవన్నీ తన నెక్కడికెక్కడికో లాక్కెడుతున్నాయి. మల్లిని కేవలం పనిమనిషిగా చూడలేకపోతున్నాడు.

ఒక రోజేం జరిగిందని —

తను స్నానం చేయబోయి కావాలనే బాత్‌రూంలో టవల్ పెట్టలేదు. స్నానంచేస్తూ మల్లిని పిలిచాడు.


లక్షలాది ప్రజలకు సూపర్ భావం కలిగించే టీ!
Brooke Bond Super Dust Tea
"సూపర్ రుచి"
"సూపర్ చిక్కన"
Brooke Bond Super Dust Tea
"సూపర్ పొదుపు"
Brooke Bond Super Dust Tea
బ్రూక్ బాండ్ సూపర్ డస్ట్
భారత దేశంలో అత్యధికంగా అమ్మబడుతున్న ప్యాకెట్ టీ
HTC-BBI-4737

''ఏమిటి బాబూ; పిలిచారు ?'' అంది తలుపవతల్నించి.

''టవల్ మర్చిపోయానే మల్లీ ! తీసుకొచ్చి ఇవ్వు !''

''నేనా !''

''అవును నువ్వే ! ఏం, తీసుకురావా !''

కిలకిలా నవ్వింది.

మరో రోజు —

డైనింగ్ టేబుల్ దగ్గర —

''ఇంకాస్త అన్నం వడ్డించుకోండి బాబూ !'' అంది మల్లి.

''ఇంకేం వద్దు !''

''అలా అంటే ఎలాగండి ? మజ్జిగ వేసుకుంటే వేడి చెయ్యదు, వుండండి కాస్త అన్నం పెడతాను.'' అంటూ అన్నం వడ్డించింది.

''అవతల అమ్మగార్కి అలా వుంటే !...''

''ముందు బాగా తిన్న తరవాతనే బాబూ ! మిగతా ఆలోచనలు. చూడండి, మీరెలా చిక్కిపోయారో !''

ఆ మాటకి తను తలెత్తి మల్లికేసి చూశాడు. మల్లి సిగ్గుపడిపోయి దూరంగా వెళ్ళిపోయింది !

ఇవన్నీ తనలో గుబులు రేపుతున్నాయి.

పాతికేళ్ళ మల్లి పసందుగా వుంది !

తనేం చిన్నపిల్లవాడు కాదు !

ఏ మాట, ఏ చూపు ఎటువంటిదో గ్రహించ లేనంతటి అవివేకి కాడు !

తన శరీరం మల్లిని కోరుతోంది !

కృష్ణమూర్తి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మల్లి అప్పుడే లోపలికి వచ్చి —

''బాబూ ! లైటు వేసుకోకుండా చీకట్లో కూర్చున్నారా ! అమ్మగారికి తొందరగా తగ్గిపోతుంది లెండి ! మీరేం దిగులు పడకండి !'' అంది.

''మల్లీ !'' అన్నాడు కృష్ణమూర్తి.

ఆ చీకటిలో, ఆ నిశ్శబ్దంలో ''మల్లి'' అన్న ఆ పదం ఎంతో మధురంగా ఉంది.

తను భార్యను కూడా ఎప్పుడూ మధురంగా పిలిచి వుండడు !

''ఏం బాబుగారూ !''

''అమ్మగారేం చేస్తున్నారు ?''

''ఇంతకు ముందే అన్నం పెట్టానండి ! తిని పడుకున్నారు. మీరు కూడా లేస్తే వడ్డిస్తాను.''

''అలాగే !'' అంటూ కృష్ణమూర్తి లేచాడు.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్న కృష్ణమూర్తి రెప్ప వాల్చకుండా మల్లికేసి చూడసాగాడు.

''మల్లీ ! మీ నాన్న నీ కెందుకింకా పెళ్లి చెయ్యలేదు?'' అన్నాడు కృష్ణమూర్తి.

ఒక ఆడపిల్లని, అందునా వయస్సులో పిటపిట లాడిపోతున్న అందమైన కన్యను, ఒక మగవాడు ఇలా ప్రశ్నించకూడదు! ఒకవేళ ప్రశ్నిస్తే... ఆ పిల్ల ఏం సమాధానం చెపుతుంది ?

మల్లి ఆ ప్రశ్నకు నవ్వి వూరుకుందే కానీ సమాధానం చెప్పలేదు !

''నాకు తెలుసు మల్లీ ! నీకు పెళ్ళి చెయ్యడు. పెళ్ళి చేస్తే, ఇక్కడ నువ్వు సంపాదించేదంతా మీ నాన్నకు దక్కదు. అందుకని...''

''అందుకని మీరు ఇలా నా గురించి ఆలో చిస్తుండడం ఏం బావుండలేదు. చెప్పండి. మీ ఇంట్లో వుండడం మీ కిష్టం లేదంటే వెళ్ళి పోతాను'' మల్లి కళ్ళల్లో తడి.

ఆ క్షణంలో మల్లి ముఖం, వాలకం చూసి కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు. ఇంకేం మాట్లాడ కుండా, గబగబా భోజనం చేయసాగాడు !

* * *

ఆ రోజు కృష్ణమూర్తి చాలా ఆనందంగా వున్నాడు. వుంటాడు మరి, ఎందుకుండడు ?

కృష్ణమూర్తి బావమరిది వచ్చి– ''బావ గారూ ! మా అక్కయ్యను అర్జంటుగా తీసు కెళ్ళాలి. సుజాతని చిన్నతనంలో పెంచిన ముసలామె చావుకు దగ్గరగా వుంది. సుజాతను చూడాలని కలవరిస్తోంది. పంపండి. మళ్ళీ రెండు రోజుల్లో పంపుతాను'' అన్నాడు.

అప్పటికి వారం రోజుల నుంచీ సుజాతకి కొంచెం కులాసాగా వుంది. ముందు వూరు పంప కూడదనుకున్నాడు. కాని, పంపక తప్పలేదు. సుజాత కూడా వూరు వెళ్ళడానికి ఇష్టపడింది.

సుజాత కారులో వెళ్ళేప్పుడు మల్లిని దగ్గిరికి పిలిచి–

''ఇదుగో మల్లీ ! నేను రెండు రోజుల తరువాత వస్తాను. అంతవరకూ, ఇల్లు జాగ్రత్త ! అయ్యగారికి పొద్దుటే వేడినీళ్ళు, కాఫీ టిఫిన్ అన్నీ ఏర్పాటు చెయ్యి. వంట రెండు పూటలా చేసివుంచు. తెలిసిందా ?'' అని చెప్పి మరీ వెళ్ళింది.

కృష్ణమూర్తి ఆఫీసులో పనులన్నీ చకచకా పూర్తి చేసుకుని ఎంత తొందరగా ఇంటికి రావాలని ప్రయత్నించినా కుదరలేదు. సంతకాలతోనే సరి పోయింది.

రాత్రి ఎనిమిది గంటలు దాటిన తర్వాత ఇంటికి వచ్చాడు కృష్ణమూర్తి. ఆ సమయంలో మల్లి రేడియో దగ్గర పెట్టుకుని తెలుగు పాటలు వింటోంది. ఆ పాటకు పరవశించిపోతూ కళ్ళు మూసుకుని ఏదో అందమైన కల కంటోంది !

కృష్ణమూర్తి కుతూహలంగా ఆమెనే చూస్తూ వుండిపోయాడు. పాట అయిపోడంతో మల్లి అందమైన కల చెదిరిపోయింది. ఎదురుగా నిల్చుని తననే చూస్తున్న యజమానిని చూసిన మల్లి కంగారుగా లేచి–

''మీరా బాబు!''

''అవునుగానీ! పాట అంత బావుందా?''

మల్లి సమాధానం చెప్పకుండా సిగ్గుతో తల వంచేసింది. కృష్ణమూర్తి మరోసారి ఆమెకేసి చూసి తృప్తిగా నిట్టూర్చాడు.

''రండిబాబు ! మీకు భోజనం వడ్డించేస్తాను'' అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

* * *

రాత్రి పది గంటలు దాటింది.

సుజాతా నిలయంలో లైట్లు వెలగడంలేదుకానీ, కృష్ణమూర్తి గుండె కార్నర్‌లో 'ఆశ' అనే లైటు వెలుగుతూ ఆరిపోతోంది. ఆరిపోతూ వెలుగుతోంది !

నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో కృష్ణమూర్తి ఆలోచనలు భయంకరంగా ఉన్నాయి.

ప్రతి మనిషికీ కొన్ని చెప్పుకోలేని అనుభూతులూ, అనుభవాలూ కావాలి. అనుభూతులూ, అనుభవాలూ, మనిషికి చివర దశలో తోడుగా ఉంటాయి !

ఐనా, కృష్ణమూర్తికి ఈ అనుభూతి చాలా విచిత్రంగా ఉంది. 'ఇదీ' అని చెప్పలేనంత సంతోషంగా ఉంది. కొద్ది సేపట్లో మల్లి తన కౌగిలిలో ఉంటుంది. ఆమె అందాల్ని తను సొంతం చేసుకోబోతున్నాడు. వయస్సు దాటుతున్న తనకే ఇలా ఉంటే, వయస్సులో ఉన్న మల్లికింకెలా ఉంటుంది?

అప్పటికి సరిగ్గా టైమెంతయిందో తెలియదు. కృష్ణమూర్తి నెమ్మదిగా లేచి గది బయటకొచ్చాడు.

సుజాత పడుకునే గదిలో మల్లి పడుకునుంది. ఆ గదిలో కొద్దిపాటు వెలుతురు మాత్రమే ఉంది. అంటే మల్లి నిద్రపోతోందన్నమాట !

కృష్ణమూర్తి సరాసరి కిటికీ దగ్గిరికెళ్ళి లోపలికి తొంగి చూశాడు మల్లి చాప వేసుకుని క్రింద పడుకునుంది. ఆమె కట్టుకున్న చీర అస్తవ్యస్తంగా ఉంది.


వెంటనే తలుపు తీసుకుని లోపలకు వెళ్ళా లనుకున్నాడు. ఒకవేళ లోపల తలుపు గడియ వేసుకుని పడుకుని వుంటే ఏం చెయ్యాలి ? అవును! ఏం చెయ్యాలి ! పేరుపెట్టి లేపితేసరి.

ఎందుకైనా మంచిదని కృష్ణమూర్తి తలుపు తోసి చూశాడు. తలుపులు గడియపెట్టిలేవు ! అతని ఆనందానికి అంతులేకుండాపోయింది. గడియ వేసుకోకుండా పడుకున్న మల్లికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. గడియ వేసుకోకుండా పడుకున్నదంటే, మల్లికి తనంటే ఎంతో ఇష్టమన్న మాట ! అంతేగదామరి !

కృష్ణమూర్తి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికెళ్ళాడు.

వళ్ళంతా వేడిగా, గుండె వేగంగా, శ్వాస ఎక్కువగా, నరాలు పటుత్వంగా – అన్నీ ఉద్రేక పరుస్తుండగా కొన్నిక్షణాలు మల్లికేసి చూసి ఆమె మీదకు వొంగబోయాడు.

సరిగ్గా అప్పుడే, ఆ క్షణంలోనే మల్లి నిద్రలో అటూ ఇటూ కదిలింది. పసిపాప ఉయ్యాల తొట్టిలో పడుకున్నట్టుగా కాళ్ళు ముడుచుకుని పడుకుంది. వూహ తెలియని పాప నవ్వులా ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది !



కృష్ణమూర్తి మల్లికేసి మరోసారి చూశాడు. ఆ క్షణంలో అతనికి మల్లిలో చనిపోయిన తన పదేళ్ళ కూతురు కనిపించింది. తన చేతులమీదుగానే చనిపోయిన కూతుర్ని, ఇప్పుడు మల్లి చాపమీద పడుకున్న విధంగా పడుకోబెట్టి స్మశానానికి తీసుకెళ్ళాడు!

కానీ, కావచ్చు!

ఇప్పుడు ఇక్కడ మల్లి అనే ఒక అందాలరాశి తన యవ్వనంతో పిచ్చివాణ్ణి చేస్తోంది. ఏది ఏమైనా ఈ మల్లెపూవును వాసన చూడవలిసిందే ...

కృష్ణమూర్తి తన్మయత్వంగా కళ్ళు మూసుకుని మల్లి చెంతకు చేరబోయాడు.

ఏ ఘడియ ఎటువంటిదో —

అప్పుడే ఆ గదిలో వున్న గడియారం గంటలు కొట్టసాగింది. ఒకటి... రెండు... మూడు... పదకొండు గంటలు కొట్టింది. ఇంతలో బయట దబదబా తలుపు కొడుతున్న చప్పుడు.

మల్లి నిద్రలోనే అటూ ఇటూ మళ్ళీ కదిలింది. దూరంగా ఒక మూలకి పడున్న దుప్పటి తీసి ఆమెకు కప్పి తృప్తిగా నిట్టూర్చాడు కృష్ణమూర్తి.

ఇప్పుడు కృష్ణమూర్తిలో ఏదో ఒక మంచి పని సాధించానన్న గర్వంతో కూడిన చిరునవ్వు తొణికిసలాడింది. అతని ఉద్రేకం, గుండెదడ తగ్గి మామూలు మనిషిలా అయిపోయాడు, అంతే! కృష్ణమూర్తి ఇంకేం ఆలోచించకుండా గబగబా ఆ గదిలోనుంచి బయటకొచ్చి వీధి తలుపు తీశాడు.

అతనికి ఎదురుగా భార్యా, బావమరిదీ!

* * *

సుజాత వూరునించి వచ్చిన మరుసటి రోజే తల్లిని చూడ్డానికని మల్లి నాలుగు రోజులు శెలవు తీసుకుని వెళ్ళి ఈ రోజే వచ్చింది తిరిగి.

ఈ రోజు కృష్ణమూర్తి, సుజాతలకు చాలా మంచిరోజు — పెళ్ళయిన రోజు.

అంచేత, సుజాత తన కిష్టమైన పట్టుచీర కట్టుకుని, పెళ్ళినాటి వుంగరం పెట్టుకోవాలని అనుకుంది. పట్టుచీరైతే తీసుకుందిగానీ, పెళ్ళినాటి వుంగరం కనిపించలేదు! ఆదుర్దాగా బీరువా అంతా వెదికింది; ఎక్కడైనా పెట్టి మరిచిపోయిందేమోనని ఇల్లంతా వెదికింది. ఐనా, ఎక్కడా కనిపించలేదు.

భర్త ఇంకా ఇంటికి రాలేదు. గబగబా ఆఫీసుకు ఫోన్ చేసి విషయం చెప్పింది.

మానవత్వం నీడలో

"ఎక్కడో పెట్టి మర్చిపోయివుంటావ్! జాగ్రత్తగా వెదుకు!" అన్నాడు కృష్ణమూర్తి.

"లేదండి! అంతా వెదికాను. ఎక్కడా కనిపించలేదు."

"సరిగ్గా చూడు."

"చూశానండి. ఏవండీ! నాకెందుకో మల్లి మీద అనుమానంగా వుంది. పొద్దుటనించీ అది నన్ను తప్పించుకు తిరుగుతోంది."

"ఛా! వూరుకో! అనవసరంగా ఆ పిల్లను అనుమానించకు!"

"మీకేం తెలియదుగానీ, మీరర్జంటుగా ఇంటికి రండి."

"అలాగే."

భార్యాభర్తల కెదురుగా మల్లి తలొంచుకుని దోషిలా నిలబడింది.

"చెప్పవే! నువ్వెందుకీ పని చేశావ్?"

"నాకేం తెలియదు!"

"మల్లీ! నిన్నెంతో ఆదరంగా చూశాం. నీకెలా ఈ దొంగతనం చెయ్యా లనిపించింది?" అడిగాడు కృష్ణమూర్తి.

మల్లి సమాధానం చెప్పలేదు, తలొంచుకుని నిలబడింది.

"ఇది ఇలా ఎందుకు చెబుతుందండి!పోలీసులకు అప్పజెబ్తే సరి. ఇది అనుకోకుండా వూరు ఎందుకు వెడుతోందోనని అప్పుడే అనుమానించాను, గానీ, ఇంత బరితెగిస్తుందనుకోలేకపోయాను. చెప్పవే! ఆ వుంగరం ఏం చేసావో చెప్పు!"

అప్పటికీ మల్లి సమాధానం చెప్పలేదు.

"ఇదిగో మల్లీ! నిన్ను శిక్షించడం చాలా తేలిక. కానీ నేనాపని, చెయ్యను. ఎందుకో తెలుసా? నువ్వు కంటికి రెప్పలా అమ్మగార్ని చూసుకున్నావ్. కానీ, నీ కెందుకో ఈ పాడుబుద్ధి పుట్టింది. ఇక, నువ్వు ఇక్కడ ఉండడానికి వీల్లేదు. వెళ్ళిపో, తక్షణం వెళ్ళిపో!" కృష్ణమూర్తి అరిచినంత పని చేశాడు,

భర్త కోపం చూసిన సుజాత కంగారుపడింది – "అది కాదండి. నా మాట విని..." ఇంకా ఏదో చెప్పబోతున్న భార్యని వారించి—

"ఇంకా ఇక్కడే నిలబడి వున్నావేం? ఊ! వెళ్ళు!" అన్నాడు.

మల్లి తలెత్తి చూసింది

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

చివరిసారిగా ఇద్దరికీ నమస్కరించి నెమ్మదిగా బయటికి నడవసాగింది.

* * *

సడిలేని వీధి.

కృష్ణమూర్తి గదిలో కూడా చీకటిగానే ఉంది

బెడ్‌మీద పడుకునివున్న కృష్ణమూర్తి మనస్సు అశాంతిగా వుంది. కళ్ళు మూసుకున్నా మల్లి రూపమే మెదుల్తోంది.

"మల్లీ! నన్ను క్షమించు!" అనుకున్నాడు.

అలా ఇప్పటికి చాలాసార్లు అనుకున్నాడు, అనుకున్నాగానీ, అతనికింకా అశాంతిగానే వుంది.

మల్లిని అనుభవించకపోయినా, ఆమెకు తీరని ద్రోహం చేశాడు!

తన భార్య ఎంతో అపురూపంగా చూసుకుంటున్న వుంగరాన్ని తనే దొంగిలించాడు. ఆ నేరం మల్లి చేసినట్టుగా చిత్రీకరించాడు. తనిలా ఎందుకు చేశాడు —

మల్లి సౌందర్యాన్ని, మల్లి యవ్వనాన్ని తను పొందాలని ఆశించాడు. ఆశించి, అవకాశం కోసం ఎదురుచూశాడు. ఆ అవకాశం రానే వచ్చింది. ఐనా, తనామెను పొందలేకపోయాడు. తన మనస్సులో ఎక్కడో మానవత్వం దాగివుంది. ఆ మానవత్వం ముందు, తన వుద్రేకం తలవంచక తప్పలేదు!

తాత్కాలికంగా తను తలవంచినా, మల్లి అందం తనను పిచ్చివాడ్నిగా చేయసాగింది.


తను పతనం చెంది, మరో కన్య జీవితాన్ని పతనం చెయ్యలేదు!

తను మనిషిగా, ఆదర్శవంతుడిగా వుండాలంటే, మల్లి తనెదుట వుండకూడదు. అందుకే — తనను తాను రక్షించుకుని, మల్లిని రక్షించటం కోసం ఈ పనిచేశాడు.

మల్లి ఎక్కడున్నా విజాయితీగా బతకృలదు ఆమెకు అణుకువ, ఓర్పు అన్నీ వున్నాయి!

జీవితంలో తను ఏవేవో అద్భుతాలు చెయ్యకపోయినా, మనిషిగా, మనసున్న మనిషిగా ప్రవర్తించాడు!

ఈ ఆలోచనలతో కృష్ణమూర్తి మనస్సు తేలికపడ్డట్టయింది. తృప్తిగా నిట్టూర్చి, కళ్ళు మూసుకుని పడుకున్నాడు! ★





కొత్త గొంతులు

టి.యల్. కాంతారావు

సృజన చరమ రూపమై
లయం మొదటి రూపమై
జడ జగత్తుకు ఈవల
జీవ ప్రపంచానికి ఆవల,
మృత్యు మహాసముద్రాన్నీ
చైతన్య విశాల భూమినీ
కలిపే వెలియలి కట్టవలె
నిల్చింది ఈ సమయం.

డా॥ మాదిరాజు రంగారావు

వియత్నాం యుద్ధపు రోజుల్ని గురించి రాసినా ఈ దేశంలోనూ ఈ సమయం ఇట్లాగే ఉంది. ఇట్లాంటి సమయంలోనే— మానవజాతిని పీడిస్తున్న అనేక సమస్యలకు కవులు కదలి కవిత్వం రాస్తున్నారు. సమస్యల స్వరూపం ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక్కటే. పరిష్కార మార్గాలే వేరు వేరుగా ఉన్నాయి. మాదిరాజు రంగారావుగారు యుగ సంకేతం, మానవీయం, ఆవాహన, కాలాన్ని నిలిపే క్షణం కావ్యాలు రాసినవారు. చలం, బుచ్చిబాబు, రావిశాస్త్రి మొదలైన నవలా రచయితల మీద విమర్శ వ్యాసాలు రాశారు. ఆధునిక జీవన చైతన్యంలో వ్యక్తి వికాసమే మానవత్వానికి మహాదాదర్శంగా భావించి కవిత్వం రాస్తున్నారు ఆయన. మానవతా వాదాన్ని ఒక జీవన తత్వంగా ఆయన భావించారు. ''మానవుని ప్రవృత్తి, అతని జీవితము పట్ల నిరంతరమూ అభిలాషతో, మొక్కవోని విశ్వాసంతో, వ్యక్తి స్వేచ్ఛ ప్రధానంగా గల మానవతా వాదం భౌతికంగా, మానసికంగా సుఖానికీ ఉన్నతికీ కారణ భూతమైంది. ఇది మానవుని సమగ్ర వికాసానికి దారి తీసేది. జీవిత ప్రయోజనాన్ని ఫలవంతం చేసేది దీన్ని ప్రతిబింబించే, స్పృశించే సాహిత్యం మానవత్వపు విలువల్ని ప్రకాశింపజేసేది. ఈ సాహిత్యం మతంపై కన్నా మానవత్వపు విలువలపై వెలుగు ప్రసరిస్తుంది. ఆచారాలకన్నా అనుభవ పరంపరకు స్థానమిస్తుంది. వీటిని చిత్రించే స్థితుల్ని గురించీ భావింపజేస్తుంది. స్వేచ్ఛాతత్వంతో పాటు, ఉన్నతమూ, బాధ్యతాయుతమూ, ఐన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదం చేస్తుంది.'' అంటారు రంగారావుగారు చివరకు మిగిలేది నవలపై వ్యాసం రాస్తూ మానవతావాద సాహిత్యాన్ని గురించి.

మానవతావాద కవులుగాని, వ్యక్తివాద కవులుగాని వారి వారి కవితా ఖండికలలో ఎక్కువగా ప్రతీకల్ని ఉపయోగిస్తారు. కొంత మందిలో ఈ ప్రతీకలు పాఠకునికి అందనంత ఎత్తున ఉండి వ్యక్తిగత ప్రతీకలుగా మాత్రమే నిల్చిపోతాయి. మరికొంతమందిలో ఈ ప్రతీకలు కవిత్వంలోనూ, భావంలోనూ ఒక భాగంగా ఇమిడిపోయి కవి చెప్పదల్చుకున్న భావానికి వాహికలుగా మారి పాఠకుని మనస్సుకి హత్తుకుంటాయి. రంగారావుగారి కవిత్వంలో ప్రతీకలు ఈ రెండవ తరహాకి చెందిన ప్రతీకలు. వ్యక్తి వికాసం, మానవతావాదం అంటూ కవిత్వం రాస్తున్నవారిలో మార్మికచ్ఛాయలు తప్పనిసరి. ఆ ఛాయలూ వీరి కవిత్వంలో స్పష్ట స్పష్టంగా కనబడతాయి. రంగారావుగారికి ప్రాచీన సాహిత్య సంస్కారం ఎక్కువగానే ఉంది; ఈనాటికీ దానిమీద అభిమానం మరీ ఎక్కువగా ఉంది. ఆ కారణంవల్లనూ, వారు అందించే భావ సంస్కారంవల్లనూ వారి కవితాశైలి ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. కవిత్వ పాదాల నిర్మాణంలో క్రియాపదం ముందుకు రావటం ఆయన కవిత్వానికి సాధారణ లక్షణమైంది కాని దానివల్ల సాధించిన పరమ ప్రయోజనం మాత్రం అల్పమైంది. వచన గేయ కవుల్లో — ఎక్కువమందిలో కనిపించే అంత్యప్రాసల గారడీ రంగారావుగారి కవిత్వంలో లేకపోవటం ఆయన కవిత్వానికొక విలక్షణత.

ఇప్పటిదాకా వచ్చిన మానవ చరిత్ర అంతా వర్గపోరాటాల ఫలితమని కమ్యూనిస్టు మానిఫెస్టో చెబుతున్నది. కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం వ్యక్తి స్వేచ్ఛ కంటె సామాజిక స్వేచ్ఛ ముఖ్యమైనది; వ్యక్తి చైతన్యాన్ని అతని సామాజిక అస్తిత్వమే నిర్ణయిస్తుంది. చరిత్రలో ప్రతి పోరాటమూ దరిద్రులను కాల్చుకు తినటానికే జరిగింది. కమ్యూనిజాన్ని అంగీకరించని సామాజిక శ్రేయోవాదులు దీనికంతటికీ కారణం వ్యక్తి స్వార్థమని నమ్మి దానికి పరిష్కారంగా వ్యక్తి మానసికంగా పరిణతి చెందాలని చెబుతున్నారు. రంగారావు గారూ అదే చెప్పారు.

''అధికార పిపాస, కీర్తికాంక్ష ప్రబలి
అంతరింపబడిన ఒక రాజవంశ రక్తంతో
తడిసిన వేరొక రాజవంశ మావిష్కృతమై
అణగద్రొక్కబడిన ఒకజాతి మతస్థానంలో
జరిగిపోయెను వేరొక జాతి మతాభ్యుద్ధానం''
''రాతియుగం నుండి అణుయుగం వరకూ
నియంతృత్వం నుండి సామ్యభావన వరకూ
సాగిన చరిత్ర పరిధులన్నీ
అశాంతిలో రూపొందినవే''



సమాజంలో వర్గాలుంటాయనీ, ఆ వర్గాలకు స్వభావాలుంటాయనీ, ఆ వర్గ స్వభావాలే చరిత్రను నడిపిస్తాయని నమ్మక పోవటంతో వ్యక్తి స్వార్థమనో, అశాంతి అనో చరిత్ర గతికి, స్థితికి పేరు పెట్టడం జరుగుతోంది. రంగారావుగారు చెప్పినట్లుగానే ఎదలో ఆర్ద్రత మతిలో వివేకం చాలామందిలో ఉన్నాయి. కాని ఈ ఆర్థిక సమాజంలో ఆర్ద్రత, వివేకం రెండూ గాలిలో పేలపిండివలె ఎగిరిపోతున్నప్పుడు ఈ వర్తమానంలోంచి ఏ విశ్వాసంతో భవిష్యత్తులోకి ప్రయాణిస్తాడు మనిషి? బ్రతుకంటే చీకట్లో నీడలు వెతకటం కాదని, వెలుగుపై చీకటి చిమ్మటం కాదని, చీకటిని అలంకరించటం అంతకంటె కాదనీ నమ్మినప్పటికీ వెలుతురు పిట్టలపై చీకట్లు సజీవ సమాధుల్ని నిర్మిస్తున్నప్పుడు ఏ ఆశతో ముందుకు మనిషి నడుస్తాడు? అన్నది ఆలోచించవలసిన ప్రశ్న.

మాదిరాజు రంగారావుగారు కొన్ని మినీ కవితల్ని కూడా రాశారు. అయితే వాటిని కూడా మినీ కవితలనే బదులు ముక్తకాలంటేనే బాగుంటుందేమో. మినీ కవితకు క్లుప్తత చమత్కారం, చెంపదెబ్బ ప్రధాన లక్షణాలు. రంగారావుగారి మినీ కవితలలో చమత్కారం కంటె సీరియస్‌నెస్ ఎక్కువ. ఎక్కువ గేయాల్లో సందేశం కనపడుతుంది గాని చెంపదెబ్బ కనపడదు.

వీరి కవిత్వంలో పగళ్ళు, రాత్రులు— జనన మరణాలకు జ్ఞాన, అజ్ఞానాలకు, సుఖ దుఃఖాలకు, వొంతెన — జీవితానికి పూర్వం, జీవితానికి తరువాతకూ, సముద్రం — హృదయానికి, అలలు — భావాలకు, శిశిరం — దౌర్భాగ్యానికీ, వినాశనరీతికీ, సూర్యతేజం— సౌభాగ్యానికీ, సృజన లక్షణానికీ ప్రతీకలు. సందర్భాన్నిబట్టి వారుపయోగించే ప్రతీకను అర్థం చేసుకొన వచ్చును.

ప్రతి కవికీ ఒక విశ్వాసం ఉంటుంది. లేకపోతే కవిత్వానికి ఎదుగుదల గాని, కవిత్వంలో వివాదం గాని ఉండవు. వ్యక్తి వికాసంతోనే సామాజిక వికాసం జరుగుతుందనే నమ్మకం ఈనాడు ఎక్కువ మందికి లేదు; రంగారావుగారికున్నది.

తిండికి బట్టకు స్వేచ్ఛకు కరువులేని
సామ్యభావ సామాజిక వ్యవస్థలోనూ,
మానవజాతి సమగ్ర వికాసం

మరో మనోలోకాన్ని సృజించుకున్నప్పుడే -
ఒక మహాపధాన వేగ దీప్తి సాగు
యుగ రథచక్ర విఘట్టితమై నలగి కలగి
గాలికి గియు ధూళికి వెరగొందక
మానవతపై విశ్వాసంతో పురోగమన
శీలంతో

ఎత్తక తప్పదు నేటి మానవుడు
వైజ్ఞానిక యుగ భూమికలో
వైయక్తిక వికాసంతో
విశ్వసంస్కృతీ రూపం.

సీరియల్

అందానికి అవతలివైపు

—కేఎస్వీ

27

(గత పంచిక తరువాయి)

సాయంత్రం లైబ్రరీలో 'క్విక్ రెఫరెన్స్' హాలులో పుస్తకాలు తిరగేస్తోంది సుందరి.

హాలంతా దాదాపు నిర్మానుష్యంగా ఉంది, సుందరి కూచున్న చోటునుంచి రెండు టేబిల్స్ అవతల కూచున్న ఒక వ్యక్తి మినహా.

సుందరి అక్కడికి వచ్చినప్పటిమంచి అతను ఆమెకేసి మిర్రిమిర్రి చూస్తున్నట్టు సుందరికి తెలీదు.

చూస్తున్న పుస్తకం మూసేసి, ప్రక్కనే ఉన్న రాక్‌లోని మరో పుస్తకం కోసం చెయ్యి చాపింది సుందరి. ఆ ప్రయత్నంలో కాస్త పైట తొలగింది. పైట సర్దుకుంటూ, పుస్తకం అందుకుంటూ యధాలాపంగా ప్రక్కకి చూసిన సుందరి ఆ వ్యక్తి వాలకం చూసి అదిరిపడింది. షాక్ తగిలినట్టయింది. అతని వొక చెయ్యి — పెదిమల మీద రాస్తూ అసహ్యంగా ...

అతని ముఖంలో కామపు పశుత్వం —

సుందరి తేరుకునే లోపలే అసలు విపరీతం తృటిలో జరిగిపోయింది —

సుందరి అటు చూడగానే ఆ వ్యక్తి పెదవులు చప్పరిస్తూ గుటకలు వేశాడు.

చప్పున లేచి, నేరుగా సుందరి దగ్గరకొచ్చి, వొక చేత్తో ఆమె మెడను పట్టుకుని — రెండో చేత్తో తలను పట్టుకుని — ఆమె పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు ...

"ఏయ్ ... ఛీ ..."

గింజుకుని విడిపించుకుంది సుందరి.

"వ్వాటీస్ దిస్ ... యూ... బ్రూట్...ఛీ.. బాస్టర్ ..."

సుందరి అంటూనే ఉంది, ఆ వ్యక్తి హాలు నుంచి చరచరా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు సుందరికి.

ఆ వ్యక్తిని గుర్తు తెచ్చుకోవటం కష్టమేమీ కాలేదు. ముప్ఫై దాటిన వయసు. హిస్టరీలో లెక్చరర్ అతను, అప్పుడప్పుడూ సైకిల్‌మీద కనిపిస్తుంటాడు.

ఈ విషయం ఇంట్లో చెప్తే ఎలా ఉంటుందనే ఊహ చాలాసేపటికిగాని రాలేదు. ఆలోచనమీద, చెప్పటం బాగుండదనిపించింది.

*　　　*　　　*

మరుసటి దినం కాలేజీకి వెళ్తూనే సుందరి సరాసరి ప్రిన్సిపాల్ దగ్గరికెళ్ళి రిపోర్ట్ చేసింది.

మరో పావుగంటకి — దోషిగా తలవంచుకుని నిలుచున్నాడు హిస్టరీ లెక్చరర్.

"సార్ ... తప్పునాదే ... నేనే తప్పుచేశాను .. ఆ నిమిషం ఎక్సయిట్ అయాను ..."

"మీరు ఎక్సయిట్ అయితే? పెళ్ళయి పిల్లలున్న మీకే ఇలాంటి పెర్వర్షన్స్ అయితే — ఇహ స్టూడెంట్స్ సంగతేవిటండీ ?"

"అయామ్ సారీ — సర్ ..."

"నాక్కాదు. ఆ అమ్మాయికి చెప్పు...చెప్పటం కాదు. క్షమాపణలు కాయితంమీద రాసివ్వండి .. పుటిట్ ఆన్ పేపర్ ... యస్ !"

"సర్ ..." నసిగాడతను.

"నథింగ్ డూయింగ్... ఇదేం చిన్నమేటరను కుంటున్నారా? మర్యాదగా రాసివ్వండి..."

"సరే సర్..."

పది నిమిషాల్లో ప్రిన్సిపాల్ చెప్పినట్లు క్షమాపణ పత్రం రాసి సుందరి ముందుంచాడు అతను, "ఐయామ్ రియల్లీ సారీ... నన్ను క్షమించండి..."

కోపం రావటం బదులు అతని వాలకంచూస్తే నవ్వు వచ్చింది సుందరికి· లోలోపలే నవ్వుకుంది.

ప్రిన్సిపాల్ ప్రయత్నం వల్ల ఈ వార్త చాలా మటుకు అలాగే అణగిపోయింది. కాని, ఎంతో కొంతగా మాత్రం పాక్కనే పాక్కింది.

"సుందరి— ది సెక్స్ క్వీన్ !"

"మతి పోగొట్టే మగువ—"

"సెక్స్‌బాంబ్ !"

"ఫేసా— ఫిగరా? కలరా? గ్లామరా?—సుందరి సౌందర్య రహస్యం ఏమిటి ?"

"ఏ సబ్బు ?"

"ఎవరో అదృష్టవంతుడు—"

సాయంత్రానికల్లా ఇట్లాంటి కామెంట్లు ఎన్నో సుందరి చెవిన పడ్డాయి.

టూకీగా విషయం శ్యామలరావుకి మాత్రం చెప్పింది సుందరి.

"నేవెళ్ళి వొకసారి ఆ హిస్టరీ వీరుణ్ణి పలకరించనా?" అన్నాడు అతను.

"వొద్దు— ఎలాగూ శాస్తి జరిగినట్లేగా..."

"భార్యా రూపవతీ శత్రుః— అన్నారు ఇందుకే కాబోలు. అయినా నీ జాగ్రత్తలో నువ్వెప్పుడూ ఉండాలి సుమా ! నీకు వేరే చెప్ప నవసరం లేదనుకో..."

"తమాషా ఏమిటంటే— అతనిమీద నాకు పిటీయేగాని— కోపం రావటం లేదు..."

"నాచురలీ... అతని టెన్షన్స్ ఎలాంటివో పాపం... నీలాంటి స్త్రీని చూస్తూ భరించుకోవటం ఎంత కష్టమో..."

28

సాయంత్రం ఐదున్నరకి పార్కు దగ్గర సుందరికోసం ఎదురుచూస్తున్నాడు శ్యామలరావు.

అల్లంత దూరాన రిక్షా కనిపించింది.అందులో మనిషి కూచున్న తీరుబట్టే — సుందరే అని తెలిసింది.

ఆ రిక్షా వెనుకే మరో టాపులేని రిక్షాలో ముగ్గురు స్టూడెంట్లు వస్తున్నారు.

వాళ్ళు సుందరి రిక్షాకేసి చూస్తూ కేకలు వేస్తూ కామెంట్లు విసురుతూ వికవికా నవ్వు కుంటున్నారు.

పార్కు దగ్గరపడుతుండగా — సుందరి రిక్షా స్పీడు తగ్గటమూ, శ్యామలరావు ఒకడుగు ముందుకు వెయ్యటమూ చూశారు కాబోలు — వాళ్ళు తాము వస్తున్న రిక్షాను అక్కడే వెనక్కి తిప్పించుకుని వెళ్ళిపోయారు.

డబ్బులిచ్చి రిక్షాను పంపేసింది సుందరి : "సారీ — లేటయ్యాను కాబోలు..."

"ఎవరో వెంటపడ్డట్టున్నారు —"

"మరే...రోడ్డు మీదున్నారు...నన్ను రిక్షాలో

జరిగిన కథ—5 సుందరి చాలా అందంగా వుంటుంది. ఆ పిల్ల కళ్ళు ఇంకా బావుంటాయని చూసిన వాళ్లంతా అనుకొంటుంటారు. సుందరికి ఇంట్లో జరిగే తతంగం, బయటి వాతావరణం తెలిసీతెలియ నట్లుగా వుండి ఎన్నోప్రశ్నలకు దారితీస్తాయి. ఇంట్లో ఏవో గొడవలు జరుగుతాయి. ఆ తర్వాత తల్లిదండ్రులతోపాటు గుంటూరు నుంచి ఆ వూరుకు వచ్చేస్తుంది సుందరి. అక్కడ తండ్రి ఎలిమెంటరీ స్కూల్లోచేరుస్తాడు. ఆ స్కూల్ నుంచి హైస్కూల్లో, అక్కడ్నుంచి కాలేజీలోకి వస్తుంది సుందరి. చాలా పట్టుదలతో చదువుతుంటుంది. సుందరిని ఆమె స్నేహితురాలు అన్న సుమంత్ ఆరాధిస్తుంటాడు. కానీ ఆ ఇద్దరికీ పొత్తు కుదరక విడిపోతారు. ఆ తర్వాత సుందరి యూనివర్సిటీలో చేరుతుంది. అక్కడి వాతావరణం ఆమెకు చాలా తమాషాగా వుంటుంది. మురళి అనే ఓ సీనియర్ విద్యార్థి సుందరితో స్నేహం చేయటానికి ముందుకు వస్తాడు. అతనికి సుందరి గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అదే అలుసుగా తీసుకొని తనను అనుభవించటానికి ప్రయత్నించిన మురళి నుండి తప్పించుకొంటుంది సుందరి. ఓ ఉత్తరం ద్వారా, ఆ తర్వాత తన అందంతో ఆమెను ఆకట్టుకొంటాడు ఉద్యోగం చేస్తున్న శ్యామలరావ్.

చూసి — వాళ్ళూ రిక్షాలో ఫాలో అయారు ... వొకటే కామెంట్సు...''

''అలా వాక్ వెళ్దామా ?''

''లేట్పైపోదూ ?''

''మరేం ఫరవాలేదు...''

ఇద్దరూ మామూలుగా పార్కులోనే కూచుంటారు. ఒక్కొక్కప్పుడు మాత్రం రోడ్డు మీదే ఇంకా పైకి నడిచి, గుట్టదిగువగా ఉన్న యూకలిప్టస్‌లలోకి వెళ్తారు.

సుందరి ఏమిటో మాట్లాడుతూంటే పరధ్యానంగా ఊఁకొడుతున్నాడు శ్యామలరావు.

యూకలిప్టస్‌ల మధురమైన వాసనల్ని ఆఖరుగా పీల్చి వెలుగులు నిష్క్రమిస్తున్నాయి.

కూచున్న సుందరికేసి తదేకంగా చూస్తూ, వున్నాడు శ్యామలరావు.

''శ్యాం — ఇవాళ నువ్వు—అదోలా ఉన్నావు...''

''అవును సుందరీ...''

''అవునా ? ఏంటి — చెప్పు...''

''చెప్తాను—నీకోసం ఎందరు ఎంతగా ఎగబడుతున్నారో చూస్తున్నాను ... నీవు చిత్రంగా పరిచయమై ఇలా ఆత్మీయత పెంచుకున్న నేను ఎంతో అదృష్టవంతుణ్ణి ... ఈ అనుబంధాన్ని సార్థకం చెయ్యాలి...''

ఆమెచుట్టూ అతని చేతులు బిగుసుకున్నాయి.

''ఇలానా ? వద్దు— ప్లీజ్...'' అంది కాని, ఆ సమయంలో శ్యామలరావుని నిరాకరించటం సాధ్యం కాదని తేలిపోయింది.

''ఇప్పటికిలాగే— ప్లీజ్!...''

నక్షత్రాలు స్పష్టంగా మెరిసేటప్పటికి సుందరి కళ్ళలో స్త్రీత్వం కొత్త మెరుపులు మెరిసింది. కొత్తగా ఏవో లోకంలోకి మేలుకున్నట్లయింది.

''కోపమా ?'' అన్నాడు శ్యామలరావు, ముద్దు పెట్టుకుంటూ.

''ఇప్పటికి లేదు—'' అంది సుందరి.

''బిలీవ్ మీ... ఐ విల్ నెవర్ లీవ్ యు...''

29

మరుసటి రోజే తల్లితోనూ తండ్రితోనూ తన నిర్ణయం గురించి చెప్పింది సుందరి.

''సుందరీ... నువ్వు అన్నీ ఆలోచించావా ?'' అంది కౌసల్య.

''అమ్మా... ఇంత కాలమూ ఆలోచిస్తూనే వున్నాను— ఇప్పుడు ఇప్పుడు ఆలోచించే ప్రసక్తి లేదు—''

కౌసల్యకు కూతురు చెప్పనిదంతా కూడా అర్థమయింది.

ఆమె బాధ పడలేదు.

సాధ్యమైనంత తొందరగా మాత్రం కూతురి పెళ్ళి అయిపోతే బాగుండుననుకుంది.

''శ్యామలరావు సంగతి అటుంచి—నువ్విప్పుడే— ఇంత తొందరగా— పెళ్ళెందుకు చేసుకోవాలో అర్థం కాదు. ఎమ్మెస్సీ అయాక రిసెర్చ్ చెయ్యొచ్చుగదా— ఆ తర్వాత ఉద్యోగం వెదుక్కో వచ్చుగదా— పెళ్ళి గురించి ఆ తర్వాత ఆలోచించవచ్చుగదా—'' అన్నాడు సురేష్.

''అంతవరకూ పెళ్ళికొడుకులు కాచుక్కూచుంటారా యేం ?'' అంది కౌసల్య.

''అక్కయ్య వుండమంటే రాజకుమారులైనా కాచుకునే వుంటారు— దానికేంగాని— ఇంతకీ శ్యామలరావుగారు కట్నం గిట్నం అంటూ అడగరా ?...''

* * *

''పెళ్ళి విషయం మాట్లాడాలి — నాన్నగారు మిమ్మల్నోసారి కలవమన్నారు — '' అని సుందరి అనగా—

''అలాగే'' అంటూ వచ్చాడు శ్యామలరావు.

అతనిమీద మొదట ఏర్పడిన సదభిప్రాయం స్థిరపడుతోంది సుందరిలో.

చాలామంది యువకుల తత్వానికీ ఇతని ప్రవృత్తికీ చాలా తేడా వున్నట్టు తెలుస్తూనే ఉంది.



అందానికి అవతలివైపు

స్థితి గతులన్నీ శ్యామలరావుకి విడమరిచి చెప్పాడు కామేశ్వరరావు.

''బాబూ — కట్నాలూ కానుకలూ ఇచ్చే శక్తి లేని మాట అటుంచి — తొలినుంచీ అది వొక ఆశయంగా భావిస్తూ వచ్చాను. అందుకే — వెనకెయ్యాటమంటూ ఏమీలేక — సుందరికి చదువు చెప్పిస్తూ వున్నాను. చదువుకున్న వాళ్ళకు ఇంత కంటే చెప్పనవసరం లేదు. అన్నీ ఆలోచించే ఇందుకు సిద్ధపడుతున్నావనుకుంటాను. ఇంకా మీవాళ్ళతో ఎవరితోనైనా మాట్లాడాల్సుంటే ... ''

నవ్వాడు శ్యామలరావు. ''సుందరి మీకు అన్నీ చెప్పే వుంటుంది. ఇది మేమిద్దరమూ బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం. ఇందుకు మీరు పెద్దగా డబ్బు వ్యయం చేసే ప్రసక్తే లేదు. నాకు అత్తయ్యా, బావమరిదీ వున్నారుగాని — పెళ్ళినాటికి తప్ప వాళ్ళ ప్రమేయం లేదు. ఈ విషయంలో నిర్ణయం అంతా నాది. మీకు అంగీకారమయితే మీకు తోచినట్టు ఏర్పాట్లుచేసి పెళ్ళి చెయ్యండి. లేదంటే ఆ పని నేనే చేసుకోగలను — '' అన్నాడు శ్యామలరావు.

డొంక తిరుగుడు లేకుండా విషయాలన్నీ చర్చించారు.

''సుందరికి నేను ఎప్పుడో మాట ఇచ్చాను. అది మీ ముందూ చెప్తున్నాను. పెళ్ళితో స్త్రీ జీవితం ఇంటి గడపకి పరిమితమైపోవటం సంస్కృతి అనుకునే మనస్తత్వం కాదు నాది. సుందరి స్వేచ్ఛ సుందరి కెప్పుడూ ఉంటుంది. ఉద్యోగం విషయమనే కాదు — ఆమె జీవితం ఉన్నతంగా వికసించేందుకు సంబంధించిన అన్నింటిలోనూ అంతిమ నిర్ణయాలు సుందరివే ... ''

''మా సుందరి చాలా అదృష్టవంతురాలు ... ముహూర్తం ఎప్పుడు పెట్టమంటేబాగుంటుంది?''

''మీ ఇష్టం. ఎటూ అకడమిక్ ఇయరు ముగుస్తోంది. సుందరి పరీక్షలు పూర్తయాక అయితే బాగుంటుందని నా ఉద్దేశం...''

ఒక సమస్య తీరిపోయినట్టనిపించింది సుందరికి.

ఆ తరువాత శ్యామలరావు సుందరికి మామూలుగా కలుస్తూ మాట్లాడుతూ వచ్చాడు.

ఒకసారి పార్కుదగ్గర కలిసినప్పుడు ''అలా వాక్ వెళదాం — '' అన్నాడతను.

''పరీక్షలు ముగిసేదాకా 'వాక్'కి వెళ్ళటం ఆరోగ్యానికి మంచిదికాదు''అంది సుందరి నవ్వుతూ.

''బాగా చదువుకో సుందరీ...నీ భవిష్యత్తు గురించి నీకన్న ఎక్కువ ఆలోచనలు నాకుఉన్నాయి— మరిచిపోకు ...''

ఆ రాత్రి చాలా రోజుల తర్వాత అద్దంలో సుందరితో బాతాఖానీ వేసింది సుందరి:

''నిజం చెప్పవే— అద్దంలో సుందరీ! శ్యామలరావు మీద నీకు పరిపూర్ణమైన ఇష్టం ఉందా ?— లేక — ఏదో ఇంతవరకూ ఇలా జరిగింది కదా అని చేస్తున్నావా ?...''

''జరిగింది — జరిగిందే... అయితే శ్యామలరావు నాకు సరైన జోడీ కదా ... నా ప్రక్కన నిలబడాలంటే ఆమాత్రం కనుముక్కుతీరు బాగున్నవాడైనా దొరకొద్దు...''

కొత్త ఎక్స్‌రే చికిత్స !

ఎక్స్‌రేల వలన శరీరంలో కేన్సరు, ఇతర వ్యాధులు ఏర్పడటానికి అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. ముఖ్యంగా శరీరం బలహీనంగా ఉన్నపుడు, వ్యాధిగ్రస్థుల పై ఎక్స్–రేలను ప్రయోగించినపుడు ఈ అవకాశం ఎక్కువగా ఉంటున్నది. జపానులోని ఫ్యూజి ఫోటో ఫిల్మ్ కంపెనీవారు కొత్త ఎక్స్‌రే చికిత్సా విధానాన్ని కనుగొన్నట్లు తెలియచేశారు. దీనివలన ఎక్స్‌రే పరికరం ముందు ఎక్కువసేపు నిలబడవలసిన అవసరం వుండదు. అందువలన కేన్సరు ప్రమాదం తగ్గుతుంది. అంతేగాని, దీని సహాయంతో శరీరంలోని అతి చిన్న సూక్ష్మ భాగాలను సైతం అయస్కాంత టేపులపై రికార్డు చేయవచ్చు.

''అవెయ్‌లబుల్ బెస్ట్ !...అంతేనా ?...''

''అంత దుర్మార్గురాలినా ? .. మంచివాడే ఇతను...''

''ఇతనితో భవిష్యత్తు ఎలా ఉంటుంది ?''

''అది నామీదే ఆధారపడి ఉంటుంది—''

''సుందరీ !...నువ్వు గొప్ప సాహసికురాలివి ... యు ఆర్ ఎ బ్యూటిఫుల్ అండ్ గ్రేట్ గర్ల్...''

వ్యవధి దొరికినప్పుడల్లా ఊహల్లో తేలుతూ ఉన్నా అశ్రద్ధ చెయ్యకుండా చదువుతూనే ఉంది సుందరి.

ప్రాక్టికల్సు జరుగుతూ ఉండగా : ''ఇక పెళ్ళి ఏర్పాట్లు చెయ్యవచ్చుగా...'' అన్నాడు శ్యామలరావు.

''అబ్బాయిగారికి తొందర మరీ ఎక్కువగా ఉన్నట్టుందే ... ''

''ఉన్నట్టుండటమేమిటి ? తొందరే...ఎప్పుడో ఒక సాయంత్రం ... యూకలిప్టస్‌ల వాసనల మధ్య ... ''

''చాలు బాబూ ... ఆపండి ... ''

''ఇవాళ 'వాక్' వెళ్దామా ?''

''నాకు ప్రాక్టికల్సు ... ''

''నాకూ అదే — ప్రాక్టికల్సు ... కావాలి...''

''కొంటె ... ''

''అసలు నేనెంత బుద్ధిమంతుణ్ణి ! ... నన్నిలా చేసింది నువ్వే ... ''

సుందరి పెళ్ళి గురించి కామేశ్వరరావు తీవ్రంగానే పూనుకున్నాడు.

దేవదుందుభులు మోగించినట్టు కూతురి పెళ్ళి చెయ్యాలని ఆయనకూ ఉంది. కాని, ఆర్థిక స్థితి అందుకు అంగీకరించటంలేదు.

''ఏం చేద్దామంటావు ?'' అన్నారు భార్యతో.


''పెళ్ళి — జరగాలి — అంతే ! ఎంత నిరాడంబరంగా జరిగినా జరిగినట్టే ... ఉన్నంతలో కానివ్వటమే ఉత్తమం — '' అంది కౌసల్య.

ఉన్నంతలో ఏర్పాట్లన్నీ చెయ్యబూనాడు కామేశ్వరరావు.


ప్రాక్టికల్సు ముగిసిపోయిన సాయంత్రం ఇంటి కొచ్చేసరికి పెళ్ళి పత్రికలు రెడీగా ఉన్నాయి.

ఎంత బహుళ ప్రయోజనమైనదంటే, ఇది లేకుండా ఇన్నాళ్ళు
ఎలా వంట చేయగలిగామని మీకే ఆశ్చర్యం కలుగుతుంది.


ప్రెస్టీజ్ వారి ప్రెషర్ పాన్




వేపుడు




హెచ్చు వేపుడు



సాట్



ప్రెషర్ కుక్



మీరు ఇందులో వేపుడు హెచ్చు వేపుడు చేసుకోవచ్చు అవసరమైన అన్నిరకాల మేరకు వేపుడు చేసుకోవచ్చు మూత ఉంచి వండాలి అంతే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ వెంటనే మీకు సిద్ధం చేస్తుంది బహుళ ప్రయోజనమైనది మరియు ఎంతో ముచ్చటైనది మీ కుటుంబానికి నోరూరించే రుచికరమైన వంటకాలు క్షణాలలో సిద్ధం చేయడంలో మీకు తోడ్పడేందుకు అనువుగా రూపొందించ బడింది

మూత వేయకుంటే దళసరి గేజ్ కలిగిన ఈ పాన్‌పై కొద్ది నూనెతో ఉల్లిపాయలు కూరగాయలు మసాలాలు మాంసాన్ని, కోడి మాంసాన్ని వేపుడు చేసుకోవచ్చు ప్రెస్టీజ్ మూతతో దీనిని మూస్తే మీ వంటకాన్ని వెంటనే సిద్ధం చేస్తుంది కోడి బుర్రా? 20 నిమిషాలు మటన్ దోపియాజీ? 25 నిమిషాలు

దమ్ ఆలూ? ఇంకా తక్కువ వ్యవధిలో మంచి పనులకోసం మీ సమయాన్ని ఆదా చేసుకోండి మరియు మీ ఇంధనం చిరకాలం నిలువడానికి తోడ్పడుతుంది

ఒక్క వంటకానికి రకరకాల పాకాలు ఉపయోగించి చివరకు కుక్కర్‌లో వండే శ్రమ ఇక మీకు ఉండదు బహు పాత్రల పనికి అనుకూలమైన ఏకైక పాత్రను ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు అందిస్తున్నది

ప్రెస్టీజ్ వారే ఈ ప్రెషర్ పాన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు మిక్కిలి ప్రజాదరణ కలిగిన ప్రెషర్ కుక్కర్‌ను భారతదేశంలో మొట్టమొదటగా ప్రవేశపెట్టి అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ ద్వారా ప్రెషర్ వంటను నిరపాయకరంగా తీర్చిదిద్దినది ప్రెస్టీజ్ వారే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీ వంటగదిలో మీకు ఇతోధికంగా ఉపయోగపడుతుంది

<u>దీని ధరలో సగానికంటె తక్కువకే మీరు దీనిని పొందాలంటే ఇదిగో....</u>

మీకు ఇప్పటికే ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఉంటే మిమ్ము మీరు అభినందించుకోండి భారీ గేజ్ కలిగిన పాన్ ధరకే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీదవుతుంది ఒక్క పైసం కొంటే చాలు మీ ప్రెస్టీజ్ కుక్కర్ మూత దీనికి సరిగ్గా సరిపోతుంది అంతే సరసమైన ధరకు ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు లభించినట్లే ఎందుకంటే, మీ కష్టార్జితమైన సొమ్ముకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను మీకు సమకూర్చ డానికి ప్రెస్టీజ్ కంపెనీ కృషి చేస్తున్నది

ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఇంకా మీవద్ద లేకుంటే..


ఒకేసారి బహుళ ప్రయోజనాలు పొందడానికి నిజంగా ఇది మీకు మహదవకాశము వంటగదిలో మీకు భలేగా, ఉపయోగపడగల రెండు పాత్రలు ఇప్పుడు మేము మీకు అందిస్తున్నాము—అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ కలిగి భారతదేశంలోకెల్ల నిరపాయకరమైన ప్రెషర్ కుక్కర్ మరియు అద్భుతమైన ప్రెషర్ పాన్—ఒకే ధరకు కొంచెం ఎక్కువలో రెండు పాత్రలు లభిస్తాయి

ఒకే మూత రెండింటికి సరిపోతుంది మరియు మీకు రూ 150/-లు ఆదా

Prestige
PRESSURE PAN

TTK తయారీ.

maa(s) PP 1 Tel b 82



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

నోములు - వ్రతాలు

దాన ధర్మాలవల్ల పుణ్యం కలుగుతుందని చెప్పినంత మాత్రాన వాటిపై ఆసక్తి చూపేవారు చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు. కుటుంబంలో కొందరికి వాటిపై ఆసక్తి వుండి, మరి కొందరికి లేకపోతే— ఆ దానధర్మాలు కొనసాగడం కష్టం. భార్యకు ఇష్టం ఉంటే భర్తకు యిష్టం లేకపోవడం, భర్తకు ఉంటే భార్యకు ఇష్టం లేకపోవడం— వీటివల్ల కలతలూ కలుగుతూ ఉంటాయి. ఇలాటి చిక్కులు లేకుండా దానధర్మాలు కొనసాగడానికి నోములు, వ్రతాలు ఏర్పడినవని మనం ఊహించవచ్చును.

ఫలానా నోము పడితే ఫలానా ఫలం లభిస్తుందనీ, ఫలానా వ్రతం చేస్తే కోరిన కోరిక తప్పక నెరవేరుతుందనీ వాటి వాటిని గూర్చిన వివరాలు, నియమాలు నిబంధించ బడినవి.

సంతానం కోసమనికాని, మరొక కోరికతో గాని స్త్రీలు కొన్ని నోములు నోస్తూ వుంటారు. ఆ నోముల కథలు వారివి ఎక్కువ ఉన్నాయి. వాటిలో చెప్పిన పద్ధతితో కాల మ్యాన్ని పాటిస్తూ, కాల పరిమితి ముగిస్తే ఉద్యాపన చేయడం ఉన్నది. ఈ నోముల్లో దానధర్మాలు చెయ్యవలసి వుంటుంది ఇతరులకు ప్రయోజనం కలుగుతుంది కేశ్వరుని నోములో తృప్తిగా భక్ష్య భుజింప చెయ్యడం, పదహారు ఫల ఫల దానంవల్ల ఉత్తములకు తృప్తి జరుగుతుంది.

వ్రతాలు కూడా ఇలాటివే నారాయణ వ్రతం మొదలైన వ్ర నప్పుడు వ్రతం చేసేవారి బంధు పూజా సమయంలో ఉండి వ్రతం వ కథ విని ప్రసాదాన్ని స్వీకరిస్తేనే నుంచి కదలకూడదని చెప్తారు. ఆ వ్రతంమీద ఆసక్తి కలుగుతుం స్వీకరించినందువల్ల తృప్తి ఏ మండప దానంవల్ల పూజ చే ఆర్థికంగానూ, పదార్థముల మూ లాభం కలుగుతుంది. ఈ విధం జరగడానికి స్త్రీలు నోముకునే నో...యూ, స్త్రీ పురుష భేదం లేకుండా జరిగే వ్రతాలూ మిక్కిలి దోహదం చేస్తున్నవని గ్రహించాలి. ★

అందానికి అవతలివైపు

ఆ రాత్రంతా కూచుని ఇన్విటేషన్స్ మీద అడ్రెస్‌లు రాస్తూ గడిపింది సుందరి.

కొందరి అడ్రెస్‌లు గుర్తులేవు. కొందరు ఏమయ్యారో ఎటుపోయారోకూడా జ్ఞాపకం రావటం లేదు.

మరుసటిరోజు పెళ్ళి పత్రికలు పట్టుకుని పల్లవి వాళ్ళింటి కెళ్ళింది.

"ఎన్నాళ్ళకెన్నాళ్ళకి సుందరీ!...కులాసేనా?"

"పెళ్ళి చూపులయాయి అని చెప్పాక ఒక్క సారైనా కనిపించావూ? ... పెళ్ళిగాని అయిపోయి— నువ్వు ఫారెస్టులంట వెళ్ళిపోయావేమో అనుకున్నాను ... ఏవిట్ట ఆలస్యం? ..."

"ఆయనకో చెల్లెలుందట! ఆమెకు ఉన్నట్టుండి వొంట్లో కాస్త సీరియస్ అయిందిట ... అందుకని పెళ్ళి పోస్ట్‌పోన్ అయింది! అవునూ... నీ చేతిలో ఏమిటి? అమ్మదొంగా! ... నీ నవ్వే చెప్తోంది ... కంగ్రాచులేషన్స్! ..."

చాలా కాలం తర్వాత కలియటం చేత ఇద్దరూ నానారకాల కబుర్లలో పడ్డారు.

"వీణఅడ్రెస్ తెలియదే నాకు...నీ దగ్గిరుందా? అన్నట్టు— సుమంత్ కబుర్లేమిటి?...ఐ ఏ యస్ ఏమయినట్టు ?..."

"ఏమీ కాలేదు... కోచింగు కూడా మధ్యలో వామం పెట్టేశాడు... ప్రస్తుతం ఉత్కల్ యూనివర్శిటీలో ఎం ఫిల్ కోర్సు చేస్తున్నాడు..."

"అదేమిటి?... ఆంధ్రదేశమంతా గొడ్డు బోయిందా?..."

"ఆ యూనివర్శిటీలో ఏదో ప్రాజెక్టుందిట... స్కాలర్‌షిప్ కూడా వస్తుందిట... మూడేళ్ళు..."

"నా పెళ్ళి యేర్పాట్లకు సాయంగా నువ్వు దగ్గరే వుండాలి సుమా..."

"వేరే చెప్పాలా ?..."

పెళ్ళి విషయం తలుచుకుంటూ ఉంటే సుందరికి చాలా చిత్రంగా అనిపించింది. ఏదో జరగాలి కాబట్టి జరుగుతున్న భావనే కాని, గొప్ప భావావేశం లాంటిదేమీ కలగక పోవటం గమనించింది.

యూనివర్శిటీ స్నేహితురాళ్ళకీ పరిచయస్థులకీ చాలా మందికి ఆహ్వానాలు ఇచ్చింది. ఊళ్ళోలేని వాళ్ళకి పోస్టులో పంపించింది.

"పెళ్ళి చేసుకుంటున్నావా?... చాలా మంచి పని చేస్తున్నావు..." అంది జలజ.

ఆ మాటకి చాలా అర్థం ఉన్నట్టు అనిపించింది సుందరికి.

పెళ్ళికి ముందు రాత్రి ఒక కల వచ్చింది సుందరికి.

—వెన్నెలకి ఎగసిపడుతున్న సముద్రంలో నిలకడగా వెళ్ళే ఒక పడవలో తనుంది. ఎన్నో తలలున్న పాము సముద్రంలోంచి లేస్తోంది. ఆకాశం నుంచి పూలరేకులు రాలుతున్నాయి. తనను తాకగానే అవి పూలరేకుల్లాగా చప్పుడు చేస్తున్నాయి.. పర్వతాల మధ్యనుంచి తను తొందర లేకుండా నడిచి వస్తోంది— పారిజాతపు చెట్టుకింద, పసిపిల్లవాడొకడున్నాడు. వాడి పెదవులు మెరికలు తిరుగుతున్నాయి. ఏడుపు ధ్వని వినపడటం లేదు. ఎడారిలో తను పరుగెడుతోంది. వెనుక ఒంటెలు చాలా వేగంగా పరుగెడుతున్నాయి. వాటి మీద నుంచి ఎవరో తనకేసి ఉచ్చులు విసురుతున్నారు. ఒయాసిస్‌లో యూకలిప్టస్‌లున్నాయి. తన గుండెల మీద ఎవరివో చేతివేళ్ళు పాకుతున్నాయి...

మంగళవాద్యాల హోరు వినబడుతోంది.

పెళ్ళి పీటలమీద సుందరి మనోహరంగా ఉంది.

ఆమె ప్రక్కన కూచున్న శ్యామలరావు పెళ్ళి కళతో మన్మధుడి తమ్ముడిలా ఉన్నాడు.

బ్యాంక్‌లో అతని సహోద్యోగులేకాక, పెళ్ళికి అతని అత్తయ్యా బావమరిదీ వచ్చారు.

కామేశ్వరరావు మాటమాటికీ ఏర్పాట్లన్నీ చూసుకుంటున్నాడు. పల్లవి, జలజ — కౌసల్యకు రెండువేపులా చేరి ఆమెకు సాయపడుతున్నారు. సురేష్ తన మిత్రులకి మర్యాదలు చేస్తున్నాడు.

పీటల మీంచే చూసింది సుందరి.

మురళి కనిపించాడు, "సిల్లీ ఇడియట్!" అనుకుంది.

మంగళసూత్ర ధారణం ముగిసింది.

కామేశ్వరరావు ముఖం సంతోషంతో వెలుగుతోంది. బరువు తీరినట్టు నిట్టూర్చింది కౌసల్య.

సుందరి చేయి పట్టుకున్న శ్యామలరావు—చాలా చనువున్న మనిషిలా — తనే అతనులా — ఎప్పటికీ ఒకటిగా — అనిపించాడు —

ఆ రాత్రి —

"నువ్వు ఇంత అందంగా ఎప్పుడూ లేవు —" అన్నాడు శ్యామలరావు.

"అన్యాయం — "

"నిజం...ఎంతయినా పెళ్ళికళ పెళ్ళికళే..."

"సరేలెండి ... మీరు మాత్రం నాకెప్పుడూ అందంగానే కనిపిస్తారు ..."

"ఈ రాత్రి మరపురాని రాత్రి కావాలి ..."

"వాక్‌కి వెళ్దామా ? ..."

నవ్వులూ పూలపరిమళాలూ పెనవేసుకున్నాయి.

(ఇంకా ఉంది)



'ముగ్గురు మొనగాళ్ళు'లో శోభన్‌బాబు, రాధిక

సినిమా విశేషాలు

-జి. వి. జి.

"ముగ్గురు మొనగాళ్ళు"లో

విలక్షణమైన విజం

తులసి (నిర్మల) ఆవేశంతో సాంబ (శోభన్ బాబు) వంక తిరిగింది. "ఛీ! సిగ్గు లేనోడా! కక్కిన కూటికి కుక్క కూడా ఆశపడదురా! కాని, నువ్వు డబ్బు కోసం అడ్డమైన పని చేస్తున్నావ్!"

"నీకు తెలీదులే! పెద్ద విషయాల్లో నువ్వు జోక్యం చేసుకోవద్దు," అన్నాడు సాంబ నిర్లక్ష్యంగా.

తులసి ఆకాశమంతెత్తుకు లేచింది. "ఏం తెలీదురా? సొంత అన్నకే ఎదురుగా నిలబడి కోర్టులో సాక్ష్యం చెబుతావురా?"

సాంబ నిర్ఘాంతపోయాడు. "సొంత ...... అన్నయ్యా?"

"అవున్రా ... అరుణ్ బాబు స్వయాన నీకు అన్న ... ఆ ఏకాంబరంగాడు నీ తండ్రి పృథ్వీరాజును చంపి, శవాన్ని తీసుకెళ్ళి సముద్రంలో పారేశాడురా. నీ అన్న మీద హత్యకేసు బనాయించాడు. ఇప్పుడు నిన్ను తన ఇంటి చుట్టూ కుక్కలా తిప్పు కుంటున్నాడు."

సాంబ వీరావేశంతో పిడికిలి బిగించాడు. "రేయ్, ఏకాంబరం! ఇన్నాళ్ళూ నీ కాళ్ళ దగ్గర కుక్కలా పడున్నాను. ఈ క్షణం నుంచీ నీ తల రాతను మార్చే బ్రహ్మదేవుడ్నవుతాను!" అంటూ బయటకు పరుగుతీశాడు.

తాతినేని రామారావు దర్శకత్వంలో ఆట్లూరి పూర్ణచంద్రరావు నిర్మించే "ముగ్గురు మొనగాళ్ళు" చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటోంది.

'డార్లింగ్ డార్లింగ్'లో పూర్ణిమా జయరాం





'ఆంధ్రకేసరి'లో శ్రీధర్

కొత్త దర్శకునితో డి. రామానాయుడు నిర్మించే చిత్రం

"ఏప్రిల్ 14 న సాంగ్స్ రికార్డింగ్ చేస్తాం. జూన్‌లో షూటింగ్ ప్రారంభించి, ఆగస్ట్‌కు పూర్తి చేస్తాం" అన్నారు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి. రామానాయుడు. చిరంజీవి, శరత్‌బాబు ఇంతవరకు ఎన్నికయ్యారు. బాలమురగన్ కధకు సత్యానంద్ సంభాషణకర్త. చక్రవర్తి సంగీత దర్శకుడు. కె. బాపయ్యవద్ద పలు చిత్రాలకు సహకార దర్శకుడుగా పనిచేసిన కె. మురళీమోహనరావు ఈ చిత్రానికి తొలిసారిగా దర్శకత్వ భారాన్ని వహిస్తారు.

[36 వ పేజీ చూడండి]

విదేశీ చిత్ర విశేషాలు

★ ముస్సోలినీ పేరు ఇప్పుడు ఇటలీలో మళ్ళీ వినిపిస్తోంది. ఆయన మనమరాలు అల్లాసాండ్రా ముస్సోలినీ (వయసు 19) టి.వి.లో అనౌన్సర్. పాప్ సింగర్. కొన్ని సినిమాలలో నటిస్తోంది కూడా. మరో విశేషం – ఈమెకు సుప్రసిద్ధతార సోఫియాలోరెన్ పెద్దమ్మ. సోఫియాతో అల్లాసాండ్రా ముస్సోలినీ ఓ చిత్రంలో నటిస్తోంది కూడా.

★ "ఆక్టోపస్సీ" జేమ్స్‌బాండ్ చిత్రానికి ఉదయపూర్‌లో జరిగిన షూటింగ్‌కే 22½ కోట్లు ఖర్చయిందట. ఐతే, ఇక్కడ తీసిన సన్నివేశాలు తెరమీద 20–30 నిమిషాలకు మించి ఉండవట. ఈ చిత్రం హీరో రోజర్‌మూర్ ఉదయం 11 గంటలకు షూటింగ్ అయితే, 8 గంటలకే మేకప్ పూర్తిచేసుకొని, లొకేషన్‌లో సిద్ధంగా ఉండేవాడట. తనకు నీళ్ళో, కాఫీయో కావలసివస్తే – తానే స్వయంగా వెళ్లి తెచ్చుకునేవాడట.

★ "ది ఎంపైర్ స్ట్రైయిక్స్ బాక్" చిత్రంలో ఒక విచిత్ర ప్రాణి కనిపిస్తుంది. ఏనుగు ముఖం, గాడిద చెవులు, గుర్రం లాంటి శరీరంతో ఈ విచిత్ర జంతువును రూపొందించారు. ఇలాంటి వింత మృగాలను తెరమీగ సృష్టించడం పాశ్చాత్యులకు పరిపాటే.

★ జేన్ కెన్నెడీ ప్రఖ్యాత నీగ్రో నటి. విశ్వవిఖ్యాత ముష్టియుద్ధవీరుడు మహమ్మద్ ఆలీతో ఈమె ఓ చిత్రంలో నటించింది. ఆ చిత్రం పేరు "జీవితం, ఆత్మ, కాయం." ఈమె తరచు ఫుట్‌బాల్ లాంటి క్రీడలకు టి.వి.లో ప్రత్యక్ష వ్యాఖ్యానం ఇస్తూంటుందట కూడా.

★ వీడియోల తయారీలో జపాన్‌దే అగ్రస్థానం. థియేటర్లలో చిత్రాలు విడుదల చేయడం కన్నా వాటిని వీడియో కేసెట్ల ద్వారా విక్రయించడమే లాభదాయకమనే నిర్ణయానికి వచ్చారు పాశ్చాత్యులు. సెన్సార్ కత్తెరకు గురికాని మితిమీరిన శృంగార, క్రూయిమ్ సన్నివేశాలను ఈ వీడియోల ద్వారా ఇళ్ళల్లోనే చూడడానికి వీలవుతుంది. పశ్చిమ జర్మనీలో ఈ ఏడు వీడియో కేసెట్ల అమ్మకం వంద మిలియన్ డాలర్లను మించుతుందని అంచనా. బ్రిటన్‌లో 95 శాతం వీడియో కేసెట్లు అద్దెకు ఇవ్వబడుతున్నాయి; ఈ దేశంలో దాదాపు 35 వేలమంది వీడియో క్లబ్‌లలో సభ్యులు.

ఊళ్ళో సంబరాలు జరుగుతున్నాయి. ఊరుచివర అమ్మవారికి ప్రతిఏటా జాతర చేస్తారు. ఈసారి మరింత ఉత్సాహంతో జాతర చేస్తున్నారు. ఊళ్ళో ప్రజలు స్తోమతుకు తగ్గట్టు అమ్మవారికి పూజలు జరిపిస్తున్నారు. ఊరంతా ఆ వేడుకలోనే ఉంది. ఆ సంబరం ప్రతి ముఖంలోనూ కనిపిస్తోంది,

సావిత్రికి మాత్రం దిగులుగా వుంది. విచారంగా వుంది. దుఃఖంతో మనసు మెలికలు తిరిగిపోతోంది. అమ్మవారి గుళ్ళో కోడిని బలి యిస్తుంటె బాధతో అరిచే దాని గొంతులా సావిత్రి గొంతు విలవిలాడి పోతోంది. తల మొండెం వేరై కోడి గిలగిల కొట్టుకుంటున్నట్లు సావిత్రి గుండె బాధతో భయంతో చేతకాని తనంతో ఆరుస్తోంది.

సావిత్రి అప్పలకొండను మనసారా యిష్టపడింది. తన ప్రాణంలో ప్రాణం అనుకుంది. అప్పలకొండ తోడుంటే తినకింకేమీ అక్కర్లేదనుకుంది. అలాంటి సావిత్రిని మోసం చేసాడు అప్పలకొండ. 'నా బ్రతుకు బండిని బురదలోకి తోసేడు' అని బాధపడింది సావిత్రి. ఆమె మానాన్ని దోచుకున్నాడు అప్పలకొండ. ఆమె శీలాన్ని నాశనం చేసాడు.

సావిత్రికి నాఅన్న వాళ్ళెవరూ లేరు. వున్నతల్లి రెండేళ్ళ క్రితమే పోయింది. పోతూపోతూ తను అంట్లుతోమి పాచిపనిచేసే ఇళ్ళన్నీ సావిత్రికి బ్రతుకు తెరువుగా చూపించిపోయింది. అప్పట్నుంచీ తన వయసునీ, శరీరాన్నీ, అందాన్నీ తగు ఒద్దికలో పెట్టి జాగ్రత్తలో వుంటోంది సావిత్రి. ఆర్నెల్ల క్రితం అప్పలకొండ పరిచయం అయ్యేడు. సావిత్రి గుడిసెకు ఎదురుగా వున్న రాములోరి గుడి దగ్గర అప్పలకొండ కొబ్బరికాయలు అమ్మేవాడు. ఇంటిముందు కనబడే మనిషేమో చూపు చూపు కలుసుకున్నాయి. నవ్వితే నవ్వాలనిపించేది. మాటలు ఎలా కలిశాయో! ఒకరి నొకరు విడిచి వుండలేనంత దగ్గిరయ్యారు.

ఒకసారి అప్పలకొండ అన్నాడు —

''ఓయ్. సావిత్రీ నువ్వు నా జిలేబీ కూనవే. రాములోరి గుళ్ళో సీతమ్మోర్లా నీ రూపం ఎలిగిపోతావుంటదే. అదేటో పిసరంత చ్చనం నువ్వగపడక పోతే నేన్చచ్చిపోతానేట్రో దేవుడో అని బయం పుట్టుకొస్తాదే.''

సావిత్రి ఆ మాటలకు మురిసిపోయేది. తనంటే అంతిదిగా యిష్టపడే మగాడు దొరికినందుకు పరవశించేది.

''నీకే అలావుంటే నిన్నే నమ్ముకున్న కుర్ర మనసు నాది. నాకెట్టావుంటుంది. నిన్నిడిసి వుండలేను కొండా'' అనేది సావిత్రి.

''ఓస్ నీ సోకు సంతకెల్ల. మాటల్తో కూడా నా మనసు పట్టి కొట్టించెత్తన్నావుగదే'' అనేవాడు అప్పలకొండ.

''నాయేం మాటలు వుత్తి ఎర్రి మాటలు కాని. నువ్వే ... నీ సూపుల్తోటీ, మాటల్తోటీ, ప్రేమతోటీ మహోద్యం సూపిత్తున్నావులే'' అనేది సావిత్రి.

అప్పలకొండా, సావిత్రీ అంతిదిగా వుండేవారు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కానీ రెండుమూణ్ణెల్ల వరకూ ముహూర్తాలు లేవని అప్పలకొండ చెప్పేడు.

రెండు నెల్లంటే ఎంతసేపులే అనుకుంది సావిత్రి. ఈలోగా అప్పలకొండ ఇలా మోసం చేస్తాడనుకో లేదు.

నాల్రోజుల క్రితం ఓ రాత్రి అప్పలకొండ తాగొచ్చి రాములోరి గుడి మంటపం మీద పడుకున్నాడు. నిషా తలకెక్కి నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే సావిత్రి విని భరించలేక తన గుడిసెలోకి తీసుకొచ్చి పడుకో బెట్టింది. అప్పుడే అప్పలకొండ సావిత్రిని కావాలన్నాడు. ''నువ్వొప్పుకోకపోతే సచ్చిపోతానే సాయిత్రి'' అన్నాడు. 'పెళ్ళికాక పోతేనేమి, మనువాడే వోడే కదా' అనుకుంది. తనకు అన్యాయం చేయ్యడనుకుంది. 'ఆడ్ని అంతగా అభిమానించే దాన్నైతే ఆడి కోరిక తీర్చడం సబబే' అనుకుంది. అప్పలకొండ పక్కకు చేరింది.

తెల్లవారింది. అప్పలకొండకి రాత్రి తలకెక్కిన నిషా దిగింది. తన కోరికా తీరింది.

''నీకూ నాకూ సంబంధం లేదే సాయిత్రి'' అన్నాడు పొద్దున్నే.

''ఇదేట్రా కొండా ఆ మాటలు'' అంది సాయిత్రి దెబ్బతిన్న పక్షిలా.

''నిన్ను పొందాలనుకున్నాను. పొందేను. బలవంతం సేత్తే నువ్వు అల్లరై పోతావే. నేనూ అల్లరై పోతాను. రాజకీయం తెల్సినోడు ఇలాగే పొందాలే ఆడదాన్ని'' అన్నాడు.

'నన్నన్నేయింసేత్తావా. మనసిచ్చిందాన్నే. నిన్నే నమ్ముకున్నదాన్నే. ఏటా మాటలు, సాల్లే'' అంది సాయిత్రి.

''ఓసోస్, ఇదో పెద్ద అందగత్తెండి. దీనిని తాళికట్టాలటంది. ఓస్, నువ్వు సాయిత్రివే గాని నేను సత్యవంతుణ్ని గాదు. నా పేరప్పలకొండ. నిషా దిగిపోయినాక సెప్తన్నాను. నీకూ నాకూ ఇక ఎలాంటి సంబంధమూ వుండదు.'' అప్పలకొండ బయిటకు వెళ్ళడానికి లేచాడు. సాయిత్రి వెక్కుతూ కాళ్ళకు అడ్డం పడింది.

''ఎందుకేడుస్తావే జిలేబి కూనా. నా పద్దతే అది. పొగడ్తకి లొంగని ఆడదెవతుంటదే. అందుకే నిన్ను పొగిడేను. ఉబ్బిపోయావు. లైన్లో పడ్డావు. నా అవుసరం తీరింది. నా డూటీ ఐపోయింది'' అన్నాడు అప్పలకొండ. ఇంకా చాలా అన్నాడు.

''మన సంగతి ఎవరితోనైనా చెబితే నువ్వే మంచిదానివి కాదని చెబుతా. చప్పుడు చెయ్యక ఊరుకో. ఎవుడైనా పెళ్ళిచేసుకుంటాడు. నేను మగాణ్ణే నాకేటి' అన్నాడు. వెకిలిగా నవ్వేడు. సావిత్రిని ఒక్క తన్ను తన్ని మరీ బైటకు నడిచాడు!

అప్పలకొండచేసిన మోసం సావిత్రిని పిచ్చిదాన్ని చేసింది. అయోమయంలో పడేసింది. ఎంతగానో అభిమానిస్తే దానికి ప్రయోజనం బ్రతుకుమసై పోవటమేనా? ఇప్పుడేటి సెయ్యటం? సావిత్రి విలవిల లాడిపోతోంది.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడైంది. తలుపు తీసింది సావిత్రి. పక్కింటి అమ్మాజి. రెండేళ్ళ కూతుర్ని ఎత్తుకొని నిలబడివుంది.

''ఏంటే'' అంది సావిత్రి.

''సంబరాని కెల్తున్నాను వస్తావు'' అడిగింది అమ్మాజి.

''నేరానే. నాకొంట్లో బాగుండలేదు'' దిగులుగా అంది సావిత్రి.

''నువ్వూ వస్తావనుకున్నాను. సంబరంలో పచ్చబొట్టు పొడిచేవాళ్ళున్నారంట. మా అమ్మాయి చేతిమీద పచ్చబొట్టుతో పేరు రాయిద్దామనుంది నువ్వూ వస్తానంటే రా'' అంది అమ్మాజి.

''అంత చిన్న పిల్లకు పచ్చబొట్టు పొడిపిస్తావంటే! నొప్పి సెయ్యదా? ఏడవదా'' అంది సావిత్రి.

''ఏమంత నొప్పి సెయ్యదనుకో, నువ్వూ తోడుంటే బాగుంటదని.''

''సరే వస్తాలే. నువ్వు ముందెల్లి గుడిదగ్గ రుండు'' అంది సావిత్రి. అమ్మాజి వెళ్ళిపోయింది.

సావిత్రి మళ్ళీ తన ఆలోచనల్లోకి వచ్చింది. ఏం చెయ్యాలి? అప్పలకొండని నమ్ముకొని తనే అన్యాయంగా బలైపోయింది. ఆడు మాత్రం కులాసాగా తిరిగేస్తున్నాడు. ఆడ్ని నమ్ముకున్నందుకిదా శిచ్చ? నిజమే, మగాడ్ని తొందరగా నమ్మకూడదు. నట్టేట్లో ముంచేస్తాడు. కానీ ఇప్పుడేటి సెయ్యడం? అప్పలకొండ పెళ్ళి సేసుకోననేశాడు రెండు మూడ్రోజుల్లో ఈ వూర్నించే వెళ్ళిపోతాడని తెలిసింది. తను పాడైపోయిందని ఎవరికీ తెలీదు. ఎలాగో బాధపడ్తూ బతుకు గడిపేస్తాది. కానీ ఆడు ఇంకెంతమందిని ఇలా మోసం సేస్తాడో?! ఏటి సెయ్యాలి?

సావిత్రి ఇదివరకు అప్పుడప్పుడు సినిమాలు సూసేది. ఈమధ్యమాద్దంమానేసింది. ''సినిమాల్లో ఏటున్నాయి. ఓ ఆడకూతుర్ని ఓ మగోడు బలాత్కారం సెయ్యటం, ఆడు కులాసాగా ఎల్లిపోడం,

ఆనక ఈ ఆడకూతురు బోరున ఏడవడం, తర్వాత నూతిలో పడో, ఉరేసుకునో, గన్నేరుకాయలు తినో సచ్చిపోవడం. ప్రతి సినిమాలో ఇయ్యి తప్పనిసరిగా వుంటాయి. ఆడది పవిత్రమైనదని, దాన్ని పాడుచెయ్యడం తప్పనీ, అభిమానం గల ఆడది తన కన్యాయం జరిగితే బరించలేదనీ, మరో మగోడితో తన ఎంగిలి శరీరాన్ని పంచుకోలేక ఆత్మహత్య చేసుకుంటుందన్నట్లు సూపిత్తారు. ఆడది బలాత్కారింపబడితే అది వెంటనే సచ్చిపోవాలి. కానీ బలాత్కారించినోడు మాత్రం ఓ చమాపన కోరి సుఖంగ బతికెయ్యొచ్చు, సమాజపు కట్టుబాట్లు అందరికీ సమానంగా వుండాలికానీ మగోడికా స్వతంత్రవేటి, ఆడదానికీ అన్నాయిమేటి ? అప్పుడప్పుడు ఎదవాలోచ నొకటొచ్చేది. సినిమాల్లో ఆడోల్లకి అన్యాయిం జరిగినట్టు తనకు జరిగితే తను బలవంతంగా సచ్చిపోకూడదు. మగాళ్ళకి బుద్ధిచెప్పి గడ్డి తినిపించాలనుకొనేది? కానీ అప్పలకొండ తన కన్యాయం సేసేడు. లోకంలో శానామంది ఇలాగే బతుకు బుగ్గిసేసుకుంటున్నారు. లోకంలో ఎన్ని మానభంగాలు జరగట్లేదు. దేవుళ్ళు మనిషిగా పుట్టిన ఈ లోకంలోనే ఆడదాని శీలానికి రక్షణ లేదు. ఇక మిగతా లోకాల్లో ఎలా వుంటాదో !



'నా శీలం సెడిపోయింది. నా బతుకు నిప్పులకుంపటైపోయింది. కానీ అప్పలకొండ కులాసాగా తిరిగేస్తున్నాడు. ఆడికి శీలం లేదా ? ఒక్క ఆడదానికేనా శీలవతిగా, పవిత్రురాలిగా వుండాలనే కట్టుబాటు ! అప్పలకొండని ఎలాగైనా దెబ్బ కొట్టాలి. ఆడు తప్పుచేసాడని పదిమందికీ తెలియాలి. ఆడికి శిచ్చ ఏయించాలి. లోకంలో ఇక ఏ మగోడూ ఇలాంటి ఎధవ పని సెయ్యకుండా సెయ్యాలి. కానీ అది సాధ్యమా !?

సావిత్రి హృదయం మరణయాతన పడుతోంది.

అంతలోనే ఏదో ఆలోచన.

'అవును అట్టానే సెయ్యాలి. అప్పలకొండని శిచ్చించాలి. నేను శారీరకంగా శీలంలేని దాన్నయినా నాకన్నాయం చేసినోడ్ని శిచ్చించే శీలం వుంది నాకు.

అవును. నాకు 'శిక్షించే శీలం' వుంది. అవును నాకిప్పుడనిపిస్తోంది. ఆడదానికి మగోడ్ని శిచ్చించే శీలం వుండాలి.

ఒక్కక్షణం ఆలోచించింది సావిత్రి. సంబరానికి బయలుదేరి వెళ్ళింది. సంబరంలో అప్పలకొండ కనిపించేడు. వోరగా చూసి నవ్వింది. "ఇయ్యాల సంబరం కొండా! రాత్రికి మా యింటికొచ్చెయ్" అంది సావిత్రి. అలాగే అన్నాడు అప్పలకొండ మరోసారి సావిత్రి దక్కుతుందన్న ఆశతో.

అమ్మోరి గుడి దగ్గరికెళ్ళింది. అమ్మాజీని కలుసుకుంది. ఇద్దరూ కలసి పచ్చబొట్టు పొడిచే ఎరుకలమ్మి దగ్గరికెళ్ళేరు. అమ్మాజి కూతురికి పచ్చబొట్టు పొడిపించేరు.

"ఎరుకలమ్మీ ! ఇయ్యాల సంబరం కదా ! రాత్రికి మా యింటికి భోజనానికి రా" అని పిల్చింది సావిత్రి.

రాత్రి ఎరుకలమ్మి సావిత్రి ఇంటికొచ్చింది. కడుపునిండా తిండి పెట్టింది సావిత్రి.

అప్పుడు చెప్పింది సావిత్రి అప్పలకొండ తనకు చేసిన అన్యాయం గురించి.

"ఎరుకలమ్మా. ఆడిమీద నాకు కచ్చగా వుంది. మగోడి విరవీగేతనం అణగ్గొట్టాలనుంది. దానికి నేనొకటిసేత్తాను" అంది సావిత్రి తను చెయ్యబోయే పని గురించి చెబ్తూ.

సావిత్రికి జరిగిన అన్యాయం విని ఎరుకలమ్మ బాధ పడింది. సావిత్రి చేయబోయే పనిని మెచ్చుకుంది.

"ఆడు తాగుబోతు అనంటివిగా. ఈ రాత్రికి ఆడికి ఫుల్లుగా మందు కొట్టించి. మిగతా పని నేన్సూసుకుంటా" అంది ఎరుకలమ్మ.

అప్పలకొండ వచ్చేడు. నిషామీదున్నాడు. సావిత్రి కూడా మరికాస్త మందు పట్టించింది. ఆనందంతో అది కూడా తాగి మత్తుగా పడుకున్నాడు అప్పలకొండ. ఎరుకలమ్మ పని పూర్తి చేసింది. ఆ రాత్రి ఎరుకలమ్మ వెళ్ళిపోయింది

మర్నాడు.

సూర్యుడింకా తూర్పున రాలేదు. తన వెలుగు ఛాయల్ని అప్పుడే పంపిస్తున్నాడు భూమ్మీదకి.

సావిత్రి అప్పటికే లేచింది. దగ్గరలోనే వున్న పట్నం వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఇంకా లేవని అప్పలకొండ ముఖంలోకి చూసింది.

'కొండా ! నువ్వు మంచి మనిషివని నమ్మి బలైపోయాను. నీలాంటి వాడికి నాలాంటి ఆడదుండాల్సిందే. నాలాంటి ప్రతి ఆడది నేను నీకు ఇదించిన శిక్షలాంటిది ఇదించే శిచ్చించే శీలం వున్న మనసుతో బతికితే ఇక నీలాంటి వాళ్ళు పుట్టరు!' అనుకుంది మూగగా.

మరుక్షణం బస్‌స్టాండ్‌కి నడిచింది పట్నం పోయే బస్ ఎక్కేందుకు, మరోచోట మనశ్శాంతిగా బతికేందుకు.

సూర్యుడు పూర్తిగా ఊళ్ళోకొచ్చేడు. అప్పటికి అప్పలకొండకి మెలకువ వచ్చింది. సావిత్రి కనబడక పోయేసరికి లేచి రాములోరి గుడిదగ్గరి కొచ్చేడు.

దారినపోయే జనం అప్పలకొండవైపు వింతగా చూడసాగేరు. అప్పలకొండ ముఖంలో దయ్యాన్ని చూసినట్లు బెదిరిపోసాగేరు. అటుపక్క నడుస్తున్న కాస్త అక్షరజ్ఞానం వున్న ఆడవాళ్ళు అప్పలకొండ ముఖంలోకి చూసి భయంతో పరుగులుపెడుతున్నారు.

అప్పలకొండ చుట్టూ జనం మూగేరు. కాస్త మీసాల్తిరిగిన కుర్రాళ్ళు అప్పలకొండను నిలదీసేరు.

"ఏంట్రా నువ్వు సేసిన పని" చుట్టూ జనంలోంచి అన్నారెవరో.

"రాత్రెక్కడున్నావు, ఏం చేసావు" అంటూ ప్రశ్నించారు.

మొదట అర్థం కాలేదు అప్పలకొండకి. తరువాత అర్థమైంది. తన ముఖంలో కనబడుతున్న వింతని మాటల్లో వినేసరికి చెమటలు పట్టేయి అప్పలకొండకి. తను చేసిన పొరపాటు అర్థమైంది. అందరిముందూ అవమానంతో తలదించుకున్నాడు. నోట మాట రాలేదు. 'ఎలా దీన్ని సహించడం.'

సావిత్రి ఎంత శిక్ష విధించింది. ఈ శిక్షకు కారణం చెప్తే ఈ జనం తనను బ్రతకనివ్వరు. అసలు తనకిక బ్రతుకే లేదేమో ! అవును. అవమానంతో తను బ్రతకలేడు. ఇక్కడే కాదు. ఎక్కడికెళ్ళినా మనకిక అవమానమే. జీవితాంతం వరకూ తనకీ పరాభవం తప్పదు. దీనికన్నా చావడంనయం. ఈ జనం మధ్య తను ఇక బ్రతకలేడు. తను చచ్చిపోవడం ఒక్కటె సావిత్రి విధించిన శిక్షకు పరిష్కారం.

అవును తను చచ్చిపోవాలి !

అప్పలకొండ ఊరు చివర ఏటి గట్టుకి నడిచాడు. 'నన్ను క్షమించు సావిత్రీ !' అని సావిత్రికి దండం పెట్టుకున్నాడు. అమాంతం ఏట్లోకి దూకేడు.

ఆ సాయంత్రానికి అప్పలకొండ శవం తేలింది ఏట్లో. అప్పలకొండ శవం నుదుట పచ్చబొట్టుతో రాసిన అక్షరాలు అందరి దృష్టిలో పడుతున్నాయి.

"ఈడు నన్ను సెరిసాడు" ఈ అక్షరాలు, అప్పలకొండ శవం నుదుట చదువుకొని శవాన్ని చూడ్డానికి వచ్చిన వాళ్ళందరూ మౌనంగా వెళ్ళిపోతున్నారు. ★

సినిమా

[32 వ పేజీ తరువాయి]



'శివుడు శివుడు శివుడు'లో చిరంజీవి

"ముగ్గురమ్మాయిల మొగుడు"లో మగువ — మగాడు

చంద్రం (చంద్రమోహన్) మాంచి నిద్రలో చేతులు తిప్పుతూ కూనిరాగం తీస్తున్నాడు. సంగీత (అరుణ) వచ్చి అతని వీపుమీద ఒకటిచ్చి, "హల్లో, పార్ట్‌నర్! గెట్ అప్! అబ్బో... ఈయన నటుడే కాదు; సంగీత విద్వాంసుడు కూడా. పాపం, రాగాలు ప్రాక్టీస్ చేస్తున్నాడు నిద్రలో కూడా...పార్ట్‌నర్!" అంది.

చంద్రం ఇంకా మేల్కోలేదు. "ఉందు సుబ్బారావ్! మంచి కలొస్తోంది," అని గొణిగాడు.

"నేను సుబ్బారావుని కాదు; నీ పార్ట్‌నర్ సంగీతని."

కమ్మని కంఠం వినిపించడంతోటే చంద్రం చివాలునలేచి కూర్చున్నాడు. "ఓ...మీరా! ఏమిటి పొద్దున్నే ఇలా వచ్చారు?" అన్నాడు పళ్ళికిలిస్తూ.

"మీకు మార్నింగ్ వాక్ అలవాటుందా?"

"ఓ ... నైట్ వాక్ కూడా అలవాటుంది."

"నైట్ వాకా!"

"అదే ... నిద్రలో నడవడం కూడా అలవాటుంది."

"అయితే, రండి. వాకింగ్ వెళ్దాం."

"ఓ యస్ ... బాగా టిఫిన్‌చేసి వెళ్దాం."

"టిఫిన్ చేశా! ఎవరైనా టిఫిన్‌చేసి మార్నింగ్ వాక్‌కి వెళ్తారా?"

"అయితే, పదండి."

"ఇలా లుంగీతోనా? మీకు వాకింగ్ డ్రెస్ లేదా?"

"లేదు. రేపు సుబ్బారావుచేత కుట్టించుకుంటాను. ప్రస్తుతం లుంగీతోనే వస్తాను," అంటూ ఎంతో ఉత్సాహంతోబయలుదేరాడుచంద్రం.

ఎ. సారథి సమర్పించే నాగార్జున పిక్చర్స్ "ముగ్గురమ్మాయిల మొగుడు" చిత్రాన్ని రేలంగి నరసింహారావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో రాకేష్ నిర్మించారు.



'ఎందుకీ ఆడబ్రతుకు'లో రోహిణి, సాయిచంద్





'రెండుజళ్ళ సీత'లో

శ్రీలక్ష్మి, మహాలక్ష్మి

"ప్రేమగోల" మార్చి విడుదల


"హరిప్రసాద్ — గీత ఒక జంట. సుమన్‌బాబు — సువర్ణ ఒక జంట... తోటకూర ఆశాలత 'లవ్ బర్డ్స్' కథ ఆధారంగా తీశాం ... లేనివాళ్ళ ఈ సమాజం ఎప్పుడూ లోకువగానే చూస్తుంది. లేమిలో తనను చులకనగా చూసినవారిని కలిసివచ్చిన కలిమిలో ఆటలు పట్టిస్తాడొకడు. వినోదాత్మక చిత్రం. పి. ఎల్. నారాయణ, ప్రసాద్‌బాబు, రాళ్ళపల్లి, చిట్టిబాబు, మిఠాయి చిట్టి, ఎస్. వరలక్ష్మి,




"మీరు ఇచ్చిన విరాళం వందరూపాయలు— దానిగురించి ప్రచారం చేసినందుకు ఖర్చు వెయ్యిరూపాయలు అయింది."

నిర్మల, పి. ఆర్. వరలక్ష్మి, ఝాన్సీ, రాజేశ్వరి, కల్పనారాయ్, రాజారెడ్డి, స్వర్గీయ రాజ్‌బాబు పాల్గొన్నారు అంటూ—శ్రీ రత్న ఇంటర్నేషనల్ "ప్రేమగోల" చిత్ర నిర్మాత ఎస్. వెంకటరావు తెలిపారు. మార్చి మాసాంతంలో విడుదలయ్యే ఈ చిత్రానికి శ్రీ రమణ సంభాషణలు, పుహళేంది సంగీతం, ఆర్. కె. రాజు ఛాయ, ఆత్మా కూర్పు రణధీర్ నృత్యాలు నిర్వహించారు. సమర్పణ : ఎస్. వి. ఎస్. నాగేశ్వరావు, ఎమ్మెల్ దర్శకుడు.


మాశారు మీరు.



అందుకే మేము మీ కోసమే డిజైను చేశాం ఇదివరకు మీరెన్నడూ తొక్కనటువంటి అతిమెత్తగా, హాయిగా సాగిపోయే సైకిల్ క్రొత్త బిఎస్ఎ డీలక్స్



బిఎస్ఎ డీలక్స్ యొక్క సొగసైన వన్నటి బ్యారల్డ్ హబ్‌లు—ఇవి అత్యంత నాణ్యమైన, దృఢమైన కేస్ కప్స్ కలిగి సైకిల్ మెత్తగా, హాయిగా నడిచేలా చేస్తాయి.



ఎక్కువ సులభంగా తిరగడానికి వీలునిచ్చే చక్కటి గొట్టపు ఫోర్క్. దీనితో బిఎస్ఎ డీలక్స్ తొక్కడం నిజంగా సుఖకరం.




మీరు జీవితంలో ఎంతో పైకి వచ్చారు. ఎన్నో ఎగుళ్ల-దిగుళ్లను ఎదుర్కొని మరీ పైకి వచ్చారు. అందుకే మీకు కావాలి అత్యుత్తమమైనది.

అదే బిఎస్ఎ డీలక్స్. ప్రత్యేకంగా డిజైను చేయబడి అతి సులభంగా, హాయిగా తొక్కగలిగే సైకిల్. పనికి వెళ్ళడానికి ఇదివరకు మీరెన్నడూ తొక్కనిది. మరి ఇపుడు దినమంతా పడ్డ శ్రమ తర్వాత-ఇంటికి వచ్చాక. ఇదివరకు ఎన్నో ఇతర సైకిళ్లు తొక్కివుంటారు. కనుక వ్యత్యాసం స్పష్టంగా అనుభవించగలరు. పచ్చ మరియు నలుపు రంగులలో లభ్యం.

కొత్త బిఎస్ఎ డీలక్స్– సఫలత-మార్గంలో మీకు సుఖకరమైన తోడు.

TI BSA Deluxe

Rediffusion-TI-1912 b TL



సినిమా

ఎ. ఎన్. ఆర్. చిత్రాలు

★ శ్రీమతి అక్కినేని అన్నపూర్ణ సమర్పించే అన్నపూర్ణా స్టూడియోస్ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. రెండవ షెడ్యూల్ మార్చిలో, మూడవ షెడ్యూల్ జూలై 1 నుండి 15 వరకు జరుగుతాయి. శ్రీదేవి, చంద్రమోహన్, విజయశాంతి, రాజ్యలక్ష్మి, సత్యనారాయణ, రాంజీ, నాగేష్, ఎస్. వరలక్ష్మి, రమాప్రభ, పండరీబాయి పాల్గొంటున్నారు. డి. వి. నరసరాజు, చక్రవర్తి, ఆత్రేయ, నవకాంత్, కొడాలి ఆంజనేయ చౌదరి తెర వెనుక



కృషిచేస్తున్నారు. ఏ. కోదండరామిరెడ్డి స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో వెంకట్ అక్కినేని, నాగార్జున అక్కినేని నిర్మాతలు.

★ తాతినేని ప్రసాద్ దర్శకత్వం వహించే అనిల్ ప్రొడక్షన్స్ చిత్రంలో ఎ. ఎన్. ఆర్. తో పాటు నందమూరి బాలకృష్ణ మరో హీరో. ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ప్రతి నెలా 11 వ తేదీ — 20 వ తేదీ మధ్య జరిగే మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తవుతుంది.

★ జంధ్యాల దర్శకత్వంలో భీమవరపు బుచ్చిరెడ్డి నిర్మించే జ్యోతి ఆర్ట్స్ క్రియేషన్స్ ''అమరజీవి'' చిత్రంలో హౌస్ సర్జన్‌గా నటించే ఎ. ఎన్. ఆర్. సరసన నటించే సుమలత 57 వ హీరోయిన్ తొలి షెడ్యూల్ ఫిబ్రవరి 14 నుండి 21 వరకు హైదరాబాద్‌లో జరిగింది. రెండవ షెడ్యూల్ మార్చి 14 నుండి 21 వరకు మైసూరులో జరుగుతుంది. జయప్రద, శరత్‌బాబు, నరసింహరాజు, గుమ్మడి, నాగేష్, వేలు, పండరీబాయి పాత్రధారులు. భీశెట్టి కథకుడు. చక్రవర్తి, ఎస్. గోపాలరెడ్డి, భాస్కరరాజు, గౌతమ్‌రాజు, యు. వి. పాణి, పృథ్వీ, బి. అంజిరెడ్డి తెర వెనుక కృషి చేస్తున్నారు.

★ ఎ.ఎన్.ఆర్. ద్విపాత్రాభినయం నిర్వహించిన ''రాముడు కాదు కృష్ణుడు'' మార్చి విడుదల. దాసరి నారాయణరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం వహించిన ఈ లక్ష్మి ఫిలిమ్స్ కంబైన్స్ చిత్రంలో జయసుధ, రాధిక, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, గిరిబాబు, అల్లు రామలింగయ్య, జయంతి, రాజసులోచన, సూర్యకాంతం, జయమాలిని పాల్గొన్నారు. చక్రవర్తి, వి. ఎస్. ఆర్. స్వామి, భాస్కరరాజు, కృష్ణంరాజు, సూరపనేని రాధాకృష్ణ, సలీం ప్రభృత సాంకేతిక వర్గంతో నంగునూరు శ్రీనివాసరావు సమర్పించే ఈ చిత్రానికి ఎస్. ఆర్. అనూరాధాదేవి నిర్మాత.

'ప్రజాశక్తి'లో మాదాల, ప్రతిభ





'అమరజీవి'లో జయప్రద, అక్కినేని

డైరెక్టర్ కోడి రామకృష్ణ చిత్రాలు

''క్వాంటిటీకన్నా క్వాలిటీ ముఖ్యం,'' అనే కోడి రామకృష్ణ తొలి చిత్రం ''ఇంట్లో రామయ్య— వీధిలో కృష్ణయ్య'', ద్వితీయ చిత్రం ''తరంగిణి'' ఎంతటి ఘన విజయాన్ని సాధించాయో అందరికీ తెలుసు. ఆ చిత్రాల నిర్మాత ప్రతాప్ ఆర్ట్స్ కె. రాఘవ జూన్, జూలై, ఆగస్ట్ మాసాలలోగా నిర్మించే ఒక తెలుగు చిత్రానికి, ఒక హిందీ చిత్రానికి తాను దర్శకత్వం వహిస్తున్నట్లు ఇటీవల ఈ యువ దర్శకుడు చెప్పారు.

★ విశ్వచిత్రవారి ''రంగుల పులి'', లలితా మూవీస్ ''ఆలయ శిఖరం'' చిత్రాల షూటింగ్‌లు పూర్తయ్యాయి.

★ ''కళ్ళు తెరవండి'' చిత్రాన్ని విజయశాయి ఫిలిమ్స్ పతాకంలో వి. మహేష్, గోపీనాథ్ నిర్మిస్తారు. చిరంజీవి, మాధవి, సత్యనారాయణ, గొల్లపూడి మారుతీరావు ప్రభృత నటవర్గం. గొల్లపూడి సంభాషణలు, జె. వి. రాఘవులు సంగీతం, ప్రసాద్‌బాబు ఛాయ, దిలీప్‌సింగ్ శిల్పం, బాలు కూర్పు, వి. మోహనరావు నిర్వహణతో కె. ఎస్. నారాయణచెట్టి సమర్పిస్తారు. ఏప్రిల్ 25 నుండి 30, మే 10 నుండి జూన్ 5 వరకు షూటింగ్ జరిగి, ఆగస్ట్ 15న విడుదలవుతుంది.

★ జూన్ 10 నుండి జూలై 5 వరకు మన రాష్ట్రంలో ఒకే షెడ్యూల్లో చిత్రీకరణ ముగిసే లలిత కళాంజలి వారి ''మా ఇంటికి రండి'' చిత్రాన్ని దిడ్డి శ్రీహరిరావు నిర్మాణతలో పాకాడ అప్పారావు, జైచంద్ర నిర్మిస్తారు. సుమన్, భానుచందర్, గొల్లపూడి మారుతీరావు, చక్రవర్తితోపాటు ఇద్దరు నవనాయికలు ఉంటారు. గొల్లపూడి సంభాషణల కర్త. చక్రవర్తి సంగీత దర్శకుడు పి. లక్ష్మణ్ ఛాయాగ్రాహకుడు. బాలు సంకలనకర్త.

★ ఎస్. గోపాలరెడ్డి నిర్మించే భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ''ముక్కుపుడక'' చిత్రానికి ఫిబ్రవరి 25న తొలి గీతం ధ్వని ముద్రితమైంది. మార్చి 9 నుంచి 19, మార్చి 27 నుంచి 31, ఏప్రిల్ 1 నుంచి 15 షెడ్యూల్స్‌తో షూటింగ్ ముగిసే ఈ చిత్రంలో సుహాసిని, సుమన్, గొల్లపూడి మారుతీరావు, విజయశాంతి, భానుచందర్, పి. ఎల్. నారాయణ, అన్నపూర్ణ ఆదిగా గలవారుంటారు. గణేశ్‌పాత్రో సంభాషణలకర్త. జె. వి. రాఘవులు సంగీత దర్శకుడు. పి. లక్ష్మణ్ ఛాయాగ్రాహకుడు. కె. సత్యం సంకలనకర్త,


★ విజయలక్ష్మీమూవీస్ అధినేత టి. త్రివిక్రమరావు నిర్మించే చిత్రం మార్చి — మే నెలల్లో పూర్తవుతుంది. ఇందులో చిరంజీవి హీరో. ★

'బందిపోటు రుద్రమ్మ'లో జ్యోతిలక్ష్మి



అనుకరణ

"శైలజ"



కరతాళ ధ్వనులతో మార్మోగిందా హాలు.

సుధాకర్‌ని పూలదండలతో ముంచేశారు అభిమానులంతా.

తను చేసిన మిమిక్రీని గురించి ప్రతివాళ్ళూ ‘అమ్మ’ అలాగే, అసలేమీ తేడాలేకుండా ‘సేమ్’ అలాగే చేశాడని శ్లాఘించారు ప్రేక్షకులంతా.

జంతువుల అరుపులూ, వాహనాల మోతలూ, నటీనటుల నటనా పద్ధతులూ, నాయకుల ప్రసంగాలూ అన్నింటినీ తన గొంతుకద్వారా వెలువడింపజేసి ప్రేక్షకులను రెండు గంటల వరకూ ఉర్రూతలూగించిన మిమిక్రీ ఆర్టిస్ట్ సుధాకర్‌ని ఆ సభలో మెచ్చుకోనివాళ్ళు లేరు.

కార్యక్రమం అవగానే ఇంటికి చేరాడు సుధాకర్.

పాప ఇంకా నిద్రపోలేదు.

తను జోలపాట పాడితేగాని పాప నిద్రపోదు

"పడుకోమ్మా – నేను పాట పాడతాను" బుజ్జగించాడు.

"అమ్మలాగే పాడాలి" పాప శాసించింది.

"అలాగే" అన్నాడు.

తన అనుకరణ సామర్థ్యాన్నుపయోగించి భార్య శైలజ గొంతుతో జోలపాట మొదలెట్టారు.

పాప ఇంకా నిద్రపోవడంలేదు.

"ఏమ్మా! పాట బాగోలేదా!" పరామర్శించాడు.

"నువ్వు అమ్మలాగా ఏం పాట్టంలేదు" పాప.

అనుకరణ సామ్రాట్ సుధాకర్ ముఖంలో మిగిలింది ప్రశ్నార్థకం మాత్రమే... !



ఆరోగ్యం, మజా, జోరూ తోడు జోడుగా!
తాగండిక బోర్న్‌విటా.

మీ కుటుంబంలోని వారికి క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా యివ్వండి. దానిలోని రుచి అంటే వాళ్ళందరికీ మహాయిష్టం. బోర్న్‌విటాలో ప్రకృతిలోని మంచి లక్షణాలు గల కోకో, మాల్ట్, పాలు, పంచదార సమృద్ధిగా ఉన్నాయి. బోర్న్‌విటా మీ కుటుంబంలోని వారందరికీ ప్రతిరోజూ యివ్వండి-రోజుకు రెండుసార్లు.



క్యాడ్‌బరిస్
బోర్న్‌విటా దీన్లోని మంచిదనం పెరుగుతుంది మీపైనిక


OBM/8844/TL

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



(గత సంచిక తరువాయి)

జోనాథన్ హార్కర్ డైరీ

సెప్టెంబర్ 26 : ఈ డైరీని మళ్ళీ ఎప్పుడూ రాయకూడదనుకున్నాను. కానీ రాయాల్సి వచ్చింది. గతరాత్రి నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి భోజనం సిద్ధంగా వుంది. మినా నేను భోంచేసాం. అప్పుడు ఆమె వాన్ హెల్సింగ్ రావడం, రెండు డైరీల్లోని కాపీచేసిన కాగితాలు ఆయన కివ్వడం, మినా నా గురించి ఎంతో ఆందోళన వెలిబుచ్చడం, అన్నీ చెప్పింది. నేను డైరీలో రాసిందంతా నిజమైన విషయంగా డాక్టర్ ఒప్పుకున్నట్టు రాసిన ఉత్తరం మినా నాకు చూపించింది. ఇదంతా నాలో కొత్త జీవాన్ని నింపుతోంది. అప్పుడు జరిగిందంతా నిజమేనా అన్న సందేహం కలుగుతూ వుండేది. నేను వొట్టి చేతగాని వాడ్నిగా, నమ్మదగని మనిషిగా వూహించుకుంటూ వుండేవాడ్ని. కానీ ఇప్పుడు నాకు ధైర్యం వచ్చేసింది. డ్రాకులా కనిపించినా నాకు భయంలేదు. మొత్తానికి డ్రాకులా లండన్ రాగలిగాడు. నేను అతన్ని చూడగలిగాను. కానీ చాలా యువకుడిలా మారిపొయ్యాడే, ఎలా? మినా చెప్పినట్టు, అతని వెంటబడి అతని గుట్టు రట్టు చేయగల సమర్థుడు వాన్ హెల్సింగ్ ఒక్కడే. ఇద్దరం చాలాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం. మీనా బట్టలు వేసుకుంటోంది. కాసేపట్లో హోటల్‌కి వెళ్ళి ఆయన్ని ఇక్కడికి తీసుకుని రావాలి...

నన్ను చూడగానే ఆయన ఆశ్చర్యపోయినట్టున్నాడు. ఆయన వున్న గదిలోకి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకోగానే, ఆయన నా భుజంమీద చెయ్యివేసి, నా మొహాన్ని లైటు వైపుకు తిప్పి పరీక్షగాచూసి, అన్నాడు "అరే, మేడమ్ మినా మీరు చాలా జబ్బు పడ్డట్టు, మానసికంగా బాగా దెబ్బ తిన్నట్టు చెప్పిందే !" నా భార్యను 'మేడమ్ మినా' అని ఆయన సంబోధించడం నాకు నవ్వు పుట్టించింది. నవ్వి అన్నాను, "అవును, జబ్బు పడ్డాను. మానసికంగా దెబ్బతిన్నాను. కాని అవన్నీ మీరు ఎగరగొట్టేశారు."

"ఎలా?" అన్నాడాయన.

"అదే, మీరు గత రాత్రి మినాకు రాసిన ఉత్తరం వల్ల. నేను చూసి అనుభవించిన విషయాలన్నీ, నాకు నేనే నమ్మలేక సందేహావస్థలో పడి వున్నాను ఇంతకాలం. నేను చూసిందే నమ్మలేక, ఏం చెయ్యాలో తెలిసింది కాదు. ఆ విషయాలను మర్చిపోవటం కోసం చాలా పనుల్లో మునిగిపోయి జీవితాన్ని వెళ్ళబుచ్చుతూ వచ్చాను. ఇప్పుడు నాకు జ్ఞానోదయమైంది. నన్ను నేను నమ్మలేకపోయిన విషయం తెలుసుకున్నాను. డాక్టర్, మీలాంటివారికి, ముఖ్యంగా ఇలాంటి కనుబొమలున్నవారికి అపనమ్మకం అనేది వుండదు" అన్నాను.

నా మాటలకు ఆయన సంతోషించినట్టుగా నవ్వి "అయితే మీరు మనుషుల్ని చదివి గుణగణాలు చెప్పగలరన్నమాట. ఇక్కడికి వచ్చింతర్వాత ప్రతి ఘడియా విజ్ఞానదాయకంగానే వుంది. మీ ఇంటికి భోజనానికి రావటానికి నాకెంతో సంతోషంగా వుంది." అన్నాడు. ఆయన మినా గురించి పొగుడుతూనే వున్నాడు రోజంతా. నేను తలూపుతూ మౌనంగా వున్నాను.

"ఆమె ఒక దేవదూత లాంటిది. దేవుడు ఆమెను స్వయంగా తన చేతుల్తో తీర్చిదిద్దాడు ఆమె అందరికీ వెలుగుమార్గాన్ని చూపించగలదు ఆమె ఎంతో మంచిది, ఔదార్యం గలది. కొద్దిగా అహంవుంది. సందేహాలున్న మనస్తత్వం, స్వార్థం గలది. ఆ వయసులో అవి సహజం.ఇకపోతే మీరు– ఆమె లూసీకి రాసిన ఉత్తరాలు చదివాను. అందులో మీగురించి ప్రస్తావన వుంది కొద్ది రోజులుగా మీగురించి తెలుసు, మిమ్మల్ని మొదటిసారిగా చూసింది గతరాత్రే అయినా. ఏదీ మీ చెయ్యి ఇలా ఇవ్వండి...ఇవ్వాలి మరి. ఇకనుండి మన జీవితాంతం వరకు మనందరం స్నేహితులం" అన్నాడు ఆయన.

కరచాలన చేసాను. ఆయన ఆప్యాయతకు కరిగి పోయాను.

"ఇప్పుడు మిమ్మల్ని ఓ సాయం అడగాలి, నేనో పెద్దపని తలపెట్టాను. అది మొదలుపెట్టేముందు కొంత తెలుసుకోవాలి. అందుకు మీరు తోడ్పడాలి. మీరు మొట్టమొదట అసలు ట్రాన్సిల్వేనియాకు ఎందుకు వెళ్లాల్సివచ్చింది ? ముందు ఇది చెప్పండి, తర్వాత మరికొన్ని అడిగితే చెబుదురుగాని" అన్నాడు

"చూడండి, మీరు తలపెట్టినపని డ్రాకులా విషయానికి సంబంధించినదేనా ?" అడిగాను.

"అవును" అన్నాడు గంభీరంగా.

"అయితే మనస్ఫూర్తిగా అన్ని విషయాలూ చెప్తాను. మీరు 10–30 రైలుకి వెళ్ళేట్లయితే, మీకు చదవటానికి టైము సరిపోదు. అందుకని నేను రాసిన కాగితాల కట్టలన్నీ ఇస్తాను. మీతో బాటే తీసుకెళ్ళి, రైల్లో చదువుకోండి" అన్నాను.

భోజనాలు అయినాయి. ఆయన స్టేషన్‌కు బయలుదేరాడు. వెళ్ళేముందు ఆయన అన్నాడు "మీరు ఒకసారి టౌన్‌కి రావలసి వుంటుంది కబురు పెడతాను రండి. మేడమ్ మినాను కూడా తీసుకురావాలి"

"మీరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఇద్దరం వస్తాం" అన్నాను.

లండన్ వార్తాపత్రికలు ఆరోజువి, క్రితం రాత్రివి అన్నీ కలిపి ఇచ్చాను ఆయనకి. ఆయన రైల్లో కిటికి దగ్గరగా కూర్చుని నాతో మాట్లాడుతూ పేపర్లు తిరగేస్తున్నాడు. రైలు ఇంకా కదలలేదు. హఠాత్తుగా ఆయన చూపు "ది వెస్ట్ మినిస్టర్ గెజిట్" మీద పడింది. ఆయన మొహం పాలిపోయింది. ఆయనలో ఆయనే గొణుక్కుంటున్నాడు. "దొరికాడు... దొరికాడు అబ్బ ఎంత త్వరగా దొరికాడు !" అంటూ. నేను

జరిగిన కథ – 20 : లూసీ ఆరోగ్యం గురించి జాన్‌సెవార్డు ఆర్థర్ హామ్‌వుడ్‌కి తెలియజేస్తుంటాడు. లూసీ పరిస్థితి దయనీయంగా వుంది. ఆమె వంట్లో రక్తం చాలా తక్కువగా వుంది. అందువల్ల ఆమెకు రక్తం ఎక్కించటానికి ప్రయత్నాలు చేస్తుంటాడు ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్. డాక్టర్ సెవార్డు లూసీకి తన వంట్లోని రక్తం ఇస్తాడు. ఆమె పరిస్థితి ఇప్పుడు కొంచెం మెరుగ్గా వుంటుంది. పారిపోయిన తోడేలు కథనం గురించి జులాజికల్ గార్డెన్స్ రక్షకుడిని "ది పాల్‌మాల్ గెజిట్" పత్రికా విలేఖరి ఇంటర్వ్యూ చేస్తుంటాడు. పారిపోయిన తోడేలు దానంతటదే వచ్చేస్తుంది. లూసీ పరిస్థితి ఎప్పటిలానే వుంటుంది. ఆఖరి క్షణాల్లో వున్న తన ప్రేయసి లూసీని ముద్దు పెట్టుకోబోతున్న ఆర్థర్‌ను మెడ పట్టుకొని లాగిపారేస్తాడు వాన్ హెల్సింగ్. లూసీ చనిపోతుంది. కానీ ఆమె ముఖం చాలా అందంగా మారిపోయి చనిపోయినట్లుకాక నిద్రిస్తున్నట్లుగానే వుంటుంది. మిగతా వ్యవహారాలనీ వాన్ హెల్సింగ్, డాక్టర్ సేవార్డ్ చూస్తుంటారు. ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్‌కు 'మీరు ఎప్పుడు వచ్చినా చూస్తాను' అని టెలిగ్రాం ఇస్తుంది మీనా హార్కర్. జోనాథన్ వ్రాసిన డైరీ చదివి తన అభిప్రాయాన్ని వివరించిన వాన్‌హెల్సింగ్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటుంది మీనా.


అక్కడ వున్న సంగతే ఆయన మరచినట్టు కనిపించాడు. అప్పుడే విజిల్ వినపడింది. రైలు కదిలింది. వెంటనే ఆయనకు తెలివివచ్చిందిలా వుంది, కిటికీలోంచి బయటకు వంగి, గాల్లో చెయ్యి వూపుతూ ''మేడమ్ మీనాను అడిగానని చెప్పండి. తొందర్లో ఉత్తరం వ్రాస్తాను'' అన్నాడు.

డాక్టరు సెవార్డు డైరీ

సెప్టెంబర్, 26 : ఏ విషయం కూడా 'ఇదిగో ఇయిపోయింది' అనుకోడానికి వీలులేదు. ఈ డైరీకి ముగింపు చెప్పి వారం రోజులు కూడా కాలేదు. మళ్లా కొత్తగా డైరీ ప్రారంభిస్తున్నాను. కొత్త ఏముంది. పాతదానినే మళ్ళీ మొదలెడుతున్నాను. ఈ రోజు మధ్యాహ్నం వరకు, చేసిన వాటిగురించి ఆలోచించకుండా పనిచేస్తూ వచ్చాను. రెన్‌ఫీల్డ్‌కి పిచ్చి తగ్గి, అన్నివిధాల మంచి మనిషి అయ్యాడు. అతని ఈగల వేట బాగానేవుంది. సాలెపురుగులు పట్టుకోడం కూడా ప్రారంభించాడు. అతని పనేదో అతను చూసుకుంటూ, నాకు ఇబ్బందిలేకుండా వున్నాడు. ఆర్థర్ దగ్గర్నించి అతను ఆదివారం రాసిన ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని బట్టి, అతను విచారంలోంచి బాగా కోలుకున్నట్టు తెలుసుకున్నాను. క్విన్సీమోరిస్ అతనితోనే వున్నాడట. అతనుంటే ఆర్థర్ నవ్వుతూ గడపటానికి తోడ్పడతాడు. క్విన్సీమోరిస్ కూడా ఒక లైను రాసాడు. ఆర్థర్ తనకు తగిలిన గాయాన్నించి కోలుకోడం ప్రారంభించాడని రాసాడు. కాబట్టి, వాళ్లగురించి నాకు చింతలేదు. ఇకపోతే నా గురించి నేను కూడా కాస్త స్థిరంగా వుండి, పూర్వంలా ఉత్సాహంతో పనులు చేయగిలుగుతున్నాను. లూసీ వదిలివెళ్లిన గాయం మానిపోయి, గుర్తు మిగిలిపోయింది. కానీ ఇప్పుడు అన్నీ మొదలయ్యాయని అనుకోవాలి. వీటి అంతం దేవుడికే తెలియాలి ఈ విషయాలు వాన్‌హెల్సింగ్‌కు బాగా తెలుసు కానీ అందరూ ఆందోళన చెందేటప్పుడు తప్ప బయటపడడు. అతను నిన్న ఎగ్జిటర్ వెళ్లి రాత్రి అంతా అక్కడే వున్నాడు. అయిదున్నర ప్రాంతంలో ఈ రోజా అతను తిరిగివచ్చాడు. దాదాపు గెంతినట్టుగా నా గదిలోకి వచ్చి 'వెస్ట్ మినిస్టర్ గెజిట్'ను నా చేతుల్లో కుక్కాడు.

''దీన్ని గురించి నువ్వేం అనుకుంటున్నావు ?'' చేతులు మడిచి వెనక్కితిరిగి నిలబడి అన్నాడు.

అతను అంటున్నది అర్థంకాక, ఆ పేపరు వంక చూసాను. అతను నా చేతుల్లోని పేపరు లాక్కొని, అందులో హంప్‌స్టెడ్‌లో పిల్లల్ని ఎత్తుకుపోవడంగురించి వున్న ఒక పేరాని చూపించాడు. పేరా చివరకు చదివేదాకా, అదేవిటో నాకర్థం కాలేదు. చివర్లో గొంతుదగ్గర చర్మం చిరిగినట్టు గాయాలవడంగురించి రాసి వుంది. నాకు అర్థవయ్యి అతని మొహంలోకి చూసాను. ''తెల్సిందా ?'' అడిగాడు.



"అవును. ఈ గాయాలు పాపం లూసికి వుండినలాటివే !" అన్నాను.

"అయితే, మరి నీకేమనిపిస్తోంది ?"

"వీటన్నిటికీ ఒకటే కారణం ఏదో వుంది. ఏదైతేనేం మొత్తానికి లూసీని ఏదైతే గాయపరచిందో, అదే పిల్లల్ని కూడా గాయపరచి వుండాలి" అన్నాను.

"పరోక్షంగా నిజమంతే, కానీ ప్రత్యక్షంగా కాదు" అన్నాడు. అతనిజవాబు నాకు అర్థంకాలేదు.

"దాని అర్థం ఏవిటి ప్రొఫెసర్?" అడిగాను. విషయాల్ని నేను తేలిగ్గా తీసుకోవాలనుకున్నాను. ఎంతో ఆందోళనలనుంచి, విచారాన్నించి విముక్తి పొంది, గత నాలుగు రోజులుగా పూర్తి విశ్రాంతిలో గడిపాను. అందువల్ల నాకు తేలిక మనసు ఏర్పడ్డది. కానీ అతని మొహం చూసాక, మళ్ళీ నాలో విచారం మొదలయింది. అతను చాలా గంభీరంగా వున్నాడు. లూసీ అంత అవస్థలో వున్నప్పుడుకూడా, ఇతను ఇంత గంభీరంగా లేడు.

"నేనేమి తేల్చుకోలేకపోతున్నాను. ఈ విషయం ఎట్లా ఆలోచించాలోకూడా తెలీడంలేదు. ఒక నిర్ణయానికి రావటానికి నాదగ్గర సరైన వివరాలుకూడా లేవుకదా. అందుకని మీరుచెప్పండి" అన్నాను.

"మిత్రమా, జాన్ ! లూసీ ఎట్లాంటి పరిస్థితిల్లో చనిపోయిందో నీకేమీ తెలీదనే అనుకోమంటావా, జరిగిన సంఘటనలు తెలిసికూడా, కొన్ని విషయాలు నేను సూచించినా కూడా ?" అన్నాడు.

"రక్తస్రావం జరిగి విపరీతమైన నరాల వత్తిడివల్ల ఆమె చనిపోయింది" అన్నాను.


జీవన్ మృతులు

"మరయితే రక్తస్రావం ఎలా జరిగిందంటావు?" అడిగాడు. నేను అడ్డంగా తలూపాను. అతను ముందుకొచ్చి నా ప్రక్కన కూర్చుని అన్నాడు,

"మిత్రమా జాన్, నువు చాలా తెలివిగలవాడవయ్యా! నీకు కారణాలు తెలిసికూడా తెలీనట్టు వుంటావు. ఎందుకంటే నీకు సందేహాలున్నాయి. నీ కళ్ళతో చూడకు, చెవులతో వినకు. రోజూ నీ చుట్టూ జరిగేవాటిగురించి పట్టించుకోకు. ఇంకా కొన్ని అర్థంకాని సంగతులున్నాయని నీకు తెలీదా ? కొందరు కొన్ని సంగతులు చూడగలరనీ, వాటినే మరికొందరు చూడలేరనీ తెలుసా? కానీ కొన్ని కొత్త సంగతులు, పాతసంగతులు వున్నాయి. వాటిని మగాళ్ళు పట్టించుకోరు, ఇతర్లు వాటి గురించి ఎప్పుడూ తెలిసినట్టు చెప్పుతూ వుండటం వల్ల దీనికంతకీ కారణం సైన్సు. ఈ విషయాల్ని సైన్సు వివరణ కోరుతుంది. వివరించలేకపోతే, ఇక ఆ సంగతి లేనట్టే. కానీ మన చుట్టూ కొత్త నమ్మకాలు పుట్టడం చూస్తూనే వున్నాం. నిజానికవి కొత్తవి కావు, పాతవే. పేరంటానికొచ్చిన స్త్రీలలా అలంకరించుకుని నవనవలాడుతూ కనిపిస్తాయి. నువ్వు పరకాయప్రవేశం గురించి నమ్ముతావా? నమ్మవు. వస్తువుల్ని సృష్టించడాన్ని నమ్ముతావా, నమ్మవు! శూన్యంలో శక్తులు తిరగటం నమ్ముతావా,నమ్మవు. మనిషి ఆలోచనల్ని చదవటం నమ్ముతావా, నమ్మవు. పోనీ హిప్నాటిజం......"

"నమ్ముతాను. చార్కాట్ దీన్ని బాగా నిరూపించాడు" అన్నాను.

అతను నవ్వి, "ఆ విషయంలో నీకు అనుమానం లేదుకదా ? అయితే అది ఎట్లా పని చేస్తుందో నీకు అర్థమవుతుంది. మేధివి చార్కాట్ పద్ధతి నువ్వు అనుసరించి చూడు. పాపం ఇప్పుడతను లేడనుకో. అతను పేషంట్ ఆత్మమీద తన ప్రభావం ఎలా చూపిస్తాడో అలా, ఏవిటి? ఇక ఇది నువ్వు ఒప్పుకున్నట్టే కదా ! అయితే ఒకటి చెప్పు. హిప్నాటిజాన్ని ఒప్పుకుంటూ, మనిషి ఆలోచనల్ని చదవటాన్ని ఒప్పుకోకపోవట మేమిటి? నేను చెప్తాను మిత్రమా ! ఎలక్ట్రికల్ సైన్సుతో చేసే పనులు కొన్ని వున్నాయి. ఆ పనులు ఎంతో 'పాపం' అని ఎలక్ట్రిసిటీ కనిపెట్టిన వాళ్ళు అనగలరు. ఆ పనులు చేసేవాళ్ళని మంత్రగాళ్ళ క్రింద జమకట్టి తగలెట్టెయ్యగలరు జనం. జీవితంలో అంతుపట్టని సంగతులు అనేకం వున్నాయి. 'మెతుసెలా' తొమ్మిది వందల సంవత్సరాలు బ్రతికాడు, ఎలా? 'ఓర్డ్ పార్' నూట అరవై తొమ్మిది సంవత్సరాలు బ్రతికాడు. కానీ పాపం లూసీ, నలుగురి మనుషుల రక్తం ఎక్కించినా ఒక్కరోజు కూడా బ్రతకలేకపోయింది? ఎందుకంటే, ఒక్కరోజు కనక బ్రతికుంటే, ఆమెను రక్షించుకొని వుండేవాళ్ళం. జీవన్మరణాల రహస్యం నీకు తెలుసా ? మనుషుల శరీర తత్వాలను బట్టి ఎవరు వెధవో, ఎవరు మంచివాడో చెప్పగలవా ? కొన్ని సాలెపురుగులు ఎక్కువగా పెరగకుండానే చచ్చిపోతాయి. మరి ఒక సాలెపురుగు స్పానిష్ చర్చి గోపురం మీద శతాబ్దాల తరబడి పెరిగింది.



ఎట్లాగో చెప్పగలవా? 'పింపన్' ఇంకా చాలాచోట్ల రాత్రిపూట కొన్ని గబ్బిలాయిలు పగలంతా చెట్లకు వేళ్లాడి రాత్రిళ్లు డెక్‌మీద పడుకునే నావికులమీద పడతాయి. తెల్లారేసరికి పాలిపోయి చచ్చిపడి వుంటారు, లూసీలాగ, ఎందుకో చెప్పగలవా ?'' అన్నాడు.

''తెల్సింది, తెల్సింది ప్రొఫెసర్! అంటే, లూసీని కూడా అటువంటి గబ్బిలాయి ఒకటి కరిచి వుంటుందంటారు. మరి అటువంటి గబ్బిలాయి ఈ శతాబ్దంలో లండన్‌లో వుండటమా ?'' అన్నాను.

అప్పుడు అతను నిశ్శబ్దంగా వుండమని నాకు సైగ చేస్తూ మళ్ళీ చెప్పడం సాగించాడు.

''తాబేలు మనుషుల తరాలకన్నా ఎక్కువ బ్రతుకుంది; ఏనుగు ఎన్నో వంశాలు అంతరించేదాకా వుంటుంది; చిలకను ఏ పిల్లో, ఏ కుక్కో కరిస్తేనో, లేకపోతే ఏదైనా రోగముంటేనో తప్ప అది చావదు; ఎందుకో చెప్పగలవా ? ఇప్పటికీ కొందరికి నమ్మక ముంది, కొంతమంది వ్యక్తులు అన్ని యుగాల్లోనూ అన్ని స్థలాల్లోనూ వుంటారని, వారికి చావులేదని, ఎందుకో చెప్పగలవా ? మనందరికీ తెలుసు — సైన్సు కూడా ఒప్పుకుంది — కొన్ని వేల సంవత్సరాలు రాళ్ల పొట్టల్లో కప్పలు బ్రతికివున్నాయని; చిన్న కన్నంలో అది ప్రపంచం పుట్టిం దగ్గర్నించి వుంటూ వచ్చిందని. ఒక ఇండియా ఫకీరు తనంతట తానే ప్రాణం వదలగా, అతన్ని పాతిపెట్టి, అతని సమాధి పైన మట్టి కప్పి విత్తనాలు జల్లి పంట పండిం చారు. ఆ పంటను కోసి మళ్ళీ విత్తనాలు జల్లి పంట పండించారు. తర్వాత కొంతమంది సమాధిని తవ్విచూస్తే, ఆ ఇండియా ఫకీరు చావకుండా బ్రతికేవున్నాడు. చక్కగా లేచి నడుచుకుంటూ వెళ్లిపోయాడు మామూలుగా. ఎట్లా అయిం దంటావు ?''

మధ్యలో నేను అడ్డుకున్నాను ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ. సృష్టిలోని ఈ విపరీతాలతో, అసాధారణ విషయాలతో వరసగా ఏకరువు పెట్టి నా బుర్రని వేడెక్కించేస్తున్నాడు. పూర్వం అతను ఆంస్టర్‌డాంలో నాకు ఇట్లాగే పాఠాల్ని చెబుతూ వుండేవాడు. ఆ రోజుల్లో అతను చెపుతుంటే, బుర్రలోకి ఎక్కేది. ఈసారి ఏమిటో బుర్రకెక్కడం కష్టంగా వుంది. అయినా అతన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాను.

''ప్రొఫెసర్, మళ్ళీ నేను మీ విద్యార్థిగా మారిపోతున్నాను. మీ సిద్ధాంతం చెప్పండి, అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూపోతాను — ఇప్పుడు నేను ఒక్కో విషయాన్ని వరసగా పిచ్చివాడిలా బుర్రలో పెట్టుకుంటూ వస్తున్నాను, తెలివిగలవాడిగా కాదు — కాస్త తెలుస్తోంది. నాకు నేను అమాయకుడిగా వూహించుకుంటూ, ఆలోచిస్తున్నాను.''

''అట్లా చెయ్యడం మంచిది. ఇప్పుడు చెపుతాను నా సిద్ధాంతం ఏమిటో, మరి నువ్వు నమ్మకముంచాలి'' అన్నాడు.

''దేనిమీద ?'' అడిగాను.

''నీకు దేనిమీదనయితే నమ్మకం లేదో, దాని మీద. నేను వివరించి చెపుతాను. ఒక అమెరికన్ విశ్వాసం అంటే ఏమిటో ఇట్లా చెప్పాడు. ''ఏదైతే అబద్ధమని అనుకుంటామో, దానిమీద నమ్మకాన్ని కలిగించే శక్తినే విశ్వాసం'' అన్నాడు. నేను అతన్ని నమ్ముతాను. అతని అర్థం ఏమిటంటే, మనం మన బుర్రలో ఏవీ పెట్టుకోకుండా, మొదట్నించీ ఆలోచించాలి. మొదట మనకి ఓ చిన్న నిజం తెలుస్తుంది. మంచిది. దాన్ని అలా వుంచి, అది ఎంత వరకు నిజమో చూడాలి'' అన్నాడు.

''అంటే, నిజమనుకున్న పాత విషయాలు గుర్తుచేసుకుని, ఇప్పుడు కొత్తగా చేసే ఆలోచనా సరళికి అడ్డం రానివ్వకూడదంటారు, అంతేనా ?''

''అవునంతే బాగా అర్థం చేసుకుంటున్నావు అయితే ఇప్పుడు ఆలోచించు. పిల్లల గొంతుదగ్గర కొరికిన రంధ్రాలు గాయాలుగా ఏర్పడ్డాయికదా. ఏదైతే ఆ గాయాలను చేసిందో, లూసీనికూడా అదే చేసిందంటావా ?''

''అవును, అంతేననుకుంటాను'' అన్నాను.

అతను లేచి నిలబడ్డాడు. ''అయితే నువ్వు పప్పులో కాలేసావు. అట్లా జరిగి వుంటుందా ? అయ్యో, అట్లాకాదు. అంతకంటే దరిద్రం, చాలా దరిద్రంగా జరిగింది'' అన్నాడు గంభీరంగా.

''చెప్పండి స్వామి, మీ మాటలకు అర్థం !'' అన్నాను అసహనంగా.

వాన్ హెల్సింగ్ ఎంతో నిరాశగా వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. మోచేతుల్ని టేబుల్ మీద ఆనించాడు, మొహాన్ని చేతుల్లో కప్పుకుని. మెల్లగా అన్నాడు ''పిల్లల గాయాలకు కారణం మరెవరో కాదు, లూసియే !''


ఒక్కక్షణం నేను కోపంతో వూగిపోయాను



సన్మానితులు - కార్టూనిస్ట్, పబ్లిసిటీ ఆర్టిస్ట్
రచయిత శ్రీ గీతా సుబ్బారావు
సబ్‌కలెక్టర్ శ్రీ ఐ.వై. రామకృష్ణారావు
ఫొటోగ్రాఫర్స్ శ్రీ రామచంద్రరావు విజయవాడ
శ్రీ సాయిబాబా మద్రాసు
పోటీకి వచ్చిన కార్టూన్లు 300 - కార్టూనిస్టులు 90 మంది -
ముఖ్య నిర్వాహకులు శ్రీ రాజన్ - శ్రీ శేఖర్ మరియు




సురేష్..




-ఎబ్బార్-



రంగ-





కన్సొలేషన్ బహుమతులు పొందినవి



'బేబీ ఇండియా' జాతీయ అవార్డు పొందిన చిరంజీవి లావణ్యని ఫిబ్రవరి 27న తిరుపతిలో సత్కరిస్తున్న రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ శ్రీ వినాయక్‌ని చిత్రంలో చూడవచ్చు.

జీవన్ మృతులు

లూసీ బ్రతికివున్నప్పుడు అతను ఆమె మొహంమీద కొట్టినట్టుగా కోపమొచ్చింది. టేబుల్ మీద బలంగా గుద్ది లేచి నిలబడి అన్నాను.

"డాక్టర్ వాన్ హెల్సింగ్, మీకు పిచ్చెక్కిందా?"

అతను తలెత్తి చూసాడు. అతని కళ్లల్లోని సౌమ్యాన్ని చూసి చల్లబడిపోయాను.

"ఇటువంటి నిజాలతో పోలిస్తే, నాకు పిచ్చి ఎక్కడమే మంచిదనిపిస్తోంది. ఓ మిత్రమా! నీకీ విషయం ఎంత డొంకతిరుగుడుగా చెప్పాను, కాస్త ఆలోచించు. ఇంత చిన్న విషయం చెప్పడానికి ఎందుకంతసేపు తీసుకున్నాను? నువ్వంటే నాకు ద్వేషమనుకున్నావా? నిన్ను బాధపెట్టాలన్న ఉద్దేశం వుందనుకున్నావా? భయంకరమైన చావునుండి నన్ను తప్పించినందుకు, నీ మీద కక్ష తీర్చుకుంటా ననుకున్నావా? ఓ, కాదు మిత్రమా!" అన్నాడు.

"క్షమించండి" అన్నాను వెంటనే.

"మిత్రమా! నువ్వు లూసీని ఎంతో గాఢంగా ప్రేమించావనితెలుసు.అందుకే నీహృదయాన్నిబద్దలు చేసే ఈ విషయాన్ని నీ కెంతో నెమ్మదిగా చెప్పాలను కున్నాను. అయినా దీన్ని నమ్మమని అనటం లేదు. అగమ్యగోచరంగా వున్న నిజాన్ని నమ్మటం కష్టమే. ఒక విషయం అబద్ధమని మనకి బాగా తెలిసివుండి, దాన్ని నిజంగా భావించడానికి సందేహపడాల్సిందే. ఇటువంటి విషాదమైన నిజాన్ని ఒప్పుకోడం చాలా కష్టమే— అందులో లూసీలాంటి అమ్మాయి గురించి. ఇవాళ రాత్రి దీన్ని రుజువు చేస్తాను. నాతో వచ్చే ధైర్యం వుందా?" అన్నాడు.

తొట్రుపడ్డాను. నేను జంకడం చూసి "నాకు తెలుసు నీ భయం. నేనేం పిచ్చిగా మాట్లాడ్డం లేదు. లూసీ విషయం నిజం కాకపోయినట్టయితే, అది నీకు తెలుస్తుంది కదా, అప్పుడు నీ మనసు కుదుటపడుతుంది. దానివల్ల ఇబ్బందిలేదు. కానీ ఆదే నిజమని రుజువయిందనుకో, ఓ... అదే భయంకరమైన విషయం. అది నువు భరించి నాకు సాయపడాలి. నీకు నమ్మకం కలగాలి. ఇలా రా. నేను ఏం చెయ్యదల్చుకున్నానో చెప్తాను. మొదట మనం హాస్పటల్‌కి వెళ్ళి అక్కడ గాయపడిన అబ్బాయిని చూద్దాం. ఆ నార్త్ హాస్పటల్లో పని చేస్తున్న డాక్టర్ విన్సెంట్ నా స్నేహితుడే. బహుశా నీకూ తెలిసి వుండాలి, ఆంస్టర్‌డామ్‌లో క్లాసుకొచ్చేవాడు. మనల్ని స్నేహితులుగా కాకపోయినా, శాస్త్రజ్ఞులుగా మనకి ఆ అబ్బాయిని చూసే అవకాశం ఇస్తాడు. మనం అతనికి ఏం చెప్పకూడదు. వూర్కే చూడ డానికి వచ్చాం అందాం, తర్వాత—" అని ఆగాడు.

"వూ, తర్వాత?" ఆత్రంగా అడిగాను.

అతను జేబులోంచి ఒక తాళంచెవి తీసి పట్టుకున్నాడు. "తర్వాత లూసీని సమాధి చేసిన చర్చి ఆవరణలో, నువ్వూ నేనూ రాత్రంతా గడపాలి. ఇది సమాధి చేయబడ్డ శవపేటిక తాళం. శవ పేటిక వుంచిన మనిషి ఈ తాళంచెవి ఆర్థర్‌కి అంద జేయమని ఇచ్చాడు" అన్నాడు.

నా గుండె ముడుచుకుపోయింది. మా ఇద్దరి మధ్య ఏదో భయంకరమైన తీర్మానం జరగ బోతోంది. నేను చెయ్యగలిగింది ఏమీలేదు. అందుచేత నా గుండె చిక్కబట్టుకుని తొందరగా బయలుదేరదా మని అన్నాను, అప్పటికే మధ్యాహ్నంవేళ దాటిపోతోంది గనుక......

అబ్బాయి మెలుకువగా వుండటం చూసాం అతను బాగా నిద్రపోయి, తర్వాత ఆహారం తీసుకున్నాడు. కాస్త బాగానే వున్నాడు. డాక్టర్ విన్సెంట్ ఆ అబ్బాయి గొంతు దగ్గరి బాండేజి తీసి అక్కడ రంధ్రాల్లాంటి గాయాలు చూపించాడు. లూసీ గొంతు దగ్గర కనిపించిన రంధ్రాల్లాగే ఇవి కూడా వున్నాయి. అందులో తేడా లేదు. ఆ రంధ్రాలు చిన్నవిగా వుండి, అప్పుడే అయిన గాయాల్లా వున్నాయి. డాక్టర్ విన్సెంట్‌ని అవి ఏమయి వుంటాయని అడిగాం. అందుకు అతను ఏదో జంతువు కరిచినట్టుగా వుందని చెప్పాడు. ఆ జంతువు బహుశా ఎలుక అయివుండాలిగానీ, అతను మాత్రం అది ఏదో గబ్బిలాయి అయివుంటుం దన్నాడు. ఎందుకంటే, నార్త్ లండన్‌లో అవి ఎక్కువ అని చెప్పాడు. హానికరం కాని ఎన్నో గబ్బిలాయిల్లో పెద్దవి కొన్ని దుష్టశక్తులకు సంబంధించినవి కూడా వున్నాయి. ఎవరో ఒక నావికుడు ఇంటికి తెచ్చివుంటాడు. అవి ఎట్లాగో తప్పించుకుని పారిపోయివుంటాయి. 'జూ' నుంచి కూడా ఏదన్నా ఒకటి తప్పించుకుని వుండొచ్చు. లేదా ఏ దెయ్యం తాలుకో అయివుంటుంది. ఇట్లాంటివి జరుగుతూవుంటాయి, తెలుసా. పది రోజుల క్రితం ఓ తోడేలు తప్పించుకుని పారిపోయి, ఈ ప్రాంతాల్లోనే దొరికింది. ఇది జరిగిన వారం రోజుల వరకు పిల్లలు 'హీత్' ప్రాంతంలో 'తోడేలు ఆట' ఆడుకుంటూనే వున్నారు. తర్వాత 'అందమైన అమ్మాయి' కనిపించి పిల్లల్ని ఎత్తుకుపోతున్నట్టు భయంకర వదంతి బయలుదేరింది." అన్నాడు.

"పిల్లల్ని ఇక్కడ్నుంచి ఇంటికి పంపించే టప్పుడు, వాళ్ల తల్లిదండ్రులతో, పిల్లల్ని జాగ్రత్తగా కనిపెట్టుకొని వుండాలని చెపుతున్నారా? ఇటువంటి విషయాలు తేలిగ్గా తీసుకుంటే ప్రమాదం. ఈ పిల్లవాడు మరొక్కసారి రాత్రి పూట బయట వుండినట్టయితే, ఇక దెబ్బతిన్నట్టే. అయినా ఇట్లా కొంత కాలం తల్లిదండ్రుల్ని హెచ్చరిస్తుండాలి" వాన్‌హెల్సింగ్ అన్నారు.

"తప్పకుండా. గాయం మానకపోతే, అట్లాగే హెచ్చరిస్తూవుంటాం" అన్నాడు.

మేం అనుకున్నదానికంటే, హాస్పటల్‌లో ఎక్కువసేపు గడిపాం. మేం బయటికి వచ్చేసరికి చీకటి పడింది.

ఎంత చీకటి పడిందో చూసాక వాన్‌హెల్సింగ్ అన్నాడు— "తొందరపడనక్కరలేదు. హాస్పటల్లో ఇంకా ఆలస్యం అవుతుందనుకున్నాను. రా, ఎక్కడో ఒకచోట తిండి తిందాం. తర్వాత మనపని చూద్దాం"

[ఇంకా వుంది]

చదివే కంప్యూటర్!

జపాన్‌లో అంతర్జాతీయ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖవారు పుస్తకాలను చదవగల యంత్రాన్ని రూపొందించారు. దీనిలో ఒక కంప్యూటరు ఉంటుంది. ఇది మాటలను గుర్తుపట్టి, ఆ మాటలను ఒక స్పీకరుకు అందచేస్తుంది. స్పీకరు నుండి ఆ మాటలు స్పష్టంగా వినపడతాయి. దృష్టి మందగించిన వారికి, అంధులకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడగలదు. దీని సహాయంతో అంధులు పుస్తకాలను వినగలరు!

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

టి. కె. — ఖమ్మం

నేను బి.ఎస్‌సి. చదువుతున్నాను. నా క్లాస్‌మేట్ అప్పుడప్పుడు మా యింటికి వచ్చి — నా పుస్తకాలపై నా పేర్లే రాస్తూంటాడు. అతని ఉద్దేశ్యం ఏమిటి?

★ అదో జబ్బు. కనిపించిన కాగితంమీదే కాదు చదివే లైబ్రరీ పుస్తకాలమీదే కాదు, బహు అరుదైన మన ప్రాచీన సాంస్కృతిక కేంద్రాలలోని శిథిలాలపై అంతటా పేర్లు రాసేస్తుంటారు! మీరోసారి చెప్పాలి — అలా రాయవద్దని. (లేకపోతే మీరిదో ప్రేమ సంకేతం అనుకుంటున్నారా ?!)

కె. వి. డి. — సికింద్రాబాదు

చూడని వైద్యులు లేరు. కాని రోగం కుదరడం కనబడదు...

★ ఒకొక్కప్పుడు డాక్టర్ల కంటే ఓర్పే ఎక్కువ రోగాలు నయంచేస్తుంది అంటారు.

కె. ఎ. వి. ఆర్. — ఒంగోలు

నేను వరసకు మరదలయ్యే అమ్మాయిని ప్రేమించాను. కాని ఆమె నన్ను ప్రేమిస్తోందో లేదో తెలియదు. ఎలా ?

★ ఏం మనిషివయ్యా. ఇన్ని తెలుగుసినిమాలు చూసి, కనీసం మరదలు పిల్లనేనా 'ఏం పిల్లా ప్రేమిస్తున్నావా !' అని అడగలేవా?! బదులు క్షణం తెలిసేది కద.

ఎం. ఎస్. ఆర్. — బైపల్లి

ముగింపు కాని కథలంటే నా కిష్టం ?

★ నాకా సస్పెన్సు నచ్చదు. సశేషాలు భరించలేను.

మీ జవాబుల వల్ల కొందరి జీవితాలు చక్కపడుతున్నాయని నమ్మవచ్చా ?

★ ఏమో — అది మీరు చెప్పాలి. ఆలోచనల అద్దంపై దుమ్ముతెర పడివుంటే — మనస్సు సరిగ్గా ప్రతిబింబించదు. అలాంటి దుమ్ముతెర వుందనీ, అడపాతడపా కాస్త కటువుగానైనా చెప్పి — "తుడిచేస్తే — మీ ముఖాలకి పౌరుషం కళ యిస్తుందని" చెప్పాలనే నా కోరిక.

ఎమ్. ఎస్ ఆర్ — విశాఖ

నేను ఒక అమ్మాయిని దాదాపు 3 సం॥నుంచి ప్రేమిస్తున్నాను. ఎప్పుడు పెళ్లి చేసుకుందాం అని అడుగుతూంటే ఏదో కుంటిసాకు చెప్పి తప్పించు కుంటోంది. ఈమె నన్ను కేవలం డబ్బుకోసం ప్రేమిస్తోందా అన్న అనుమానం వస్తూంది.

★ ముష్టివాడి వేషంలో వెళ్లి ప్రేమ భిక్ష పెట్టమనండి. ఏ మంటుందో— తెలిసిపోతుంది కదా?! మీకెంత డబ్బుందేంటి— ఆమె ఆ డబ్బునే ప్రేమిస్తోందన్న అనుమానం రాడానికి? అయినా డబ్బుకోసం ప్రేమించి పెళ్లి చేసుకుంటే— తరవాత అంతకంటే డబ్బున్నవాళ్లు కానరారని ఏమిటి గ్యారంటీ? అంచేత ప్రేమ ఒక్క డబ్బునే కోరదు. మీకేంలోటో ఆలోచించుకోడం— ప్రారంభించండి.

యు ఎమ్. వి. — బొబ్బిలి

మీరు ఆస్తికులా ? నాస్తికులా ?

★ తరుచు యిదే ప్రశ్న అంతా అడుగుతూ వుంటారెందుకో అర్థంకాదు. నేను ఆస్తి. మా ఆయన నాస్తి.

వి. ఎమ్. ఆర్. — ఆదోని

సంసారం అనేది సాగరం అయితే సంపాదన అనేది ఏమిటి ?

★ ఆ సాగరం యీదే పడవ ప్రయాణం సాగించడానికి — ముఖ్యమైన తెడ్డు.

వి. జి కె. — బెల్లంపల్లి

పై జన్మలో మీరో మొగుడుగా పుట్టా రనుకోండి. అప్పుడు మీ శ్రీమతి ఒక ఆధునిక మహిళ అనుకోండి. మీరు చెంబులూ, గిన్నెలూ తోమడం, వంటా గింటా చేయడం, చిల్లర సేవలు చేయడం వంటి యింటి పనులు అప్పగించబడ్డా యనుకోండి...

★ మీ ఉత్తరం సారాంశం తేలింది. ఇంకో జన్మ ఎత్తినా — యీ సమాజంలో ఆడదాని పరిస్థితి యిలాగే వుంటుందని. ఇంకో జన్మ ఎందుకు ఇంకో పది పదిహేనేళ్లు పోతే — యీ దేశంలో — చెంబులూ తోమడాలూ, వంటా తినడాలూ వుండవు. మనిషి కదలడానికి అవతలివాళ్లు మోచేయి అడ్డొస్తుంది. తిండి గింజ లెక్కడుంటాయి — మనిషి నిలవడానికే స్థలం లేకపోతే ? అప్పుడు మనుషులు రూపాయి కాగితాలు భోంచేసి — ప్రాణం పోయేదాకా బ్రతికివుంటారేమో. అంచేత — మీరేం బెంగపెట్టుకోకండి !

బి ఆర్ జి కె. — బల్లిగూడ

కష్టే ఫలి. మరి సుఖే ఏమిటి ?

★ రోగి ?!

ప్రభాకర్ - జనగాము

జననంలో కలదు వేదన, మరణంలో కలదు వేదన అన్నాడు ఒక పాటలో ఒక రచయిత. మరణంలో వేదన వుంటుందిగాని— జననంలో ఎలా వుంటుంది ?

★ కనరు— కనుక మీకు చెప్పినా తెలియదు, ప్రసవవేదన అనుభవించితేగాని అర్థం రాదు.

అనారా — ఖర్గపూరు

అస్తమానూ ఆడవాళ్లు అన్నలు, ఆభరణాలు, అంతస్థుల కోసమే ఆశపడతారు ?

★ చిత్తం. అటువంటి అతివ కోసమే కదా— సదా — మగవాడి తాపత్రయం కూడా ! ★

బియ్యే!... నీ విలువెంత?

• ఓ. లక్ష్మణాచార్యు •

తూర్పు ఎర్రబడి అప్పటికి మూడు గంటలు దాటింది.

వేసవి కాలం!

ఆకలితో దహించుకపోయే సింహం కళ్ళలోని చూపుల్లా... సూర్యకిరణాలు!

శేఖరం ఆతని ప్రక్కనున్న గడియారం చేతివి చూసాడు. తను బస్‌స్టాండుకొచ్చి అరగంటయింది. ఆశ్చర్యం వేయలేదతనికి.

బస్‌స్టాండునిండా జనం! గుంపులు గుంపులుగా... నేల ఈనినట్లుగా...

ఉద్యోగస్తులు... స్టూడెంట్లు... మామూలు పాసింజెర్లు... రిక్షావాలాలు... అడవిలో ఒకే ప్రాంతంలో పుట్టిన రకరకాల చెట్లలా...

నీటుగా తయారై కాలేజీల కెళ్ళే కుర్రాళ్ళను చూస్తుంటే శేఖరం పెదవులపై సన్నటి మందహాసం! ఆ నవ్వులో "అయ్యో! వీరెంత అమాయకులు!" అనే జాలి వుంది. 'ఎంత ఆశాజీవులు!' అనే భావం వుంది.

'బడి రోజులు బంగారు రోజులు...' అనే మాటను పెద్దవాళ్ళెందుకన్నారో చదువుకునే రోజుల్లో తన కర్థం కాలేదుగాని, ఇప్పుడు అక్షరాలా నిజమనిపిస్తోంది. 'ఆ మాట నాలాంటివారికోరకే పుట్టిందేమో' అని ఇదివరలో రెండు మూడు మార్లు కూడా అనుకున్నాడు — శేఖరం.

శేఖరం పాతికేళ్ళ పడుచువాడైనాగాని జీవితానుభవంలో వయస్సు మీరినవాడే.

అతడిని, అతని చేతిలోని ఫైలును ఎవరైనా చూస్తే 'భారతంలోని నిరుద్యోగి' అనే చిన్న 'స్కెచ్'ను వ్రాసి ప్రచురణ కోసం పంపడం ఖాయం.

ఉన్న ఒక్క చొక్కా ప్యాంటును జాగ్రత్తగా వుతికి, (లేకపోతే చిరిగిపోతుందని భయంలెండి) ప్రక్క ఇంటివాళ్ళను రిక్వెస్టు చేసి తెచ్చిన ఐరన్ బాక్సుతో అతిజాగ్రత్తగా ఇస్త్రీ చేసి, ఎంప్లాయ్‌మెంటు ఆఫీసరుకు కాస్త 'నీట్'గా అగుపడాలని తాపత్రయపడే శేఖరం ప్రయత్నం విఫలమే అయింది. ఎండ వేడిమికి శరీరమంతా చెమట పట్టి అప్పటికే పూర్తిగా తడిసిపోయిందంటే నమ్మండి.

అతడి కాళ్ళకు... అరిగిన స్లిప్పర్లు!... ముసలి మొఖానికి వయసు రంగు పులిమినట్లుగా...

అతడి మొగం సూర్యునితో జలకాలాడటంతో, ఆరోజే నున్నగా గీసిన గడ్డం కాస్తా మంట మండింది... గాయంపై కారం చల్లినట్లుగా...

చేతిలోని ఫైలును తెరచి మరొక్కమారు చూసుకున్నాడు — కావల్సిన సర్టిఫికేట్లు వగైరా అన్నీ వున్నాయో లేదో అని.

దాన్ని జాగ్రత్తగా మూసి కన్నకూతుర్ని పట్టుకున్నట్టుగా పట్టుకున్నాడు.

శేఖరానికి ఆ ఫైలే జీవనాధారం!

తన బియ్యే చదువంతా దాంట్లోనే వుంది.

ప్రక్కనున్న పల్లెటూరి బడిలో పంతులుగిరీ వెలగబెడుతూ ఎంతో ఆశగావున్న అతని తండ్రి కోరికలన్నీ దాంట్లోనే వున్నాయి.

"ఒరే శేఖరం! నీ చదువయిపోయి నీకో ఉద్యోగం వచ్చింతర్వాతయినా పడిపోయిన మన వంటింటి గోడను తిరిగి కట్టుకోవాలిరా..." తను బియ్యే మొదటి సంవత్సరం చదువుతూండగనే తన అమ్మ ఆశించే ఆశలు కూడా దాంట్లోనే వున్నాయి.

"ఏమిట్రా శేఖరం! నీ చదువెప్పుడయిపోతుంది? ఎప్పుడుద్యోగం వస్తుంది? నీ వుద్యోగం కొరకు మా సరోజ వేయి కళ్ళతో చూస్తోంది..." అవి తన మేనత్త అనే మాటలు. సరోజతో జరగబోయే తన పెళ్ళి కూడా ఈ ఫైలుమీదే ఆధారపడి వుందంటే ఈ ఫైలు తన జీవితానికెంత ముఖ్యమో తనకే తెల్సు!

శేఖరం ఇంకా బస్‌స్టాండులోనే వున్నా గడియారంలోని రెండు ముల్లులు మాత్రం పోటీపడి తిరుగుతున్నాయి.

గడియారం ముల్లులకూ, సూర్యుడి మూమెంటుకూ ఆయాసం లేదని ఊరికే అన్నారా? తనొచ్చి గంటయినా బస్సు రాలేదంటే అతడికేకాదు అక్కడున్న ఎవ్వరికీ ఆశ్చర్యం వెయ్యలేదు. ఆర్టీసీ బస్సులు! అందునా వరంగల్ — కాజీపేట మధ్య తిరిగే ఈ బస్సుల రాకపోకల సంగతి సర్వలోక విదితమే! వస్తే ఒకదాని వెనుక ఒకటి, ముచ్చట్లు చెప్పుకుంటూ... చీమల బారులా... రైలు డబ్బాల్లా... కలిసివెళ్ళే మిత్ర బృందంలా...ముఖం తుడుచుకున్నాడు శేఖరం... క్రాపు సరిచేసుకున్నాడు.

ఆయాసపడుతూ వచ్చి ఆగింది బస్సు... తొమ్మిదినెల్లు నిండిన గర్భవతిలా...

దానిలోపలే కాదు, బయటా జనమే!

ఎదురుచూస్తున్న శకటం ఎదుట నిలవగానే బెల్లం చుట్టూ ఈగలయ్యారు... బస్సు చుట్టూ జనం!

ఎక్కే పాసింజర్లలో ఓ కురుక్షేత్ర సమరం!

కాలరు సరిచేసుకొని శేఖరం 'డోరు' దగ్గరికి నడిచాడు— యుద్ధానికి వెళ్ళే వీరయోధునిలా.. వెళ్ళేముందు ఇంట్లోంచి బయలుదేరేటప్పుడు పెట్టుకున్న ఐదు రూపాయల కాగితం జేబులో వుందని నిర్ధారణ చేసుకున్నాడు. కాని మన శేఖరం యుద్ధం ప్రారంభించకుండానే బస్సుకాస్తా మెల్లగా కదిలింది... కప్పల్ని దిగమింగిన పాములా...

టైం — పదింబావు!

బియ్యే ప్యాసైన మూడుసంవత్సరాలకు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసునుండి 'కాల్' రావడం ఇదే మొదటి సారి! అందుకే అతనేగాదు, అతని నాన్నా సంతోషపడ్డాడు. అమ్మా, అత్తయ్యలతోపాటు సరోజకూడా సంతోషపడింది. ఈ మూడు సంవత్సరాల్లో ఉద్యోగం వచ్చేమాట దేవుడెరుగుకాని వాటికి దరఖాస్తులు పెట్టుకోవడానికి మాత్రం తక్కువలో తక్కువ ఓ అర్థశతం ఖర్చయి వుంటుంది. వస్తుందనుకున్న ఉద్యోగంకాస్తా 'ఉత్తర దక్షిణాలు' ఉన్నవారికో; ఫోనులో మ్రోగే ఖరీదైన గొంతుకో పోవడం శేఖరానికి తెల్సు. అయినా శేఖరానిది ఏం చెయ్యలేని స్థితి!

ఇంటర్వ్యూ స్థలం కలెక్టరాఫీసని, సమయం పదకొండు గంటలకని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరు ఆదేశం!

మొదటి కాల్!... క్రొత్త మురిపెం... పొద్దెరగదు...

తొమ్మిది గంటలకే వచ్చాడు—పదింబావయింది

"రిక్షా కావాలా ... సార్ ..." రిక్షావాలా అర్థింపు!

ఆలోచనల్లోంచి బయటకొచ్చాడు శేఖరం. రిక్షావాలాను చూసాడు.

పాత చొక్కా, మోకాళ్ళ వరకూ మలచిన మాసిన కాకిరంగు ప్యాంటు, పెరిగిన గడ్డం..

మళ్ళీ అడిగాడు రిక్షావాలా.

"కలెక్టరాఫీసుకెంత తీసుకుంటావ్ ..." జేబులోని డబ్బుల్ని తడిమి చూస్తూ అడిగాడు శేఖరం.

"రెండ్రూపాయలివ్వండి బాబూ ..."

"రూపాయిన్నరిస్తాను ..."

సీటును తుడిచాడు రిక్షావాలా — ఎక్కి కూర్చున్నాడు శేఖరం.

"పదకొండు గంటలకు ఇంటర్వ్యూ వుంది —

కాస్త త్వరగా పోనీయ్ ..." విన్న రిక్షావాలా పెదవులపై జీవంలేని నవ్వు!

శేఖరం ఆ నవ్వుని గమనించినా అందులోని అర్థాన్ని గ్రహించలేకపోయాడు.

రిక్షా వేగంగానే పోనిస్తున్నాడు. గాంధీ హాస్పిటల్ ... సూపర్ బజార్ ... వేయి స్థంభాల గుడి ... హన్మకొండ ... వెనక్కు వెళుతున్నాయి.

జాలేసింది శేఖరానికి. అలా జాలి వేయడం అతనికి సహజం!

ప్రొద్దస్తమానం రిక్షా త్రొక్కడం, సరిపోని ఆదాయంతో సంసారం సాగించడం.

"రోజూ ఎంత సంపాదిస్తావోయ్ ..."

ఆశ్చర్యంగా చూసాడు రిక్షావాలా.

"మంచి సవారొస్తే ఇరవై ... మామూలుగా అయితే పదిహేను. అందులో ఐదు కిరాయి గట్టాలి ..."

నిరాశ ధ్వనించింది అతడి గొంతులో.

'చదువుకోకపోవడం వాడి దురదృష్టం! శారీరకంగా ఎంత శ్రమపడాల్సి వస్తోంది! అయినా జీవితం అతుకుల బొంతే ...'

ఆలోచిస్తున్నాడు శేఖరం.

తన ఫైలును చూసుకున్నాడు – తృప్తిగా నిట్టూర్చాడు. ఇవ్వాల్టితో తనకూ ఒక ఉద్యోగం వస్తే తన కాళ్ళమీద తను నిలబడగలుగుతాడు. ఆ తర్వాత సరోజను పెళ్ళి చేసుకుంటే హాయిగా కాకపోయినా మామూలుగానైనా జీవితం గడిచి పోతుంది కాని ఇంత దుర్లభం అనిపించదు.

పదిన్నర దాటింది... పదకొండు కంటే ముందే చేర్చడానికి తన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు రిక్షావాలా. మాసిన చొక్కా అంతా 'శ్రమ'తో తడిచిపోయింది.

వేగంగా పోతోంది రిక్షా... ఎదురుగా వేగంతో వస్తోంది జీపు! అంతే! శేఖరం వూహించలేదు ఆ సంఘటన. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

రిక్షా ఓ చక్రానికి జీపు తగిలింది.

జీపు అదే వేగంతో వెళ్ళిపోయింది–ఆగకుండా. పోలీసును చూసిన దొంగలా ...

రిక్షా ప్రక్కకు ఒరిగిపోయింది – ఆసామితో దెబ్బలు తిన్న కూలీలా ...

రిక్షావాలా తల రోడ్డు ప్రక్కనవున్న మైలు రాయికి విసురుగా తగిలింది.

మైలురాయి చెదరలేదు – తన మొఖానికి రిక్షావాలా రక్తాన్ని పూసుకుంది. రిక్షావాలాకు స్పృహ లేదు. మొదలు నరికిన చెట్టులా ... రిక్షావాలా శరీరం!

మూసిన కళ్ళు తెరిచాడు శేఖరం.

గడిచింది క్షణమే... కాని జరిగింది ఘోరం!

తనను చూసుకున్నాడు – రోడ్డుకు దిగువగా వున్న కుంట ప్రక్కన!

చుట్టూ చూసాడు... ఆశ్చర్యంతో, జాలితో గుమికూడిన జనం!

తనకు ప్రమాదం జరక్కపోవడం అదృష్టం

మెల్లగా లేచాడు శేఖరం...రిక్షావాలా దగ్గరకు నడిచాడు. రక్తం బాగానే పోయింది వింతగా చూస్తున్నారే గాని ముందుకు రావడం లేదెవ్వరూ

ప్రక్కనున్నతని టైం చూసాడు శేఖరం పదకొండుకు పావుగంట వుంది. భయం వేసింది - ఏం చెయ్యాలో తోచని స్థితి!

ఒక ప్రక్క ఇంటర్వ్యూ మరో ప్రక్క పడిపోయిన రిక్షావాలా . .

ఆ ప్రక్క తనకు రాబోయే ఉద్యోగం ఈ వేపు కాపాడవల్సిన జీవితం శేఖరం కళ్ళు జాలిగా అతడిని చూసాయి... దూరంగా పడివున్న సర్టిఫికేట్ల ఫైలునూ చూసాయి.

"అయ్యో పాపం! తలకు బాగానే దెబ్బ తగిలింది ..."

"ఎంత ఘోరం జరిగిపోయింది– రక్తం బాగా కారుతోంది ..."

"అసలెలా జరిగిందీ ఘోరం?"

"తొందరగా హాస్పిటల్లో చేర్పించాలి లేకపోతే ప్రమాదం ..."

గుంపులోని జనం ఒక్కొక్కరు ఒక్కొక్క మాటనుకుంటున్నారు. ముందుకు వచ్చేవారు శూన్యం!

అటువేపు పోతున్న మరో రిక్షావాలా పరుగు పరుగున వచ్చాడు ...



"బియ్యే!...నీ విలువెంత?"

పడిపోయిన వాడిని రిక్షాలోకి ఎక్కించాడు శేఖరం లేచాడు.

"మీరూ కూర్చోండి బాబుగారూ... హాస్పిటలుకు తీసుకపోదాం..."

అప్రయత్నంగా ఎక్కి కూర్చున్నాడు శేఖరం... తన నిర్ణయం సబబే అనుకున్నాడు.

రిక్షావాలాను — హాస్పిటల్‌లో చేర్పించారు.

గంటయింతర్వాత స్పృహ వచ్చింది రిక్షావాలాకు.

"బాబూ... మీరు చేసిన సహాయానికి చాలా కృతజ్ఞతలు... మెనీ మెనీ థాంక్స్!..."

ఆశ్చర్యంగా అతడి కళ్ళలోకి చూసాడు శేఖరం ఆ ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మళ్ళీ అన్నాడతను.

"ఈ హాస్పిటల్‌కు ముందున్న సందులోనే మా ఇల్లు — ఎవర్నడిగినా చెపుతారు — నాకు తెలిసినవారు ప్రస్తుతం మీరొక్కరే. బాబూ... మీరే మనుకోకపోతే దయచేసి మా ఇంటికెళ్ళి ఈ విషయం మా ఆవిడతో చెప్పండి... ప్లీజ్..."

అర్థింపు ధ్వనించింది అతడి గొంతులో.

ఎదుటివాళ్ళలో జాలి, దయ కలిగించే శక్తి వుంది అతడి కంఠంలో.

లేచాడు శేఖరం — హాస్పిటల్ బయటికి వచ్చాడు.

రిక్షావాలా ఇచ్చిన ఆనవాళ్ళుబట్టి ఇల్లు తొందరగా దొరికింది.

కూలిపోతున్నట్టుగా వున్న చిన్న పెంకుటిల్లు! ఇంటిచుట్టూ మాత్రం శుభ్రంగా వుంది.

ఇంటిముందు ఆడుకుంటున్న పదేళ్ళ కుర్రాణ్ణి పిలిచి అడిగాడు 'రిక్షా రాములు ఇల్లు ఇదేనా' అని...

అవునన్నట్లు తలూపి ఇంట్లోకి వెళ్ళి వాళ్ళమ్మతో చెప్పాడు.

భర్తకు జరిగిన ప్రమాదం విన్న ఆవిడ కంగారుగా పరుగెత్తింది — తుపాకీ శబ్దం విన్న పక్షిలా...

బయటికొస్తున్న శేఖరం కళ్ళు ఆ ఇంట్లో గోడమీద నిలిచాయి. అప్పటి అతడి మొగాన్ని బాపు లాంటి ఆర్టిస్టు కుంచెతో చిత్రించి దానికి "ఆశ్చర్యాంబుధిలో..." అనే వ్యాఖ్య వ్రాసి దానిని పోటీకి పంపిస్తే ప్రథమ బహుమతి — ఖాయం.

దుమ్ము పట్టివున్న ఫొటో ఫ్రేములో చాన్నాళ్ళ క్రితం అమర్చిన ఓ సర్టిఫికేటు... కూలిపోయిన రాచరికానికి చిహ్నంగా మిగిలిన కోట బురుజులా...

దాన్ని పరీక్షగా చూసాడు శేఖరం.

"కె. రామారావ్... పాస్డ్ బి. ఎ. ఇన్ 1969..." అనేది దాని సారాంశం.


హాస్పిటల్ బెడ్‌పై పడుకున్న రిక్షా రాములు శేఖరం కళ్ళముందు నిలిచాడు.

తన చేతిలోని ఫైలును తెరిచాడు.

తను 1979లో ప్యాసైన బియ్యేకు ఇచ్చిన సర్టిఫికేటులోని అక్షరాలు తనను హేళనచేస్తూ నవ్వుతున్నట్లనిపించింది.

అక్కడినుండి కదిలాడు శేఖరం.

అతడి మొగంలో — ఓ నవ్వు! జీవంలేని నవ్వు... మధ్యతరగతి మందహాసం!... ★



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఆర్. టి కె. — హాలహర్వి

నా వయస్సు 18 సంవత్సరములు. అప్పు డప్పుడు నా నోటినుండి దుర్వాసన వస్తుంది. కొద్ది రోజులుండును. పళ్లపై పేరుకొన్న పాచి పోవుటకు ఏమైనా లిక్విడ్ మెడిసిన్ వుంటే తెల్పండి ?

★ నోటి దుర్వాసనకి దంతరోగాలు, అజీర్తి, సెప్టిక్ టాన్సిల్స్ ముఖ్య కారణాలవుతాయి. వీటికి గాను పరీక్షింప చేసుకొని తగిన మందులు వాడండి. దంతాలపై పేరుకొన్న "పాచి" పోవటానికి దంత వైద్యులచేత "క్లీన్" చేయించుకోవలసి ఉంటుంది. అటు తర్వాత దంత ధావనకి తగిన శ్రద్ధ వహించ వలసి ఉంటుంది.

బి. కె — ఏలూరు

ఎన్‌కెఫలైటిస్ అంటే ఏమిటి? ఎందువల్ల ఆ రోగం వస్తుంది ?

★ మెదడు వాయటాన్ని ఎన్‌కెఫలైటిస్ అని అంటారు.

ఈ వాపు బాక్టీరియాలవల్లగాని, వైరస్‌లవల్ల గాని, అలర్జీవల్లగాని ఏర్పడవచ్చును

మగత, ఫిట్లు, జ్వరం, వాంతులు మొదలయినవి ఎన్‌కెఫలైటిస్ ఏర్పడినవారికి కనబడే లక్షణాలు. ఈ వాపు ఏ వయస్సులోనైనా రావచ్చును. ఎక్కువగా 30 సం॥ల లోపువారికి రావటం సహజం.

జి. ఎస్ వి. పి. - జగ్గంపేట

నా క్రింది పెదవిమీద 3 సెం॥ మీ వరకు ఎర్రని మచ్చ ఉన్నది. దీనికి ఏమి చెయ్యాలి ?

★ దీనిని హెమాన్‌జియోమా అని అంటారు. మామూలుగా దీనికి ప్రత్యేక చికిత్స అనవరం. కానీ అసహ్యంగా కనబడుతూ ఉన్నప్పుడు శస్త్ర వైద్య నిపుణులు కాటరైజేషన్ ద్వారా చికిత్స చేస్తారు.

కె. - ఈమని

నా వయస్సు 20 సం॥లు. ఒక సం॥ క్రితం కుడి కంటికి కాటరాక్ట్ వచ్చింది. దెబ్బ ఏమీ తగల లేదు. సం॥ క్రితం కాటరాక్ట్ తీయించుకొన్నాను. అయినా కన్ను మసకగానే ఉన్నది. ఇంకో డాక్టర్‌కి చూపించితే కాటరాక్ట్ ఇంకా మిగిలి ఉంది. మళ్ళీ ఆపరేషన్ చేయాలన్నారు ?

★ ఇటువంటి సందర్భాలలో మీరు నిపుణులైన నేత్రవైద్యుల సలహా పొందవలసి ఉంటుంది. మద్రాసులో డాక్టర్ అగర్‌వాల్ కంటి ఆస్పత్రిలోగాని, శంకర నేత్రాలయాలోగాని చూపించండి.

యు. ఎస్. ఎస్. ఎస్. కుప్పం

మా అమ్మగారికి 13 సంవత్సరములుగా బి. పి. వున్నది. డాక్టర్ సలహాపై మాత్రలు వాడు తున్నాము. ఇప్పుడు బి. పి. నార్మల్‌గానే వున్నది. నడుము దగ్గర నుండి కాళ్ళ చివరదాకా నరాల నెప్పి అంటున్నారు. మోకాళ్ళ వద్ద ఉబ్బినట్టు వున్నది. అది చాల నెప్పి అంటున్నారు. బెంగుళూరు, మద్రాస్ లలోగూడా చూపించినారు. వాపుమాత్రం తగ్గలేదు.

★ బ్లడ్‌ప్రెషర్ ఉన్నవారు మందులు వాడటం ఎంత అవసరమో, ఆహారంలో ఉప్పు ప్రమాణం తగ్గించటం కూడా అంత అవసరమే!

1/2 మాత్ర వంతున ప్రతి రోజూ ఉదయం లాసిక్స్ మాత్ర వాడటంవల్ల వాపు తగ్గుతుంది. రోజు విడిచి రోజూ బడ్ల ప్రెషర్ చూడటం చాలా అవసరం. ఇ. సి. జి., ఛాతీ ఎక్స్‌రే తీసి నిపుణులకి చూపించాలి.

వి. ఎస్. - బొంబాయి


నాలుగు నెలల క్రితం నాకు పెళ్ళయింది. పెళ్ళికి ముందే నా భార్యకి కుష్టురోగం ఉందని అనుమానం ఉండి రక్తపరీక్ష చేయించాము. అందులో ఏమీ లేదని డాక్టరు తెల్పారు. వాళ్ళ అన్నయ్యకి కుష్టురోగం ఉంది. ఇప్పుడు నా భార్యకి కాళ్ళు ఉబ్బినట్లు కనబడుతున్నాయి. ఇది కుష్టురోగమేనా? తెలుప ప్రార్థన.

★ రక్తపరీక్ష వల్ల కుష్టురోగం ఉన్నదీ, లేనిదీ తెలియదు. చర్మం మీది పొడల మీది చర్మ భాగాన్ని పరీక్షిస్తే గాని ఈ క్రిములు కనుగొనబడవు. అన్నకి రోగం ఉన్నంతమాత్రాన చెల్లెలికి వచ్చే అవ కాశము లేదు. కాలు ఉబ్బటానికీ కుష్టురోగానికీ సంబంధం లేదు.


బి. ఎస్. — వరంగల్

నాకు మూడు సంవత్సరముల నుండి ఎడమ వైపు హైడ్రోసీల్ వున్నది. డాక్టర్ దగ్గర చూపించి మందులు వాడితే కొంచెము నయము అయినది. ఇంకా కొంచెము వున్నది. దీనికి ఏమి చెయ్యాలి ?

★ మందులతో హైడ్రోసీల్ పూర్తిగా పోదు. మరీ పెద్దగా లేకపోతే దానిని గురించి పట్టించుకో నవసరంలేదు. ఇబ్బందిగా ఉన్నప్పుడు మాత్రం శస్త్రచికిత్స వల్ల పూర్తిగా నయం చేసుకో వచ్చును. ★



మానవత్వం మరణించదు



జి. భాను

ఇంటర్వ్యూకు సూటుకేసుతో వెళ్ళిన చక్రవర్తి రిక్తహస్తాలతో, దిగాలుపడిన మొహంతో రూములోకి అడుగు పెట్టడం మిత్రుడు సత్యమూర్తికి ఆశ్చర్యం కల్గించింది. ఎన్నో ఆశలతో మనో ధైర్యంతో, సంతోషంగా వెళ్లినవాడు, దైన్యంగా మౌనంగా తిరిగి రాడానికి ఏదో బలీయమైన కారణం ఉండి ఉండాలి అనుకొన్నాడు.

నిట్టూర్పుతూ కూలబడ్డాడు చక్రవర్తి చాపమీద.

'ఏమైంది? ఏమిటీ అవతారం?' సత్యమూర్తి అడిగాడు.

సత్యమూర్తి కన్నుల్లోకి చూస్తూ, బీదగా నవ్వి 'దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళవాన అన్నట్లుగా దురదృష్టవంతుడి ప్రయత్నానికి అన్నీ కడగళ్ళేరా!' అన్నాడు తలక్రింద చేతులు పెట్టుకొని పండుకొంటూ.

'డొంకతిరుగుడు లేకుండా, సరిగ్గా చెప్పి ఏడవ్వగదా నువ్వు' విసుక్కొంటూ అన్నాడు సత్యమూర్తి.

'జీవితమే డొంకతిరుగుడు వ్యవహారమైనప్పుడు నేను ఇంతకంటే ఇంకోవిధంగా ఎట్లా మాట్లాడను ?'

'ఈసారి కూడా డిజ్ప్పాయింట్మెంట్ పునరావృతం అయ్యిందా ?'

'ఇక డిజప్పాయింట్మెంట్ పునరావృతంకాని అదృష్టం జరిగిపోయిందిలే !'

'అంటే !?' ముఖంలోకి చూస్తూ అడిగాడు మూర్తి.

'ఇంటర్వ్యూకు వెళ్ళకముందే సిటీబస్లో సూటుకేసు ఎవరో కొట్టేశారు. రెండొందలు దాన్లోనే ఉంచాను. సర్టిఫికెట్స్ అన్నీ ఎలాగూ దాన్లోనే ఉన్నాయి. జేబులోవున్న డబ్బుతో తిరిగి రూమ్కు చేరాను. దునియా గోల్ హై. ఇక నన్నేమీ అడగొద్దు' అని అటు తిరిగి పండుకొన్నాడు చక్రవర్తి.

సత్యమూర్తి తలపై నాటుబాంబు విసిరేసినంత షాకు తిన్నాడు. డబ్బు పోతేపోయింది. అప్పో, సప్పో చేసి, కాళ్ళా వేళ్ళాపడి, జబర్ దస్తీగానో, దొరతనంగానో చివరకు దొంగతనంగానైనా సంపాదించ వచ్చు డబ్బు! పోయిన సర్టిఫికేట్లు సంపాదించాలంటే మాటలా ? ఎంతో అన్యాయం జరిగిపోయింది! ఇప్పుడు ఎట్లా ? ఏం చేయాలి ? చక్రవర్తి అసలే ఉద్రేకం మనిషి ! ఏ మౌతాడు ? ఎన్నో ఆలోచనలు సాగర తరంగాల్లా సత్యమూర్తి తలలో కొట్టుమిట్టాడు తున్నాయి.

కిటికీలోంచి వచ్చిన గాలికి కేలండర్ రెపరెప మన్నది. కేలండర్లోని యువతి పకాలున నవ్వుతున్నట్లున్నది. బ్రహ్మచారుల రూముల్లో ఉండేది అర్ధనగ్నపు అమ్మాయిల బొమ్మలు, నవ్వుతున్న సుందరాంగుల చిత్రాలు, ఉంటే గింటే రకరకాల పూల చిత్తరువులు !

సత్యమూర్తి కేలండర్ బొమ్మలన్నిటి వైపు చూశాడు. క్రింద నిరాశగా పడుకొన్న మిత్రుడు చక్రవర్తి వైపు చూశాడు.

ఉద్యోగం దొరికితే, జీవితంలో స్థిరపడి, అందాల సుందరి మలిచెప్పని కౌగిలిలో, నవ్వే పువ్వుల లోకంలో విహరించాలనే, తన్మయం చెందాలని ప్రతి యువకుడు ఉవ్విళ్ళూరుతాడు! ఎన్నో కలలు, కల్పనలు అల్లుకొంటాడు! జీవితాన్ని రంగు రంగుల భావాలతో రూపు దిద్దుకొంటాడు!

ఒకవేళ తన మధురోహల లోకానికి ద్వారాలు మూసుకొనిపోయి, ప్రవేశమే దుర్లభమైతే, అభిలాషలు ఎండమావులైతే, నిరాశల విజృంభణతో ఆ యువకుడు ఏమౌతాడు? జంతువు అవుతాడో? ఉన్మాదే అవుతాడో? సినిక్ అవుతాడో?

లోకంతో రాజీపడలేక అరణ్యాల్లోకే వెళ్తాడో? లోకంలో అరణ్య సిద్ధాంతాల్నే స్థాపిస్తాడో? తన తలలో అరణ్యాల్ని సృష్టించుకొంటాడో? ఏమైనా కావచ్చు!

సత్యమూర్తి కన్నుల్లో నీటి తెరలు కదిలాయి.

కళాశాలలో ఐదేళ్ళు చదివి పాసయినవాడు, తన పొట్ట గడుపుకొని, తమకింత పెట్టకపోడు. తమ్ముణ్ణి చూస్తాడు; చెల్లెలి పెళ్ళిచేస్తాడు అనుకొని ఏదోవిధంగా తినో తినకో, నోకట్టుపెట్టి డబ్బు పంపుతున్నారు చక్రవర్తి తల్లిదండ్రులు.

ఇప్పుడు వాళ్ళ శ్రమ, ఆశలు వమ్ము అయ్యాయని తెలిస్తే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుంది?

ఒక ప్రయివేటు కంపెనీలో క్లర్కుగా పని చేస్తూ, చక్రవర్తి మనస్తత్వం, అతని కుటుంబం స్థోమత తెలిసిన సత్యమూర్తి ఈ విధంగా ఆలోచించడం సముచితమే! రెండు సంవత్సరాలుగా ఒకే గదిలో ఉంటూ ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకొని జీవిస్తూ, ఒకరికి కష్టం సంప్రాప్తించినప్పుడు కలవర పడడంలో ఆశ్చర్యమేమీకాదు.

ఆ తర్వాత రెండు రోజులు చక్రవర్తి చక్రంలాగా గస్తీ తిరిగాడు. సినిమాహాళ్ళ దగ్గర బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాళ్ళని, బస్సు స్టాండుల దగ్గర పిక్‌పాకెట్‌గాళ్ళను, రైల్వేస్టేషన్ల దగ్గర సీట్లు అమ్మేవాళ్ళను, దొంగతనం చేయడానికి పొంచి ఉన్నవాళ్ళను, కిరాయికి ఎటువంటి పనైనా చేయడానికి సిద్ధపడి ఉన్నవాళ్ళను చూశాడు.

ఆకలి సముద్రం ఈదడానికి అంతులేని ఉపాయాలు అన్వేషించే ఆవారాగాళ్ళను చూశాడు.

ఈ దశ అవతారాల్లో ఏ అవతారం ఎత్తాలో తాను? చక్రవర్తి మనస్సు సమస్యల చక్రభ్రమణం అయ్యింది.

మూడో రోజున చక్రవర్తికి రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి ఇంటి దగ్గరనుండి, రెండోది విజయవాడ నుండి.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన సత్యమూర్తి, చింపని ఉత్తరాన్ని చూసి చక్రవర్తి లేడనుకొని విజయవాడ నుంచి వచ్చిన ఉత్తరాన్ని చింపి, చదివి ఈలవేశాడు. అందులో ఉన్నది రెండే పంక్తులు!

బ్రదర్ చక్రవర్తి!

నువ్వు పోగొట్టుకొన్న సూటుకేస్‌ను బీసెంటు రోడ్డు సెంటరులో ఉన్న హోటల్ సిద్ధార్థ రూము నెం. 9 లో తీసుకోవలసింది. ఈ ఉత్తరాన్ని చూపిస్తే అక్కడున్న వ్యక్తి సూటుకేసును అందజేస్తాడు. వివరాలు సూటికేసులో

ఇట్లు,
శ్రేయోభిలాషి.

ఎప్పుడో రాత్రి పది గంటలకు కాళ్ళీడ్చుకుంటూ వచ్చిన చక్రవర్తికి ఎదురు చూస్తున్న సత్యమూర్తి ముందుగా ఇంటి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరాన్ని ఇచ్చాడు. చక్రవర్తి చించి, చదివితే ఇంటర్‌వ్యూ విశేషాలు వ్రాయవలసిందిగా కోరుతూ తండ్రి రాయించిన ఉత్తరం అది.

కళ్ళు మూసుకొని నిట్టూర్చాడు చక్రవర్తి.

తర్వాత చించిన రెండో ఉత్తరాన్ని అందించాడు సత్యమూర్తి. రెండు క్షణాల్లో చదివి, ఎగిరిగంతేసి, సత్యమూర్తిని వాటేసుకొని, ఆనందంతో తబ్బిబ్బయిపోయాడు చక్రవర్తి.

'ఒరే చక్రవర్తి! ఇది ఊహించని విచిత్ర విషయం. నీ బ్రతుకు ఏ వెలుగుకోసం, భవిష్యత్తు కోసం ఉన్నదో మరి! కాకపోతే పోయిన సూట్‌కేసు ఉన్నదనీ, తీసుకొని పోవల్సిందిగా వార్త రావడం ఎంతో అదృష్టమనాలి. ఇంకా నువ్వు నిరాశ, నిస్పృహ పడనక్కరలేదు. నువ్వు ఏ విధంగానూ దురదృష్టవంతుడువి కాదురా. ఎందుకంటే ఈ రోజే అనుకోని విధంగా నాకు ఆఫీసులో నూట యాభై రూపాయలు అరియర్స్ అందాయి. ఇది విశేషం కాదా? ఈ వందరూపాయలు తీసుకెళ్ళి నీ సూటుకేసు తెచ్చుకో. తర్వాత మన ప్రయత్నాలు మనం చేసుకోడానికి వీలు అవుతుంది' అంటూ వందరూపాయలు ఇచ్చి, 'ఇంకో గంటలో బస్సుంది బయలుదేరు' అన్నాడు సత్యమూర్తి.

చక్రవర్తి సత్యమూర్తి కన్నుల్లోకి చూసి కన్నులు తుడుచుకొన్నాడు.

మరుసటి రోజు చక్రవర్తి బస్సుదిగి రిక్షాలో సిద్ధార్థా హోటల్‌కు వెళ్ళి, తొమ్మిదో నెంబరు గదిలో ఉన్న వ్యక్తికి తనకు వచ్చిన ఉత్తరాన్ని చూపించాడు.

ఓ మధ్య వయస్సున్న వ్యక్తి ఆ ఉత్తరాన్ని తీసుకొని చూసి 'ఓ! మీరేనా చక్రవర్తి?' అన్నాడు.

తల ఆడించాడు చక్రవర్తి.

మరుక్షణంలో చక్రవర్తి చేతిలోకి సూటుకేసు వచ్చింది. ఓ నిధిని పట్టుకొన్నంత పదిలంగా సూటుకేసును పట్టుకొని తిరుగు ముఖం పట్టాడు

స్టేషన్‌కు వెళ్ళి, ఇంకా కొద్ది సమయం ఉన్న బండి కోసం సిమెంటు బెంచిమీద కాసుకొని కూర్చున్నాడు. అప్పుడు చక్రవర్తికి తన సర్టిఫికెట్లు చూచుకోవాలనే బుద్ధి పుట్టింది. తెరచాడు. జత బట్టలు, టవలు, సోపు, పౌడర్‌టిన్ పెట్టినట్లే ఉన్నవి. సర్టిఫికెట్లు తాను సర్దిన క్రమంలోనే ఉన్నవి. కాకపోతే అడుగున పెట్టిన డబ్బు మాత్రం లేదు. నవ్వుకొన్నాడు చక్రవర్తి. సర్టిఫికేట్లు చేతిలోకి తీసుకొన్నాడు. ఎంతో తృప్తిగా కన్నులు మూసుకొన్నాడు. సూటుకేసు మరలా అందజేసిన అపరిచిత వ్యక్తికి అభినందనలు సమర్పించుకొన్నాడు.

ఆ సర్టిఫికేట్లు జీవిత గమ్యం చేరడానికి సోపానాలు!

లేకపోతే ఎన్ని మెట్లు జారిపోవలసి వచ్చేదో!

సర్టిఫికేట్లు అన్నీ ఒక్కసారి తిప్పాడు. మధ్యలో ఒక ఉత్తరం కన్పించింది. చేతిలోకి తీసుకొన్నాడు

తమ్ముడూ చక్రవర్తి!

నీ సర్టిఫికేట్లులో ఉన్న పుట్టిన తేదీ ప్రకారం నాకంటే చిన్నవాడివి కాబట్టి ఈ సంబోధన. నీకు ఇబ్బంది కల్గించినందుకు కొంచెం కించపడుతున్నాను. సానుభూతి నా వృత్తికి వ్యతిరేకం కదా! లేడి కంటి నీరుచూసి బోయవాడు కరిగిపోతాడా? అయినా వెధవది ఒక్కోసారి మనస్సు మందలిస్తుంది! కాబట్టే ఈ ఉత్తరం.

ఈపాటికి ఇంటర్వ్యూకు వెళ్ళేవాడివి. బహుశా సెలెక్టెడ్ లిస్టులో ఉండేవాడివి, నీకున్న మార్కుల్ని బట్టే సుమా! ఉత్తర దక్షిణాల సత్తా నీకుందో లేదో నాకు తెలియదు. లోకంలో ఏది సజావుగా సాగుతున్నదో చెప్పు; నీ సూటుకేసును నేను కొట్టేసినట్లు. అన్నట్లు డబ్బు రెండు వందలు మినహా నీ సూటుకేసులో అన్నీ భద్రం!

ఆయితే ఈ సూటుకేసు మరల ఎందుకు

'స్వర్ణ కమలాలు' కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న సందర్భంగా ఢిల్లీ ఆంధ్ర వనితా మండలి వారు శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిని ఇటీవల సన్మానించారు. మండలి అధ్యక్షురాలు శ్రీమతి పెండేకంటి కనకమ్మా వెంకట సుబ్బయ్య శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవికి మొమెంటోని అందజేస్తున్న దృశ్యం.



అందించాను ? మనసులో అనుకొంటున్నావు గదూ? ఐ విల్ కమ్ టు దట్ పాయింట్.

నేను వృత్తిచేత దొంగని కాని ప్రవృత్తిచేత కాదు. నేను కూడా స్వోత్కర్ష చెప్పకోడం బాగో లేదు కదూ ? నాకు ఎలా రాయాలో అర్థం కావడం లేదు. జేబులు కత్తిరించడం అలవాటు అయ్యాం తర్వాత, రాసే అలవాటు తప్పిపోయింది.

ఒక సంఘటనగా రాస్తాను.

ఈ సంఘటన పదిహేను సంవత్సరాల క్రిందట జరిగింది. ఓ యువకుడు మద్రాసులోని ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళాడు. ఆ ప్రదేశం కొత్త. తెలుగుదేశం నుండి వెళ్ళిన వాడికి భాష క్రొత్త ! వాతావరణం క్రొత్త! సిటీబస్సులో ఎక్కి, దిక్కులు చూస్తూ, దిగవలసిన చోట దిగేటప్పటికి సూటుకేసు గల్లంతైంది.

నెత్తీ నోరు మొత్తుకొన్నా నిష్ప్రయోజనమై పోయింది. దాన్లో డబ్బు లేదుగాని సర్టిఫికేట్లు అన్నీ ఉండిపోయాయి. ఇంటర్వ్యూ బోర్డువాళ్ళకి జరిగిన విషయం మొరపెట్టుకొంటే 'గెట్ అవుట్' అన్నారు. ఖచ్చితంగా దొరికే ఉద్యోగం ఎవడో కేడీ మూలంగా రాకుండాపోయింది. ఉద్యోగార్థి జీవితంలో తుడిచి పెట్టుకొనిపోయింది.

కాయకష్టం అందరికీ చేతకాదు. సులువుగా డబ్బు గుంజే పద్ధతికే ప్రతివాడూ ఆకర్షింప బడతాడు. ఈనాడూ ఏదో విధంగా డబ్బు ఆర్జించే మహానుభావులు మన కళ్ళ ఎదుటే ఎందరు లేరు ? ఆ యువకుడూ అంతే !

మానవత్వం మరణించదు !

ఉద్యోగం రాదు. కడుపులో ఆకలి ఆరదు. చెయ్యి చాచడం ఆత్మగౌరవానికి హాని. ఎవడో వివేకంలేని పశువు మూలంగా అతనికి దురవస్థ కలిగింది. కాబట్టి మనుషులమీద కసిని, క్రౌర్యాన్ని, కార్పణ్యాన్ని పెంచుకొన్నాడు. మానవత్వాన్ని మంట కలిపాడు. ఆలోచనలకు స్వస్తి పలికేడు. వివేకానికి విడాకులిచ్చాడు. పిక్‌పాకెట్లు కొట్టడం, దొంగ తనం చేయడం వృత్తిగా మలచుకొన్నాడు. జనం కళ్ళలో కారంకొట్టి జీవితాన్ని వెళ్ళబుచ్చుకొంటున్నాడు.

మొన్నీమధ్య ఒక విచిత్రమైన సంఘటన ఎదుర్కొన్నాడు. బస్సులో ఒక సూటుకేసు కొట్టేశాడు. డబ్బు తీసుకొన్నాడు. అదివరకు ఇటువంటి చౌర్యం చేసినా, ఇటువంటిది తటస్థించడం ఇది మొదటిసారి. ఈ సూటుకేసులోని సర్టిఫికెట్స్ చూడగానే అతని బుర్రలో అతని గత జీవితం గిర్రున తిరిగింది !

ఒకనాడు సర్టిఫికేట్స్ పోగొట్టుకొన్న కారణంగా జీవితంలో సవ్యమైన జీవనాన్ని పోగొట్టుకొని, ఒక విధమైన అర్థరహితమైన పరభాగ్యోప జీవిగా బ్రతుకు గడుపుతున్న అతనికి, సర్టిఫికేట్స్ తన చేతిలో పడటం మూలంగా, తనవంటి పరిస్థితే ఎదుర్కొబోయే ఒక యువకుడి గతి వెంటనే స్ఫురించింది. అతనిలోని మానవత్వం కన్నులు విప్పింది. నిరాశతో, గత్యంతరంలేక అతను ఏదో పొట్ట కోసం వక్ర జీవితాన్ని ఎన్నుకొంటే, ఇతను కూడా రేపు సమాజానికి చీడగా తయారైతే ఎలా ? అదీ తన మూలంగానా? అనే ప్రశ్నలు పడగలెత్తాయి.

మందలించిన మనస్సాక్షి సలహామేరకు ఇంటర్వ్యూ కవరుమీదున్న అడ్రసు ప్రకారం ఒక ఉత్తరం రాసి ఆ కుర్రోణ్ణి సూటుకేసు తీసుకొనే ఏర్పాటు చేశాడు.


తమ్ముడూ ! కథ బాగానే వచ్చింది కదూ ! ఇక మామూలుగా నడిపిస్తా.

ఒకప్పుడు సూటుకేసు పోగొట్టుకొన్న దురదృష్టవంతుణ్ణి నేనే ! ఏమీ చేతగాక పరిస్థితుల ప్రభావంవల్ల కేడినైపోయాను. నువ్వు డబ్బున్న వాడివో, లేనివాడివో సరిగా తెలియదు. కానీ నా అవసరంకొద్ది డబ్బు తీసేసుకొన్నాను. కానీ నాకులాగా నువ్వు నిరర్థకమైన, తెగిన గాలిపటం జీవితాన్ని ఎంచుకొంటావేమోనన్న ఉద్దేశంతో నా వృత్తికి భిన్నంగా ఇట్లా చేశాను. ఒకప్పుడు శిలలో సంగీతం వినబడవచ్చు; చచ్చినట్లున్న మ్రోడు చిగర్చనూవచ్చు. ఇది నీ మనసులోని సందేహానికి సమాధానం.

నీకు భవిష్యత్తులో మంచి ఉద్యోగం దొరికి, సుఖశాంతులతో, మానవత్వంతో మనుగడ సాగిస్తావని ఆశిస్తూ —

శ్రేయోభిలాషి.

అంతలోనే ప్లాటుఫారంమీదకు చక్రవర్తి ఎక్కవలసిన రైలుబండి ఆశలాగా వచ్చింది. ఉత్తరాన్ని ముద్దుపెట్టుకొని, సూటుకేసులో పెట్టేశాడు చక్రవర్తి బండి ఎక్కడానికి. ★



పి. హెచ్‌డి. ఉన్నా ఉద్యోగం దొరకని అంధుడు !

దుగ్గిరాలలో వో రైతు కుటుంబంలో అంధుడుగా పుట్టిన సత్యనారాయణ ఆదిలో తన తండ్రి ప్రోత్సాహంతోనూ, ఆనక తన సతీమణి ప్రోత్సాహంతోనూ ఉన్నత విద్యల నభ్యసించడమే గాక తెలుగులో రిసర్చి చేసి డాక్టరేట్ డిగ్రీని కూడా సంపాయించుకున్నాడట. జీవితంలో యింత సాధించినా వుద్యోగం మాత్రం దొరకని యీతను ఏంచెయ్యాలో తెలీకతికమకపడుతున్నాడు.

కన్నెపిల్లలని వంచించిన కాళి భక్తుడు !

పూనాకు చెందిన స్వామీ ప్రవీన్ కుమార్ మెహతా అనే వో కాళిభక్తుడు అదేవూరుకు చెందిన వో 17 ఏళ్ళ అమ్మాయి అందానికి ఆకర్షితుడై ఆమెకు పుణ్యక్షేత్రాలు చూపుతానని తన కూడా తీసుకువెళ్ళి హరిద్వార్, ఋషికేశ్, మధుర, బృందావనం, వారణాసి వంటి క్షేత్రాలు చూపించి, ఆనక తన కామవాంఛ తీర్చమని అడిగితే ఆమె ఒప్పలేదట. తన కోర్కె తీర్చకపోతే తనకు యీ శ్రమకు గిట్టుబాటు కాదని ఆమెను బలాత్కరించి, తన కామవాంఛ తీర్చుకున్నాడట. ఈ విషయం కోర్టుకు తెలిసి ఏమిటని ప్రశ్నిస్తే ఇంతకు ముందు కూడా అందమైన అమ్మాయిలకు తాను పుణ్యక్షేత్రాలు చూపిస్తే వారు తనకు తామే సుఖం చాలా మంది యిచ్చారని, అలా యిచ్చిన వారికి పుట్టిన పిల్లలు తనకు వో ఏనమండుగురైనా వుండి వుంటారనీ నివేదించాడట— హారి పాపాత్ముడా ! ఇదేం ప్రతిఫలమో చదువరీ !

అనుమాన పెనుభూతానికి ఆహుతైన ఆలుమగలు !

హరహారుకు చెందిన చిన్నకుప్పమ్ గ్రామంలో, వో అరవైయేళ్ళ ఆసామీ తన మూడో భార్య 20 ఏళ్ళ చంద్రమ్మ మీద అనుమానం పుట్టి ఆమె శీలం చెడిందని నమ్మకం పెంచుకుని, పగలో రగిలి, ఆమె మీద కిరోసిన్ పోసి, నిప్పంటించి చంపి, తాను విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడట!

నరమాంస భక్షకులు !

ఇస్లామాబాదుకు చెందిన పెషావర్‌లోని వో గ్రామంలోని ఒక చెరువు ఒడ్డున మాంసాన్ని కడుగుతూన్న వో తండ్రి కొడుకులను చూసిన పోలీసులు ఏమిటది అని ప్రశ్నించారట, ఆ మాంసం ఏ జంతువుకు సంబంధించినదో అంతు పట్టక. తీరాచూస్తే అది మనిషి మాంసమట. వారిద్దరూ నరమాంస భక్షకులట. వో ఏడేళ్ల అమ్మాయిని చంపి, తరిగి, మాంసాన్ని వండుకుంటున్నారట హాయిగా తిండానికి. ఈ నరమాంస భక్షకులు ఇంతవరకూ ఇరవైయ్యయిదుగుర్ని యిలాగే తరుక్కు తినేశారట ఎంచక్కా !

అంతానికి దారితీసిన అక్రమ సంబంధం !

తిరుచ్చికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రిలో హెడ్‌నర్స్‌గా పని చేస్తున్న థెరిసా అనే ఆమె భర్త్రుహీనట. ఆమెకు సుబ్రమణ్యం అనే వో పోలీసు కానిస్టేబులుకు చాలా కాలంగా అక్రమ సంబంధం వుండేదట. ఇటీవల ఆ సుబ్రమణ్యం వుద్యోగంలో సస్పెండయ్యాక, వీరిద్దరూ గుళ్లో పెళ్లి అయిందని పించుకుని వేరే కాపురం పెట్టారట. సుబ్రమణ్యానికి వివాహమై, ఇద్దరు పిల్లలు కూడా వున్నారట. ఫిబ్రవరి 26వ తేదీన ఆమె శవం వారు కొత్తగా చేరిన ఇంటి పెరటి నూతిలో వుందట.

మీరట్‌కు చెందిన సంతోష్ అనే ఆమెకూ, బిజ్నూరుకు చెందిన కెమ్‌చంద్ అనే అతనికీ అక్రమ సంబంధం వుందట. వీరిద్దరూ రహస్యంగా కాక, హాయిగా జీవితాన్ని కలుసుకోడానికి దారి తీసుకోడానికి నిర్ణయించుకున్నారట. ఆ పథకం ప్రకారం సంతోష్ భర్త నైన్‌సింగుకు వో రోజు పీకల వరకూ బ్రాందీ విస్కీలు పట్టించి, ఆనక పాలలో విషం కలిపి స్పృహలేని అతనికి పట్టించి, అనుమానంతీరక తాటితో పీక నులిపి చంపి, పెరట్లో పెద్దగొయ్యితీసి, ఆ సింగును పాతిపెట్టి చేతులు దులుపు కున్నారట. పోలీసు కానిస్టేబులుగా పని చేస్తూన్న యీ నైన్‌సింగ్ ఏమయాడోనని జరిపిన విచారణలో యిది బైట పడిందట. కెమ్‌చంద్ వారికి ఫ్యామిలీ ఫ్రెండట. ఆనక నైన్‌సింగ్‌కు ఫ్యామిలీ ఫ్రెండుగా వుండి, అతని భార్యకు మాత్రం రహస్యంగా మరింత దగ్గరయ్యాడట.

చీమ దూరే సందిస్తే ... !

బొంబాయి ఖర్ ప్రాంతానికి చెందిన పాకలలో వో పాకలో వుండే బచ్చన్ బలరాజ జైస్వాల్ అనే అతని స్నేహితుడు సతీరామ్ మాదవ్ జైస్వార్ ఆ బచ్చన్ పాకలో తల దాచుకోడానికి కాస్త జాగా యివ్వమని, ఆనక తన కుటుంబాన్ని కూడా తెచ్చుకుని స్థిరపడిపోయేసరికి ఇదిఏమని బచ్చన్ ప్రశ్నిస్తే చోటు చాలకపోతే నువ్వే వేరే చోటుకు పో. అని అన్నాడట. ఆ బచ్చన్ మరింత గిలాటా చేసేసరికి సతీరామ్ రివాల్వరు తెచ్చి చూపించి, కుక్కిన పేనులా వుండకపోతే ఏముకలు ఏరేయిస్తానని చెప్పాడట. అప్పటికే బచ్చన్ వూపిరి పోయిందట. ఆ బచ్చన్ శవం ఫిబ్రవరి ఒకటోతేదీ రాత్రి రాంతా ప్రకాశనుంచి ఖర్ మార్గంలో ఎలక్ట్రిక్ ట్రైన పట్టాల మీద పడుందట — వన్ ప్లస్ వన్ ఎంత? ★



మొదటిపాఠం!

శ్రీమతి లక్ష్మిగిరిబాబు



మా కారు డ్రైవరు నా సూటు కేసు తీసుకొచ్చి బస్సులో పెట్టాడు. బస్సంతా రద్దీగా వుంది, లేడీస్ సీట్లలో మూడవ సీటులో కూర్చునున్న యిద్దరు మొగవాళ్లని కండక్టర్ చేత లేపించాడు మా డ్రయివర్. నేను వెళ్లి కిటికీ ప్రక్కన సీట్లో కూర్చుని, డ్రయివర్‌ని యింటికి వెళ్ళమన్నాను. రెండు నిమిషాలలో బస్సు బయలుదేరింది. ఆకాశమంతా మబ్బులతో నిండిపోవటం వల్ల వాతావరణం చల్లగా వుంది. బస్సు వెళ్తోంటే కిటికీ లోంచి చల్లటి గాలి వచ్చి హాయిగా తాకుతోంది. రోడ్డు పక్కనున్న పచ్చటి పొలాలు ఆ చక్కటి వాతావరణానికి ఆనందంతో తలలూపుతున్నాయి. నా మనసులాగే ప్రకృతి కూడా చాల సంతోషంగా వున్నట్లనిపించింది.

బస్సు గమ్యం కేసి పరిగెత్తుతోంటే, నేను నా ఆశయాలకి దగ్గరగా పరిగెత్తుతున్నంత సంతోషం వేసింది. మరో మూడు గంటల్లో బస్సు కావలి చేరుకోంటుంది నా కోసం బెనర్జీ అంకుల్ బస్టాండ్‌కే వస్తారు. బెనర్జీ అంకుల్ కావలిలో బాగా పేరున్న లాయర్. అలాంటి గొప్ప లాయర్ దగ్గర జూనియర్‌గా వుండే అవకాశం రావడం నిజంగా నా అదృష్టం. నేను 'లా' ఫస్టు క్లాసులో పాసయ్యానని తెలియగానే బెనర్జీ అంకుల్ నన్ను తన దగ్గరకు పంపమని డాడీకి లెటర్ రాశారు ఎవరో ముక్కూ మొఖం తెలియని లాయర్ దగ్గర పని చేసేకంటే, నాకు బాగా చనువున్న బెనర్జీ అంకుల్ లాంటి గొప్ప లాయర్ దగ్గర జూనియర్‌గా వుంటే నేను ఎంతయినా లాయర్‌గా అనుభవం సంపాదించుకోవచ్చు ఆడపిల్లలు లేని బెనర్జీ అంకుల్ నన్ను తన సొంత కూతురిలాగా ఆప్యాయంగా 'బేబీ' అనడం అలవాటు.

కావలి నాకు కొత్త వూరేమీ కాదు. అంతకుముందు డాడీతో కలిసి చాలసార్లు ఆ వూరికి బెనర్జీ అంకుల్ యింటికి వెళ్ళాను. 'లా' హైదరాబాద్‌లో చదివాను. లాయర్‌గా కావలిలో గుర్తింపు తెచ్చుకోవాలి అప్పుడే నా ఆశయాల్ని సాధించే శక్తి నాకు వస్తుంది. గుండెల నిండా తృప్తిగా గాలి పీల్చుకున్నాను.

న్యాయవాది అంటే అన్యాయవాది కాదని నిరూపించాలి. డబ్బు కోసం తప్పుడు కేసులు తీసికోకూడదు న్యాయం వున్నప్పుడే కేసు 'టేకప్' చెయ్యాలి ఫీజు కోసం ఆశపడి, నిర్దోషులని దోషులుగా తమ నైపుణ్యంతో నిరూపించే లాయర్లను చాలమందిని చూశాను. కాని, అది ఎంత అన్యాయమో, పాపమో వాళ్ళకి తెలియదా? అలాంటి లాయర్లను ఏం చేసినా పాపం లేదు నా దృష్టిలో... నాకు వెంటనే అరుణ, రాధ గుర్తుకొచ్చారు. వాళ్ళు నాలాగే 'లా' పాసయ్యారు. అన్యాయాన్ని న్యాయంగా నిరూపించడమే చాల గొప్ప అంటుంది అరుణ. న్యాయవాద వృత్తిలో న్యాయం, అన్యాయం అని మడి కట్టుకొని కూర్చుంటే లాభం లేదంటుంది రాధ. వాళ్ళకి నా ఆదర్శాలు, ఆశయాలు పరిహాసంగా అనిపిస్తాయి. వాళ్ళతో వాదించేప్పుడు నా ముఖం కందగడ్డలా మారిపోతుంది. నా ఆశయాల్ని సాధించి చూపిస్తానని రోజుకి పదిసార్లయినా వాళ్ల ముందు ఆవేశంతో చెబుతుంటాను. డాక్టర్‌గా డాడీ సంపాదిస్తున్నది కొన్నిలక్షల కుంది. అందువల్ల, నాకు డబ్బు గురించి

భయం అవసరం లేదు. లాయర్‌గా మోసా లతో సంపాదించవలసిన అవసరం అంతకన్నా లేదు. అందుకే – నిజమైన న్యాయవాదిగా నేను పేరు తెచ్చుకోవాలి కోర్టులు అందు బాటులో లేని నిర్దోషులైన పేదవాళ్ల తర పున వుచితంగా నయినా వాదించి వాళ్ళకి న్యాయం అందివ్వాలి. అంతకంటె నాకు జీవి తంలో ఏం కావాలి...

బస్సు ఏదో వూళ్లో ఆగడంతో నేను ఆలోచనల్లోంచి బయటపడ్డాను. కొంతమంది దిగారు. చాలామంది ఎక్కుతున్నారు. ఖాళీ అయిన సీట్లన్నీ నిండి పోయాయి. తర్వాత ఒక పెద్దమనిషి ఎక్కాడు. ఆయన్ని చూడ గానే పెద మనిషి అనిపిస్తున్నాడు. తెల్లటి పంచె. తెల్లచొక్కా, పైన కండువా, తెల్లగా పండిన తల, గంభీరంగా వున్న ముఖం— దాదాపు అరవై సంవత్సరాలుంటాయి ఆయ నకి. బస్సంతా నిండిపోవడం వల్ల ఆయనకి సీటు లేదు. నా పక్కన మాత్రం యిద్దరు కూర్చునే స్థలం వుంది. అయినా, అంతకు ముందు యిద్దరు కుర్రాళ్ళు అది చూసి కూడా, నా పక్కన కూర్చునే ధైర్యం లేక నిలబడ్డారు. అయితే, ఆ పెద్దమనిషి మాత్రం తన భుజం మీది కండువా సీటు మీద నా పక్కన వేసి చివరగా కూర్చు న్నాడు. మా డాడీ కన్నా సుమారు పదిహే నేళ్ళు పెద్దగా వున్న ఆయన నా పక్కన కూర్చున్నా తప్పులేదు. అయినా, మధ్యన కండువా వేసి కూర్చున్నాడంటే అతను ఎంత మంచివాడో అనిపించింది. అసలు ఆయన్ని చూడగానే ఎవరికైనా మంచి భావం కలుగు తుంది.

బస్సు కదలబోతుండగా ఒకతను కంగా రుగా వచ్చి, ''అయ్యయ్యా, బస్సు కాస్త ఆపండయ్యా'' అన్నాడు.

డ్రైవర్ బస్సు ఆపాడు.

''ఏ వూరు పోవాలి?'' అడుగుతున్నాడు కండక్టరు.

''కావలికి పొయ్యేవాళ్లెవరన్నా వున్నా రయ్యా బస్సులో?'' అనడుగుతున్నాడతను కిందనుంచే కంగారుగా.

''అదంతా నీ కెందుకయ్యా, నువ్వు ఎక్కుతావా లేదా చెప్పు, టైమయిపోతుంది. పోవాల'' అంటున్నాడు కండక్టరు.

''అయ్యయ్యో, అట్టనబాకయ్యా, కావలిలో దిగేవాళ్లెవరన్నా వుంటే వాళ్ళతో ఈ సంచి పంపాలయ్యా. కడుపుతో వున్న నా కూతురింక వళ్ళు, అరిసెలు పంపుతున్నానయ్యా'' అంటున్నాడతను బతిమాలుతున్నట్టు.

''నీ కూతురింటికి పోయి ఎవరిస్తా రయ్యా, పోపోపో'' విసుక్కున్నాడు కండక్టర్.

''బాబ్బాబు, బస్టాండు గేటుకానుకొనున్న సిగిరెట్టు కొట్లో యిస్తే చాలయ్యా, అది మా అల్లుడి కొట్టు. బాబ్బాబు, నేను పేదోడిని. కావలికి పోయి రావాలంటే చార్జీ అవుద్దయ్యా....'' ఇంకా ఏదో చెబుతున్నాడు.

ఇంతలో బస్సులో చలనం వచ్చింది.

''పోనీ లేవయ్యా, కండక్టరూ, ఏదో కడుపుతో వున్న అమ్మాయి అంటున్నాడు. ఆ మాత్రం మనిషికి మనిషి సాయం చెయ్యక పోతే ఎట్టా?'' అన్నారు కొంతమంది.

దాంతో కండక్టరు మెత్తబడ్డాడు.

బస్సు కింద నిలబడి మాట్లాడుతున్న ఆ మనిషి ధైర్యంగా బస్సు లోపలికి వచ్చాడు. ఆ మనిషిని చూస్తే నా కెందుకో మంచి అభిప్రాయంగాని సానుభూతి కాని కలగలేదు. 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్' అన్నది కరెక్టని నా వుద్దేశ్యం నాకు చిన్నప్పటి నుంచీ కనిపించిన ప్రతివాళ్ల ముఖాలూ చదివి ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం అలవాటు. అయితే, నా అంచనాలు తప్పయిన సందర్భాలు కూడా చాలా వున్నాయి.

''ఎక్కడియ్యాలో చెప్పయ్యా నే నిస్తా, నాది కావలేలే.'' అన్నాడు ఒకాయన లేచి నిలబడి. అతను మాసిపోయిన పంచె, ఒట్టి [illegible] నున్నాడు. దేశంలోని పేదరికమంతా అతని లోనే వున్నట్టుంది.

అయితే, ఆ వచ్చిన మనిషికి ఆ పేద వాడికి తన పని అప్పగించడం యిష్టం లేన ట్టుంది. ఇబ్బందిగా ముఖం పెట్టి, ''ఇంకె వ్వరూ కావలికి పొయ్యేవాళ్ళు లేరా?'' అనడి గాడు.

కండక్టర్ నా పక్కనున్న పెద్ద మనిషిని చూపించాడు త్వరగా కానివ్వమన్నట్టు.

ఆ పెద్ద మనిషిని చూస్తూనే అతను సంతోషంగా దగ్గరకు వచ్చి. ''అయ్యయ్యా, ఈ సంచీ బస్టాండు గేటు కానుకునుండే సిగిరెట్టు బంకులో యియ్యయ్యా. అది నా అల్లుడి కొట్టేలే. వాడిపేరు ఆదెయ్య'' అన్నాడు.

ఆ పెద్దమనిషి యిబ్బందిగా ముఖం పెట్టి ''నువ్వెవరో నాకు తెలియదు. నేనెవరో నీకు తెలియదు. అలాంటప్పుడు ఆ సంచీ నువ్వు నా కివ్వడం, నేను తీసికోవడం రెండూ బాగా లేవు'' అన్నాడు కచ్చితంగా. ఆయన కంఠం కూడా గంభీరంగా వుంది.

''ఇందులో బంగారమేమి లేదులే స్వామీ. ఏవో నాలుగు పళ్ళూ, నాలుగు అరిసెలూ దానికి పంపుతున్నాను. వీటిని పట్టుకుపోయి నువ్వేం బాపుకుంటావులేయ్యా. నీ మొహం చూస్తుంటే తెలియడంలా పెద్దమనిషివని. ఇందాక ఆయనెవరో అడిగితే ఆయనకిచ్చానా?''



మొదటి పాఠం

అయినా పెద్దమనిషి తల అడ్డంగా తిప్పాడు.

ఒక పక్క కండక్టరు టైమయి పోతున్నదని గొణుగుతున్నాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఆ పెద్దమనిషిమీద చాల కోపం వచ్చింది. ఆ మాత్రం సహాయం చేస్తే ఇతనికి పోయేదేమిటి? మరీ మనిషికి అంత స్వార్థం వుండకూడదు. ఈ పెద్దమనిషేగాని అతని పరిస్థితుల్లో వుంటే కన్న కూతురి గురించి ఈయన మనసు కూడా అంతగా కొట్టుకులాడదా?

బస్సులో మిగిలిన పాసింజర్లు కూడా ఆ పెద్దమనిషికి నచ్చ చెప్పారు.

ఎలాగైతేనేం ఆ పెద్ద మనిషి చివరికి అతని దగ్గర నుంచి ఆ చేతి సంచి తీసికొన్నాడు. ఆ తర్వాత ఆ మనిషి ఒక కవరు కూడా పెద్దమనిషి చేతికి యిచ్చి, "ఈ వుత్తరం కూడా మా అల్లుడి కియ్యయ్యా" అన్నాడు.

ఆ పెద్దమనిషి గొణుక్కుంటూ అది కూడా తీసికొన్నాడు.

తర్వాత బస్సు కదిలింది. ఆ పెద్దమనిషి అతనికి ఆ సహాయం చేస్తున్నందుకు నాకు కొద్దిగ మనస్సు స్థిమిత పడింది.

అయినా, నా మనసులో ఆ పెద్దమనిషి గురించే ఆలోచనలు చెలరేగుతున్నాయి. ఈ పెద్దమనిషిని చూస్తుంటే, లోకానికంతా సహాయం చేసే మహాత్ముడిలా వున్నాడు. కాని, యితనిలో ఎంత స్వార్థం వుంది! కడుపుతో వున్న కూతురికి అరిసెలు, పళ్ళు పట్టుకెళ్ళి యివ్వమని పాటి మనిషి బతిమాలుతుంటే, యితనికి కనికరమే కలగలేదు. నిజంగా మనిషిలో యింత స్వార్థం వుంటుందా! ఎదుటి మనిషికి చెయ్యగలిగిన సహాయం చేస్తే వచ్చిన నష్టం ఏముంటుంది! పాపపుణ్యాల మీద నమ్మకం లేకపోయినా, మానవత్వమనేది వుండదా?

ఆలోచిస్తూనే, ఆ పెద్దమనిషికేసి తప్పు డప్పుడు చూస్తున్నాను. మరో గంట తర్వాత బస్సు కావలి బస్ స్టాండులో ఆగింది.

అంతసేపు ఓపిగ్గా కూర్చున్నవాళ్ళు బస్సు ఆగగానే ఒకరిమీద ఒకరు పడి దిగుతున్నారు. కాసేపాగి, నెమ్మదిగా దిగితే ఏమవుతుందో? అంతా దిగిన తర్వాత దిగవచ్చని అలాగే కూర్చుని కిటికీలోంచి కిందికి చూశాను.

కింద బెనర్జీ అంకుల్ నవ్వుతూ చెయ్యి వూపారు.

అంకుల్ నల్ల కోటులోనే వున్నారు.

అంకుల్‌ని చూడగానే నాకు నా ఆశయాలు, నా ముందు జీవితం అంతా గుర్తుకొచ్చి, ఏదో ఆనందం ముసురుకొంది.

అంతా దిగిన తర్వాత నేను నెమ్మదిగా సూట్‌కేసు తీసికొని దిగాను. అంకుల్ పక్కన నిలబడి వున్న మనిషి నా సూట్‌కేసు అందుకున్నాడు. అతను అంకుల్ కారు డ్రయివరయ్యుంటాడనుకున్నాను.

"కమాన్ బేబీ" అంటూ అంకుల్ నా భుజంమీద ఆప్యాయంగా చెయ్యి వేశారు.

డ్రయివర్ ముందు వెళుతోంటే, మేము వెనుక నెమ్మదిగా నడుస్తున్నాము. అంకుల్ డాడీ గురించి అడుగుతుంటే, సమాధానాలు చెబుతూ నడుస్తున్నాను.

గేటు దాటగానే, ప్రక్కన వున్న సిగరెట్టు కొట్టు దగ్గర జనం మూగి వున్నారు. పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి.

అంకుల్‌తో పాటు నేను కూడా అటుకేసి ఆసక్తిగా చూశాను.

బస్సులో నా పక్కన కూర్చుని వచ్చిన పెద్దమనిషిని, ఎవరో నిక్కరు వేసికొని వున్న ఒక అతను చొక్కా పట్టుకోని తిడుతున్నాడు.

"చూడండయ్యా, ఈ పెద్దమనిషి ఏం చేశాడో. మా మామ నాకు ఈ సంచీలో అరిసెలు, పళ్ళతో పాటు ఒక వంద రూపాయలు మైనం కాగితంలో చుట్టి పెట్టి పంపుతున్నట్టు, ఈ పెద్దమనిషి తనకి బాగా తెలిసినవాడనీ రాసిపంపాడు. కాని, ఈ సంచీలో డబ్బు మాత్రం లేదు వీడు మాత్రం తనకు డబ్బు సంగతి తెలియదంటాడు. అసలు మా మామ కూడా తెలియదంటున్నాడు వీడెవడో తెలియకపోతే ఆయన ఆ సంచీ ఎట్లా యిస్తాడు? కావాలంటే, ఈ పుత్తరం చదవండి." అంటూ కాగితం పక్కన చూస్తున్న వాళ్ళకి అందించాడు నిక్కరతను.

పెద్దమనిషి ఏదో చెబుతున్నాడు.

అయితే, అతని మాటలు ఎవ్వరూ వినడం లేదు.

ఆ నిక్కరు వేసుకునున్న మనిషి ఆ సిగరెట్టు కొట్టతనని అర్థమవుతోంది. అతని పక్కన నలుగురు రౌడీలు సపోర్టుగా మాట్లాడుతున్నారు

"నాలుగు పీకితే వీడే యిస్తాడురా ఆ డబ్బు" అంటున్నాడు ఒక రౌడీ.

ఇంకొక రౌడీ తన్నబోయాడు.

మరో రౌడీ ఆ పెద్దాయన చొక్కా జేబులో చెయ్యిపెట్టి, డబ్బు తీశాడు. ఒక యాభై రూపాయల నోటు, రెండు రూపాయి కాగితాలు వున్నాయి. ఆ డబ్బు సిగరెట్టు కొట్టతని చేతికిచ్చి, "ఇదయినా దక్కింది లేరా" అంటున్నాడు ఆ రౌడీ నవ్వుతూ.

నాకు కోపంతో ఒళ్ళంతా మండిపోయింది. "అంకుల్, ఆ పెద్దమనిషికి నిజంగా ఏమీ తెలియదు. అదేదో స్టాప్లో ఒకతను వచ్చి, తన కూతురు కడుపుతో వుందని, ఆ సంచీ యిక్కడ సిగరెట్టు కొట్టులో యివ్వమని బ్రతిమాలితే ఆ పెద్దమనిషి ఒప్పుకున్నాడు పాపం...." అంటూ నేను అటు పక్కకి వెళ్ళబోతుంటే, అంకుల్ నా చెయ్యి పట్టుకొని ఆపి, "టేకిట్ ఈజీ బేబీ ఆ గొడవ విషయం మనకి అనవసరం. పద" అన్నారు.

"అదేమిటి అంకుల్, నేను జరిగింది కళ్ళారా … శాను. … శాను గనుక నేను అక్కడ నిజం చెప్పి ఆ పెద్దమనిషిని కాపాడుతాను..."

"నువ్వు కళ్ళతో చూసి వుండవచ్చు. కాని, చట్టానికి కళ్ళు లేవు. అది సాక్ష్యాలూ, ఆధారాలూ చెబితే వింటుంది. దట్సాల్ ఆ పెద్దమనిషి ఆ సంచీలో వున్న వంద రూపాయలు తీసికోలేదని నీకెలా తెలుసు?" సూటిగా అడిగాడు అంకుల్.

"నేను బస్సు దిగుతున్నంత సేపూ అతను నా పక్కనే వున్నాడు."

"వుండవచ్చు. కాని, అంతసేపూ అతను ఏం చేస్తున్నదీ నువ్వు గమనించావన్న నమ్మకం ఏమిటి? అయినా, నీకు గమనించవలసిన అవసరం ఏమిటి? దొంగతనం చేసేవాడు ఎవ్వడూ చూడకుండా సమయం కనిపెట్టిగదా తీస్తాడు? ఒకవేళ అతను బస్సులో తియ్యకపోయినా, బస్సు దిగిన తర్వాత తీసి వుండవచ్చు గదా?"


"బట్ అంకుల్... ఆ సంచీలో డబ్బు నిజంగా వున్నా ఆ విషయం అతనికి తెలియదు గదా?"

"ఇటీజ్ వెరీ సింపుల్. ఆ సంచీలో ఏముందో చూద్దామనే కుతూహలంతో చూసి వుండవచ్చు అప్పుడు డబ్బు కనిపించి వుండవచ్చు"

"మరి డబ్బుని ముక్కూ ముఖం తెలియని పెద్దమనిషిచేత పంపడం...'

"ఆ పుత్తరంలో పెద్దమనిషి తనకు తెలిసినట్టు రాశాడు ఆ మోసం చేసినవాడు" అంటూ నవ్వారు అంకుల్

"మరి తెలిసిన మ… …తే స…చీలో అంత నిర్లక్ష్యంగా డబ్బు పెట్టాడు దేనికి?



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

మొదటి పాఠం

ఆ వంద రూపాయలు ఆ పెద్దమనిషి చేతికే యివ్వవచ్చుగా?''

''పెద్దమనిషి మీద నమ్మకం కొద్దీ, అతను సంచీలో వస్తువులు తాకడనే వుద్దేశ్యం కొద్దీ అతను సంచీలోనే డబ్బు పెట్టానంటాడు.''

నేను తల విదిలించాను. ''అంకుల్.... పెద్ద మనిషేగాని ఆ డబ్బు దొంగిలించి వుంటే, ఆ సంచీకూడా యివ్వకుండా వెళ్ళవచ్చుగా?'' అడిగాను అసహనంగా.

''నో. సంచీ యిచ్చినవాడికి పెద్దమనిషి తెలుసని ఆ వుత్తరంలో వున్న విషయం నువ్వు మరిచిపోతున్నావు. అసలు సంచీయే యివ్వకుండా వెళ్తే, సంచీతోపాటు డబ్బు కూడా ఈ పెద్దమనిషే దొంగిలించినట్లు తర్వాతయినా ఆ మోసగాడికి తెలుస్తుంది గదా? అందువల్ల సంచీ యిచ్చి వుంటాడు.''

''ఒకవేళ పెద్దమనిషేగాని వంద రూపాయలు దొంగిలించి వుంటే, ఆ పెద్దమనిషి జేబులో ఆ వంద రూపాయలు వుండాలిగదా? కాని, అతని జేబులోంచి యాభై రెండు రూపాయలే గదా వాళ్ళు తీసింది?''

''ఆ వంద యింకెక్కడయినా దాచి వుంచవచ్చు. లేదా యింకెవరికైనా యిచ్చి వుండవచ్చు...''

''నో అంకుల్. నో...''

''నువ్వు చెప్పింది నిజమే నమ్మా. ఆ పెద్దమనిషి ఆ వందరూపాయలు తియ్యలేదని, అసలు ఆ సంచీలో వంద రూపాయలు లేవనీ— నీకు, నాకు, ఆ పెద్ద మనిషికి, ఆ పెద్దమనిషికి సంచీ యిచ్చిన మోసగాడికి, ఆ సిగరెట్టుకొట్టు వాడికీ, వాడి ప్రక్కనున్న రౌడీలకీ, చుట్టూవున్న జనానికీ — అందరికీ తెలుసు. ఇది ఒకవిధమైన దొంగతనం. చిన్న నాటకంతో ఆ పెద్దమనిషిని మోసం చేసి యాభై రెండు రూపాయలు రాబట్టారు.'' అన్నారు అంకుల్ నవ్వుతూ.

ఆ పెద్దమనిషి తలవంచుకొనిపోతున్నాడు. ఆ సిగరెట్టు కొట్టువాడు, రౌడీలతో కలిసి నవ్వుతున్నాడు.

బస్సులో పైనా చొక్కాకూడా లేని పేదవాడు ఆ సంచీ తను అందజేస్తానంటే, 'ఆ సంచీలో ఏ బంగారమూ లేదన్న' ఆ మోసగాడు ఆసంచీని ఆ పేదవాడికి విందుకు యివ్వనన్నాడో, ఎంత కాదన్నా యీ పెద్ద మనిషికే ఎందుకు ఆ సంచీని అంటకట్టాడో యిప్పుడు అర్థమవుతోంది అవును. వీళ్ళ నాటకంలో పాల్గొనడానికి ఆ పేదవాడి దగ్గర డబ్బులేదుగా? ఆ పేదవాడిని చివరిలో యిలా బెదిరించినా, కొట్టినా, అతని దగ్గర ఏమీ రాలవని ఆ మోసగాడికి తెలుసు. ఈ పెద్ద మనిషి నాలుగు డబ్బులున్న వాడిలా కనిపించాడు. అందుకే ఆ మోసగాడు తన నాటకంలో పాత్రకి యీ పెద్దమనిషిని ఎన్నుకున్నాడు. అనుకున్నట్టే సాధించాడు కూడా.

అలాగే ఆ పెద్దమనిషికూడా మంచి అనుభవం వున్నవాడే. అందుకనే, మొదట ఆయన సంచీ తీసుకోడానికి ఒప్పుకోలేదు. కానీ, అందరి బలవంతవల్ల అనుభవాన్ని అవతలకి నెట్టి, యాభై రెండు రూపాయలతో మరో 'అనుభవాన్ని' కొనుక్కున్నాడు.

బాధతో నాగుండె నలిగిపోతోంది. జరిగిన మోసాన్ని నాచేతనైనంత వరకు అడ్డుకోలేనందుకు ఏదో తప్పుచేసిన దానిలా ఫీలయ్యాను.

''కాని, అంకుల్, ఇంటాక నేను జరిగిందంతా వాళ్ళకి చెప్పి వుంటే ఏమయినా ఫలితం వుండేదేమో...'' అన్నాను బాధగా.

''నో. ఫలితం లేకపోగా, నిన్నుచూసి మరో వందమంది చుట్టూ పోగయ్యేవాళ్ళు. చూడు బేబీ, నువ్వు యింత చిన్న మోసానికే అంత కలవరపడిపోతే న్యాయవాదిగా రాణించలేవు. ఫర్‌గెట్ ఎవ్విరిథింగ్. అంతేకాదు. ఇదే కేసు రేపు కోర్టుకు వచ్చి, ఆ సిగరెట్టుకొట్టు వాడే తన తరుపున వాదించమని నిన్ను అడిగితే- నువ్వు కళ్ళతో చూసినదంతా మరిచిపోయి— ఆ సిగరెట్టు కొట్టు వాడిదే నిజమనీ, ఆ పెద్ద మనిషే ఆ వంద రూపాయలు కొట్టేశాడని వాదించి కేసు గెలవగలగాలి. అప్పుడే నువ్వుమంచిలాయర్‌గా పేరు తెచ్చుకుంటావు. ఇది నా జూనియర్‌గా నీకు నేను చెప్పే మొదటి పాఠం.'' అన్నారు అంకుల్ కారు ఎక్కుతూ.

నేను కారులో ఎలా కూర్చున్నానో, కారు ఎప్పుడు స్టార్టయిందో నాకు తెలియలేదు. ★

హైదరాబాద్ నోట్‌బుక్


తిరుమల రామచంద్ర

వేంకటరంగయ్య అవార్డు :

శ్రీ మామిడిపూడి వేంకట రంగయ్య స్మారక సంస్థ ఫిబ్రవరి 2 వ తేదీన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ ఫారిన్ ల్యాంగ్వేజెస్ ఆవరణలో జరిగిన ఉత్సవంలో బొంబాయి విశ్వవిద్యాలయం పౌర, రాజకీయ శాస్త్రశాఖాధ్యక్షులు ఆచార్య ఎస్. ప్రభాకర అయ్యర్‌కు పదివేల రూపాయల బహుమతిని ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ బహిరంగ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. రాంరెడ్డి ఈ బహుమతిని ఆచార్య అయ్యరుకు అంద జేశారు. ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్య గొప్ప విద్యావేత్త, విద్వాంసుడు అని, ఆయన రాజనీతిశాస్త్రంలోనేకాక, ఆర్థిక శాస్త్రంలోను, చరిత్రలోను నిష్ణాతులని, ఆయన పేర ఇలాటి బహుమతిని ఏర్పాటుచేయడం ముదావహమని ప్రొఫెసర్ రాంరెడ్డి అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం సాంఘిక శాస్త్రశాఖ డీన్ ప్రొఫెసర్ ఆర్. వి. ఆర్. చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం రాజకీయ శాస్త్ర శాఖాచార్యులు డాక్టరు బి. ఎ. వి. శర్మ ఆచార్య ప్రభాకర అయ్యర్‌ను పరిచయం చేశారు. స్వతంత్ర సమాజంలో రాజకీయ నాయకత్వానికి ఆచరణాత్మక వివేకం లనగా దూరదృష్టిసహితమైన సాహసం, సచ్ఛీలం, సమర్పణ ప్రధాన లక్షణాలని ప్రభాకర అయ్యర్ తమ ప్రసంగంలో రాజకీయ నాయకత్వాన్ని నిర్వచించారు. రాజ్య, ప్రభుత్వ సిద్ధాంతాల పరిణామాన్ని ఆయన వివరిస్తూ, ప్రజాస్వామ్యం నియంతృత్వానికి లొంగిపోయే మార్గాలు చాల వున్నాయని, ప్రజలు తరచు ఎవరినో సంపూర్ణంగా విశ్వసించి ఒకరిని సంరక్షకుడని భావించడమే కాక, అతనికి తమ హక్కులను ఒడ్డడం కూడ సంభవించిందనీ,ఇది స్వేచ్ఛా సంస్థలను రక్షించుకోవలసిన పౌరజీవిత పరాజయ పరాకాష్ఠలుఅని ఆయన అన్నారు. ఏది ఉత్తమ ప్రభుత్వం, అది ఎలా సాధ్యమనే అరిస్టాటిల్ నుంచి నేటివరకు రాజనీతి శాస్త్రంలో ప్రధాన చర్చా విషయమని, ఏ ప్రభుత్వాన్నయినా కూలదోయడానికి నిరంతరం ప్రయత్నించే వంచకులజిత్తులను తట్టుకోగల నిర్దుష్ట ప్రభుత్వాలు వుండవని, మారుతున్న సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగం సవరణ అవసరమని, కానీ ఈ విషయంలో వివేకం మార్గదర్శకం కావాలని ఆయన అన్నారు. రాజకీయాలు ఒక వృత్తి. లేక వృత్తిగా వుండడ మన్నా అవసరం. రాజకీయాలు ఏమీ తెలియని వెర్రి దేశభక్తి అర్హత అయిన కేవలోత్సాహి చేతుల్లో పడరాదు., ప్రజా శ్రేయస్సుని ప్రగల్భాలు పలికే జిత్తుల మారి చేతుల్లోనూ పడరాదు. తానేదో దేవదూత అని చెప్పుకొని అందరినీ దివ్య లోకాలకు తీసుకొని పోతాననే ఆస్తికమ్మన్యుల కీలు బొమ్మకారాదు— అని ఆయన హెచ్చరించారు. ప్రారంభంలో శ్రీ వేంకట రంగయ్య స్మారక సంస్థ నిర్వాహకులు, మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఆనందం సంస్థ ఉద్దేశాలు వివరించారు. దేశంలో సాంఘిక శాస్త్రాల క్రమబద్ధాధ్యయనాన్ని రాజనీతి, ఆర్థిక శాస్త్రం, శిక్షణ శాస్త్రం, చరిత్రలలో పరిశోధనను ప్రోత్సహించడం, పుస్తక ప్రచురణ కార్యక్రమం చేపట్టడం సంస్థ ప్రధాన లక్ష్యాలని, సాంఘిక శాస్త్రములో సుప్రసిద్ధులయిన విద్వాంసుని ఏటా పది వేల రూపాయల బహుమతితో సత్కరించడం లక్ష్యాలలో ఒక్కటని శ్రీ ఆనందం తెలిపారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం చరిత్ర శాఖాధ్యక్షురాలు డాక్టర్ శ్రీమతి వైదేహి వందన సమర్పణ చేస్తూ, పరిశోధక విద్వాంసులకు తోడ్పడడం కోసం శ్రీ వేంకట రంగయ్య రచనల సంకలనం సిద్ధ పరచదలచామని అన్నారు,

బేహారులున్నారు బహుపరాక్ !

ఇది జట్ యుగం గనుక దానికి తగినవేగంతో పనులు జరుగాలని ముఖ్యమంత్రి శ్రీ తారక రామారావు ఇటీవల ఒక బహిరంగసభలో అన్నారు. ఆయన జట్ వేగంతోకాదు, శబ్దవేధి వేగంతోను, కొత్త వేగంతోను పయనిస్తున్నారు. ఆ వేగాన్ని ఇతరులు అందుకోవాలంటే మాటలా! ఆ వేగానికి, కాంతికి కనులు మిరుమిట్లు గొన్న కొందరు వెనక, పక్కన గోతులు తవ్వడానికి ప్రయతిస్తున్నారు. కనుక లక్ష్యం చేరుకోడానికి అడుగులు నెమ్మదిగాను, గట్టిగాను వేయాలి. వేగంలో పరిసరాలలో పొంచివున్న, ప్రతికూల పరిస్థితులు కనిపించవు. నెమ్మదిగా అడుగులు వేసినప్పుడు ఇరుగు పొరుగున పరిక్షించడానికి అవకాశం వుంటుంది. ఎన్నికల సమయంలో భజన్‌లాల్ వంటి బడా నాయకులు, ఆయారాం—గయారాం వ్యాపారంలో ఆరితేరిన బేహారులు రాష్ట్ర రాజధానిలో తిష్టవేశారని విన్నాము. వారు తమ పార్టీకి కొంత పందైనా దొల్లడు పుచ్చుకాయలు దొర్లి రాక పోతాయా అని సంచులు తెరుచుకొని పంచల్లో పచారు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆ పరిస్థితి దాటి ప్రత్యర్థి వర్గం ప్రభుత్వం ఏర్పడడంతో బేజారెత్తిన బడా నాయకులు ఇప్పుడు మరొక చీకటి బేరానికి దిగినట్లు వదంతులు




హైదరాబాద్ నోట్ బుక్

వ్యాపించాయి. ముఖ్యమంత్రి నియంతృత్వ ధోరణితో మంత్రులు కూడ విసిగిపోయారని, శాసన సభ్యుల అతీగతీ లేదని అధికార పార్టీని చీల్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికార పక్షం వదలి వచ్చేవారికి ఐదారు లక్షల వరకు ఎర చూపుతున్నారని జంట నగరాలలో వదంతులు విపరీతంగా వున్నాయి. అవినీతి అనేది ఒక్క వ్యక్తితో జరిగేది కాదు గదా! ఎందరిచేతులో పడాలి, వాటికి పెద్ద అభయ హస్తం వెనుక వుండాలి. ఇప్పటి అవినీతి నిర్మూలన నాగయజ్ఞములో ఎందరు పెద్దలు సహేంద్రాయ తక్షకాయ' అవుతారో అనే భయంతో కూకటి వేళ్లనే నరికి వేస్తే మంచిదనే ధోరణిలో ప్రభుత్వాన్ని కూల్చడానికి గోతులు తవ్వుతున్నారని గుసగుసలు విస్తరించాయి. అధికార పక్షం విధాన సభ్యులలో అత్యధిక సంఖ్యాకులు ఎత్తులు జిత్తులు ప్రధానమైన రాజనీతి తెలియనివారు గనుక ఎదిరి ఎత్తులకు ఎదువుకొని పడే ప్రమాదం వుంది. కనుక అధికార పక్షం జాగరూకతతో ప్రవర్తించాలి, వేయి కనులతో చూడాలి. బొంబాయి విశ్వవిద్యాలయం సాంఘిక శాస్త్రాచార్యులు ఆచార్య ఎస్. ప్రభాకర అయ్యర్ అన్నట్లు నాయకునికిగాని, పాలక పక్షానికిగాని కేవలం దేశభక్తి, ప్రజాశక్తి చాలదు. విచక్షణ, దూరదృష్టి అవసరం. వేడి, వేగం వున్నప్పుడే ఏ పనిపన్నైనా అనుకున్నంత ప్రయోజనం వుండగలదనడం నిజమే. కాని, ఆ వేడి, ఆత్మ ప్రయోజన దాహకం గాను, ఆ వేగం ఆత్మపాతకంగాను పరిణమించరాదు. కొంచెం సెగ పుడితే విగసనతోసే జంఝావాతాలు, వేగంతో కొంచెం తూలితే బోరగిల పడవేసే చాణూరనిచయాలు వుంటాయి. అలాంటి వాటికి ఒక్కసారు లొంగితే దేశభక్తి, ప్రజాశక్తి, సిద్ధాంత రక్తి బలయిపోతాయి. తన బలం ఎంతగొప్పదయినా ఎదిరి బలాన్ని పెద్దగా అంచనా వేసి ఆచి తూచి అడుగులు వేయమన్నాడు చాణక్యుడు.

ఉపశ్రుతి :

ఏంసార్, అంతగా విరుచుకొని పడ్డారే అక్షెవీాల పైన ? ఇంతకు ముందు పనిష్మాన్ని కొనిపోగిడారే ? మాట నిలుకడ లేదా ? అని నిలదీశారు నన్నొకరు. అయ్యా, మంచిని పెంచడం, చెడును చెరిగివేయడం పత్రికా రచయితల పని. మంచి చేసినప్పుడు పొగడుతారు, చెడ్డపని అని తోచినప్పుడు తూర్పారబడుతారు — అని సమాధాన మిచ్చారు మరొకరు. ✻

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna



అమృతాంజన్‌కే తెలుసు ఒంటి నొప్పులు

అమృతాంజన్‌తో మీరు నిజంగా నొప్పులు బాధలు మర్పించేస్తున్నారు. నాలుగుసార్లు గట్టిగా తడిమితేచాలు మీ నొప్పులు అప్పుడే తగ్గుముఖం పట్టేస్తాయి.

ఘాటైన ఇతర మందులలాగకాక బాధ వుండేచోట అమృతాంజన్ పై చర్యవల్ల అతిశీఘ్రంగా గుణం ఇట్టే కనిపిస్తుంది. శక్తివంతమైన 10 ఔషధాలు చేరిన మందు ఏ యితర బాధలను కలిగించదు.

85 సంవత్సరాల పైబడిన ప్రసిద్ధి గల అమృతాంజన్ బెణుకులు. తల నొప్పి మరియు జలుబులకుకూడా బాగా పనిచేసి అమోఘంగా నివారిస్తుంది.


ఈ బాధలు చెప్పిరావు. అనుకోకుండా వస్తూంటాయి. అందుకే చేతికి అందుబాటుగా అమృతాంజన్ వుంచుకోడం మంచిది. ఎప్పుడు అవసరమవుతుందో మీకసలు తెలియదు.



అమృతాంజన్

శీఘ్రనివారిణి. నమ్మకమైనది. ఏ ఇతర బాధనూ కలుగచేయదు.

OBM 7656 TG


1983 బొంబాయి
బిజీతార
జయప్రద
తాజా వార్తలతో పాటు
తాజా సినిమా కబుర్లు
అందించే
ఏకైక దినపత్రిక....
ఆంధ్రపత్రిక
దినపత్రిక కావలసినవారు మా వారపత్రిక అమ్మేచోట అడగండి.
లేదా మా ఏజెంటును సంప్రదించండి.